అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శనివారం 5-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 3 సంచిక : 218 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

రాహుల్‌పై రాళ్ల దాడి

ధ్వంసమైన వాహనం

- గుజరాత్ పర్యటనలో ఘటన






అహ్మదాబాద్: గుజరాత్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీకి ఊహించని ఘటన ఎదురైంది. ఆయన వాహనంపై గుర్తు తెలియని దుండగులు రాళ్ల దాడి చేశారు. అయితే.. ఈ దాడి నుంచి రాహుల్ సురక్షితంగా బయటపడ్డారు. బనాస్కంత జిల్లాలో వరద బాధితులను కలుసుకునేందుకు శుక్రవారం రాహుల్‌గాంధీ పర్యటన చేపట్టారు. కాగా ధనేరాలోని లాల్‌చౌక్ ప్రాంతంలో రాహుల్‌కు కొందరు నల్లజెండాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కొద్దిసేపటి తర్వాత ఆయన కాన్వాయ్‌పై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లదాడికి తెగబడ్డారు. ఈ దాడిలో ఆయన కారు కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌ఓజీ) కమాండో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కాన్వాయ్‌పై రాళ్లు విసిరిన వ్యక్తుల్లో ఒకరిని ఘటనా స్థలిలోనే అదుపులోకి తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ నీరజ్ బద్గుజర్ తెలిపారు.

బీజేపీ బెదిరింపులకు భయపడను: రాహుల్

రాళ్లదాడిపై రాహుల్‌గాంధీ ట్విట్టర్‌లో తీవ్రంగా స్పందించారు. బీజేపీ నేతల దాడులకు భయపడబోమనీ ప్రజలకు అండగా ఉంటామనీ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎప్పటికీ వెనకడుగు వేసేది లేదని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ కాన్వాయ్‌పై బీజేపీ గూండాలు సిమెంటు ఇటుకలతో దాడి చేశారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ ...9లో



కొలువు పోదు...
పర్మినెంట్ కాదు!

కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత

రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం కొత్త ఆలోచన చేయబోతున్నట్టు తెలుస్తోంది. క్రమబద్ధీకరణపై కోర్టుల్లో కేసులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్న యోచనలో ఉంది. క్రమబద్ధీకరణ అన్న ఒక్కమాట లేకుండా ఉద్యోగ భద్రత, సమానవేతనం కల్పించాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీనిప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న అన్ని సౌకర్యాలను వారికీ వర్తింపచేయనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం త్వరలో నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని అధికార టిఆర్ఎస్‌పార్టీలోని ఒక నేత వెల్లడించారు.



బొల్లె జగదీశ్వర్

మినిమం టైంస్కేల్ ఇవ్వడంతో ఆర్థిక వెసులుబాటు

- క్రమబద్ధీకరణపై సర్కారు కొత్త ఆలోచన
- కోర్టు కేసుల నేపథ్యంలో మారిన వ్యూహం

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల విలీనం విషయంలో హైకోర్టు చేసిన సూచనను ప్రభుత్వం అనుకూలంగా తీసుకుంది. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 20,903 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సమానపనికి సమానవేతనం కల్పించాలని ఆదేశించింది. ఈ తీర్పును ముఖ్యమంత్రి కేసీఆర్ స్వాగతించారు. దీనినే అన్ని విభాగాల్లోనే కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తింపజేయాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చారని తెలిసింది. దీనివల్ల లక్షా 40 వేల మందికి లబ్ధి చేకూరనుందని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవో నెంబర్ 16 అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులు అభద్రతలో ఉన్నారు. వేతనాలు పెంచినా భవిష్యత్తు ఏంటన్న దానిపై ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వారందరికీ ఉద్యోగం పోకుండా పూర్తికాలం కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో ప్రతిపక్షాల నోరు కూడా మూయించినట్టవుతుందనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది.

కొలువుకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు

కాంట్రాక్టు ఉద్యోగుల కొలువుకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిసింది. మినిమం టైంస్కేల్ వర్తింపచేసి ఆర్థిక వెసులుబాటు కల్పించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కాంట్రాక్టు జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ ...9లో

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యలు

- మహారాష్ట్రలో నాలుగు నెలల్లో 855 మంది
- రాజ్యసభకు తెలిపిన కేంద్ర వ్యవసాయశాఖమంత్రి
- ఛత్తీస్‌గఢ్‌లో 30 నెలల్లో 1271మంది: ఆ రాష్ట్ర ప్రభుత్వ లెక్క

వివరాలు 2లో

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నికలు

వివరాలు 2లో

ఉన్న మాటంటే ఉలుకెందుకు?

- కేసులు వేసి అభివృద్ధిని అడ్డుకుంటుంది కాంగ్రెస్సే..
- పిటిషన్లు వేసిన వారి పేర్లు గాంధీభవన్‌కు పంపిస్తాం
- కుట్రలు, కుతంత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం : భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ - సిద్దిపేట

ఉన్న మాటంటే కాంగ్రెసోళ్లకు ఉలుకెందుకు? అని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ఆవేదన ప్రతిపక్షాలకు అహంకారంగా కన్పించడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవులు త్యాగం చేసి, ఎన్నో ఉద్యమాల ద్వారా పోరాడి సాధించిన తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దాలని కేసీఆర్ ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని చెప్పారు. ఇదే విషయమై ప్రెస్‌మీట్‌లో ఆవేదనతో మాట్లాడిన సీఎంను కాంగ్రెసు నేతలు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. 'కోర్టు కేసులు వేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తుంది మీరు కాదా?' అని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఐదుగురు నాయకులు వారి పేర్లతోనే కోర్టులో కేసులు వేశారని తెలిపారు. నీటి పారుదల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్లు వేసి వాదిస్తున్నది కాంగ్రెస్ నాయకులు కాదా? అని ప్రశ్నించారు. 'కోర్టులో కేసులు వేసి అడ్డుపడుతున్న వారి వివరాలు గాంధీభవన్‌కు పంపిస్తాం. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చదువుకుని సమాధానాలివ్వండి. కేసుల మీద సమీక్ష చేసుకుని ఆత్మవిమర్శలు చేసుకోండి' అని సూచించారు. 'మీరు అధికారంలో ఉండి చేయలేకపోయిన పనులు మేం చేస్తున్నామని ...9లో

ఉద్యోగం ఇస్తామంటూ...

యువతిపై లైంగిక దాడి

- నగ్న చిత్రాలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపు
- ఆ తర్వాత మళ్లీ వేధింపులు
- పోలీసులకు యువతి ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి

9లో



చావుకూ ఆధార్ లింక్

- అక్టోబర్ 1 నుంచి అమలు: కేంద్రం



న్యూఢిల్లీ: వ్యక్తి చనిపోయినట్టు ధ్రువీకరించాలంటే ఆధార్ నెంబరు తప్పనిసరిగా ఉండాలని కేంద్రం ప్రకటించింది. ఈ విధానం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. జమ్మూకాశ్మీర్, అసోం, మేఘాలయ మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇది వర్తిస్తుందని చెప్పింది. ఈ మూడు రాష్ట్రాల్లో ఇది అమలయ్యే తేదీలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నది. చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రాన్ని అతడి కుటుంబసభ్యులు పొందాలంటే.. ఆధార్ సంఖ్య లేదా ఎన్‌రోల్‌మెంట్ నెంబరు తప్పనిసరిగా పేర్కొనాలని తెలిపింది. ఒకవేళ ఆధార్ లేకుంటే సదరు వ్యక్తికి శాశ్వత నమోదు సంఖ్య లేదని తెలుపుతూ ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నట్టు వివరించింది. అయితే.. మరణ ధ్రువీకరణకు సంబంధించి జరుగుతున్న మోసాలన్న అరికట్టేందుకే ఈ విధానం అమల్లోకి తెస్తున్నట్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం వెల్లడించింది. రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం కేంద్ర హోంమంతిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంటుంది.



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

లంచాలిచ్చే పరిస్థితి పోవాలె

గ్రామాల రూపురేఖలు మారుస్తా

- కేశవరం, లక్ష్మాపురం గ్రామాల అభివృద్ధికి రూ. 27 కోట్లు
- రెండు గ్రామాల్లో 200 డబుల్ బెడ్‌రూమ్‌లు
- ఆరు మొక్కలు పెంచిన ఇంటికి రెండు పాడి పశువులు: సీఎం

9లో

సిలబస్ కొంపముంచింది

- పేపర్-2లో భారీగా తగ్గిన ఉత్తీర్ణత
- పేపర్-1లో 57.37శాతం, పేపర్-2లో 19.51శాతం అర్హత
- టెట్ ఫలితాలను విడుదల చేసిన విద్యాశాఖ కమిషనర్ కిషన్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్‌టెట్)-2017 అభ్యర్థులను కొత్త సిలబస్ దెబ్బతీసింది. దీంతో పేపర్-2లో గతేడాది కంటే భారీగా ఉత్తీర్ణత శాతం తగ్గింది. పేపర్-1లో 57.37శాతం, పేపర్-2లో 19.51శాతం మాత్రమే అభ్యర్థులు అర్హత సాధించారు. పేపర్-2లో గతేడాది నిర్వహించిన టెట్‌లో 25.05శాతం ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే. పాఠశాల ...9లో



సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి తప్పించుకోలేరు : పొన్నం
- దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలేదీక్ష ప్రారంభం

నవతెలంగాణ-కలెక్టరేట్

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నేరెళ్ల ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారించాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ గజ్జెల కాంతం ఆధ్వర్యంలో శుక్రవారం రిలేదీక్ష ప్రారంభించారు. దీక్షకు పలు రాజకీయ పార్టీల సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్, బండి సంజయ్ మాట్లాడుతూ... పోలీసుల పహారాతో ఉద్యమాలు అణచలేరని, ఖాకీలతో పరిపాలన సాగించాలనుకుంటే పతనం తప్పదని హెచ్చరించారు. ఇసుక లారీల ప్రమాదంలో ఎంతో మంది బలవుతున్నారని, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగితే ఏ ఒక్క లారీ డ్రైవర్‌పైనా కేసు నమోదు కాలేదంటే రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గపు పాలనకిది నిదర్శనమన్నారు. న్యాయం కోసం జెండాలు పక్కన పెట్టి ఏకతాటికి వస్తున్నామని చెప్పారు. జాతీయ ఎస్సీ కమిషన్ నివేదిక నుంచి రాష్ట్ర సర్కారు తప్పించుకోలేదని అన్నారు. దీక్షకు ఆలిండియా ఫార్వర్డ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండా సురేందర్‌రెడ్డి, ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ వంశీధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొరవివేణు గోపాల్, కాంగ్రెస్ జిల్లా కమిటీ నాయకులు కర్ర రాజశేఖర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. కె.నగేశ్, దళిత సంఘాల నాయకులు గజ్జెల ఆనందరావు, సుద్దాల లక్ష్మన్ మద్దతు తెలిపారు.



దళితుల దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

మరిన్ని వార్తలు 10లో



పీఎం భార్గవ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని, చిత్రంలో వెంకట్, తదితరులు

కన్నీటి వీడ్కోలు...

9లో

అధికార లాంఛనాలతో పీఎం భార్గవ అంత్యక్రియలు

మద్యం మత్తులో...



ముంబయి: మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు 2000 అడుగుల లోతున్న లోయలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన మహారాష్ట్రలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన అంబోలి ఘాట్ వద్ద చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. కొల్హాపూర్‌లోని పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తున్న ఏడుగురు యువకుల బృందం ఈనెల 1న సింధుదుర్గ్ జిల్లాలోని అంబోలిఘాట్‌కు వెళ్లింది. అక్కడ కవాలే పాయింట్ దగ్గర కొద్దిసేపు గడిపిన అనంతరం అందరూ వేరే చోటుకు పోయారు. కానీ, బృందంలోని ఇమ్రాన్ గరాడీ(26), ప్రతాప్ రాథోడ్(21)లు తిరిగి ఆ పాయింట్ వద్దకే వెళ్లారు. చేతిలో మద్యం సీసాలు పట్టుకొని లోయ ఫెన్సింగ్‌పైకి ఎక్కారు. అలా రెండుసార్లు దిగి ఎక్కిన వారు చివరకు లోయలో దూకారు.. మిత్రులు తిరిగి రాకపోవడంతో ఆ బృందం.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా.. మద్యం మత్తులో ఉన్న యువకులిద్దరూ లోయలో దూకిన విషయాన్ని స్థానికులు.. పోలీసులకు తెలిపారు. వెంటనే పర్వతారోహకుల బృందాన్ని రంగంలోకి దింపారు. వారిద్దరి మృతదేహాలు కనిపించాయని సీనియర్ పోలీసు అధికారి సునీల్ ధనవాడే శుక్రవారం వెల్లడించారు. అయితే.. వాతావరణం అనుకూలించకపోవడంతో మృతదేహాలను ఇంకా స్వాధీనం చేసుకోలేదని ఆయన వివరించారు.

ఎన్డీఏ ఉపరాష్ట్రపతి ప్రాక్టీస్ పోల్

- **16 మంది ఎంపీలు ఫెయిల్**

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో.. ఎన్డీఏ పక్షాల పార్లమెంటు సభ్యులతో శుక్రవారం ఢిల్లీలో మాక్ పోలింగ్ నిర్వహించారు. దీనిలో ప్రధాని మోడీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సహ పలువురు సీనియర్లు పాల్గొన్నారు. అయితే ఈ మాక్ పోలింగ్‌లో ఎన్డీఏ కూటమికి చెందిన 16 మంది ఎంపీలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. దీంతో ఇవి చెల్లని ఓట్లుగా మారాయి. దీంతో బీజేపీ శ్రేణుల్లో కలకలం మొదలైంది. చెల్లని ఓట్లు వేసిన వారిలో పదిమంది బీజేపీ ఎంపీలు కూడా ఉండటం గమనార్హం. ఈ పోలింగ్ జరిగేటప్పుడు ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడూ ఉన్నారు. శనివారం జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తమ వాళ్లే ఎక్కడ కొంపముంచుతారోనన్న భయం వెంకయ్యతో సహ సీనియర్లను కనిపించింది.

తేజస్వీ 'విశ్వాస్‌ఘాత్ యాత్ర'

- **ఈ నెల 9న చంపారన్‌లో ప్రారంభం**

పాట్నా: ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మోసాలను, బీజేపీ కుట్రలను ప్రజలకు తెలియజేసేందుకు బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సిద్ధమయ్యారు. ఈనెల 9 నుంచి ఆయన 'విశ్వాస్‌ఘాత్ యాత్ర'ను నిర్వహించనున్నట్టు రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) రాష్ట్ర చీఫ్ రామచంద్ర పూర్వే శుక్రవారం వెల్లడించారు. తూర్పు చంపారన్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద తేజస్వీ నివాళులర్పించి, యాత్రను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ యాత్ర ముగింపు రోజున(ఈనెల 27) పాట్నాలోని గాంధీ మైదాన్ వద్ద 'బీజేపీ హఠావో.. దేశ్ బచావో' పేరుతో ఆర్జేడీ భారీ ర్యాలీని నిర్వహించనున్నది. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రతిపక్ష పార్టీల అగ్ర నాయకులకు లాలూ ప్రసాద్‌యాదవ్ ఇప్పటికే ఆహ్వానం పంపారని రామచంద్ర తెలిపారు. కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ, తృణమూల్, వామపక్ష పార్టీల సీనియర్ నేతలు ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు. అయితే, ర్యాలీలో కాంగ్రెస్ పాల్గొనేది అనుమానమే అని ఆ పార్టీ రాష్ట్ర చీఫ్, మాజీ విద్యాశాఖ మంత్రి అశోక్ చౌదరీ అన్నారు. నితీశ్ మహాకూటమిలో కాంగ్రెస్ కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల మహాకూటమి నుంచి తప్పుకున్న నితీశ్.. బీజేపీతో కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు.. తేజస్వీ యాదవ్ త్వరలోనే కోర్టు-జైలు యాత్ర చేస్తారని జేడీ(యూ) ఎద్దేవా చేసింది. బినామీ ఆస్తుల కేసులో ఆయనపై సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయాన్ని జేడీ(యూ) అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ గుర్తు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, ఆయన జైలుకు వెళ్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన తెలిపారు.

మొన్న టమాటా.. ఇప్పుడు ఉల్లి

- **సామాన్యుడిని కన్నీరు పెట్టించడానికి రెడీ**

నాసిక్: టమాటా ధరలు అల్లాడిస్తుంటే.. తాజాగా ఉల్లిపాయలు సామాన్యుడిని కన్నీరు పెట్టించబోతున్నాయి. గతనెల నుంచి ఉల్లి ధరలు మూడింతలు పెరిగాయి. రైతుల వద్ద నుంచి దళారులు సేకరించినప్పుడు కిలో రూపాయి కూడా ధర పలకని టమాటా.. నెలరోజులకు పైనుంచి వంద రూపాయల వరకు ధర పలికింది. ఇటీవల టమాటా ధరలు కొంత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం మార్కెట్లో రూ.50 నుంచి 70 వరకూ పలుకుతోంది. పేదలైతే కూరల్లో టమాటాను వాడటం దాదాపుగా మానేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే రోజుల్లో ఉల్లి ధరలు గృహిణుల కండ్లలో కన్నీరు పెట్టించనున్నాయి. ఉల్లి పంటను దేశవ్యాప్తంగా పలు చోట్ల పండించినా.. మహారాష్ట్రలోనే అత్యధికంగా ఉత్పత్తి అవుతున్నది. ఆసియా దేశాల్లోనే అత్యధిక ఉల్లి ఉత్పత్తి జరిగే మహారాష్ట్రలోని నాసిక్ మార్కెట్ యార్డులో ధరల్లో 80 శాతం పెరుగుదల కనిపించింది. నాసిక్‌లోని లాసల్‌గావ్‌లోని యార్డులో క్వింటాలు ఉల్లిధర రూ.1,240 నుంచి రూ.2,340కి చేరింది.

ధర పెరగటానికి కారణాలివే..

దేశంలోని పలు రాష్ట్రాలు భారీ వర్షాలతో అతలాకుతలమయ్యాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లోనూ ఉల్లి వినియోగం ఎక్కువగా ఉండటంతో.. నాసిక్ మార్కెట్ యార్డులో ధరల పెరుగుదలకు కారణమైందని అక్కడి వ్యాపారులు తెలిపారు. దీంతో సామాన్యులపై ఉల్లి ధర భారం పడుతు న్నదని తెలిపారు. గతేడాది దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఉల్లిపంట వేయటంతో ధరలు కూడా అదుపులో ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు. నాలుగేండ్ల కిందట ఉల్లి ధర కిలోకు రూ.80 నుంచి వంద దాకా పలికింది.

పాక్ నుంచి పెరిగిన చొరబాటు యత్నాలు

- **ఈ ఏడాది 285 కాల్పుల విరమణ ఉల్లంఘనలు**

న్యూఢిల్లీ: జమ్మూకాశ్మీర్ సరిహద్దు నుంచి ఉగ్రవాదులను పంపే యత్నాలను పాకిస్తాన్ ముమ్మరం చేసిందని రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ఈ ఏడాది ఇప్పటి (ఆగస్టు 1) వరకూ నియంత్రణ రేఖ వెంట 285 కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన ఘటనలు జరిగాయని, వీటిలో బీఎస్‌ఎఫ్‌తోపాటు సైన్యం కాపలా కాస్తున్న అంతర్జాతీయ సరిహద్దు వెంట 221 ఘటనలు జరిగాయని జైట్లీ తెలిపారు. గతేడాది(2016లో) మొత్తం మీద 228 ఉల్లంఘన సంఘటనలు జరిగాయని, ఆ ఘటనల్లో భారత్‌వైపు నుంచి 8మంది చనిపోగా, పాక్ వైపున పెద్ద సంఖ్యలోనే ప్రాణ నష్టం జరిగినట్టు ఆయన చెప్పారు. అయితే,ఈ ఏడాది జరిగిన ప్రాణ నష్టం గురించి జైట్లీ వెల్లడించలేదు. శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో జైట్లీ ఈ వివరాలను వెల్లడించారు. భారత సైన్యం నిరంతరం నిఘా పెంచడంతో చొరబాటు యత్నాలను భగ్నం చేయగలిగినట్టు జైట్లీ తెలిపారు. పశ్చిమ సరిహద్దులో మన సైన్యానిదే ఆధిపత్యమని ఆయన చెప్పారు. పొరుగు దేశం నుంచి ఉగ్రవాదులు మన దేశంలోకి చొరబడకుండా రాడార్లు, సెన్సర్లు, థర్మల్ ఇమేజర్లను ఉపయోగించి నిఘాను పటిష్టం చేసినట్టు రక్షణమంత్రి తెలిపారు.

సుష్మపై సభాహక్కుల తీర్మానాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌పై కాంగ్రెస్ శుక్రవారం సభాహక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రెండు అంశాలకు సంబంధించి సుష్మపై కాంగ్రెస్ ఈ తీర్మానం ప్రవేశపెట్టింది. 2015లో మోడీ పాకిస్తాన్ పర్యటన, అదే ఏడాది ఇండోనేషియాలోని బందూంగ్ సమావేశానికి సంబంధించిన అంశాల్లో సభను తప్పుదోవ పట్టించారని ప్రతిపక్ష రాజ్యసభ సభ్యులు పేర్కొన్నారు.

కేరళ ఘటనలపై
బీజేపీ రెండు నాల్కల ధోరణి

కేంద్ర హోంమంత్రిది ఓ తీరు.. మరో మంత్రి, నాయకుడిది మరో తీరు

- **శాంతి నెలకొన్న పరిస్థితుల్లో రెచ్చగొట్టే ప్రకటనలెందుకు..? : ప్రశ్నించిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో**

న్యూఢిల్లీ : కేరళలో ఇటీవల జరిగిన ఘర్షణల పట్ల బీజేపీ నాయకత్వం ద్వంద్వ వైఖరిని అవలంభిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఆ రాష్ట్రంలోని తిరువనంతపురం జిల్లాలో సీపీఐ(ఎం), బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ మధ్య గొడవలు జరిగిన విషయం తెలిసిందే. ఘర్షణలను అదుపు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కోరారు. దాంతో, జులై 31న సీపీఐ(ఎం), బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో విజయన్ సమావేశం ఏర్పాటు చేసి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఆ భేటీలో ఇరుపక్షాల నేతలు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మరో మూడు జిల్లాల్లోనూ సమావేశాలు నిర్వహించారు. ఘర్షణల నివారణకు ఇరుపక్షాల నుంచి చేపట్టాల్సిన చర్యలపై ఓ అంగీకారానికొచ్చారు. హింసకు ఎవరు పాల్పడినా, పోలీసులు చర్యలు తీసుకోనున్నట్టు వామపక్ష ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నెల 6న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది.

ఇటువంటి తరుణంలో సీపీఐ(ఎం) కేరళ నాయకత్వంపై బీజేపీ కేంద్ర నాయకులు, కేంద్ర మంత్రులు ఆధారరహితంగా వేర్పాటువాద ఆరోపణలు చేయడాన్ని పొలిట్‌బ్యూరో విమర్శించింది. కేరళ సీఎం విజయన్ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేంద్రయాదవ్, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ వ్యాఖ్యలు చేయడాన్ని పొలిట్‌బ్యూరో తప్పు పట్టింది. విజయన్ చేపట్టిన చర్యలు ఫలితాలనిస్తున్నాయని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో పేర్కొన్నది. కేంద్ర హోంమంత్రి తీసుకున్న వైఖరికి భిన్నమైన పద్ధతిలో మరో కేంద్రమంత్రి, బీజేపీ నాయకుడి వ్యవహారశైలి ఉన్నదంటూ పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. ఆ రాష్ట్రంలో రాజకీయ ఘర్షణలు సద్దుమణిగి, శాంతియుత పరిస్థితులు నెలకొన్న విషయాన్ని బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ గమనంలోకి తీసుకోవడంలేదంటూ పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది.

2016 మే నెలలో ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కాగానే..సీపీఐ(ఎం)పై బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ దాడులు ప్రారంభమయ్యాయని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. అదేరోజు ముఖ్యమంత్రి విజయన్ నియోజకవర్గంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న సీపీఐ(ఎం) కార్యకర్తను హత్యగావించారని పొలిట్‌బ్యూరో తెలిపింది. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకూ 13మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, ఇతరులు.. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ మనుషుల చేతిలో హత్యకు గురయ్యారని తెలిపింది. 200మందికిపైగా సీపీఐ(ఎం) కార్యకర్తలు, సానుభూతిపరులు గాయపడి ఆస్పత్రుల పాలయ్యారని, 165 ఇండ్లు, 51 పార్టీ కార్యాలయాలు, మరెన్నో ప్రజా సంఘాల కార్యాలయాలను ధ్వంసం చేశారని, తగులబెట్టారని పొలిట్‌బ్యూరో పేర్కొన్నది.

రెచ్చగొట్టే చర్యలు, సీపీఐ(ఎం) కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడటం వెనుక వారి రాజకీయ ప్రణాళిక స్పష్టమేనని పొలిట్‌బ్యూరో తెలిపింది. హింసకు పాల్పడుతున్నది సీపీఐ(ఎం) అంటూ గగ్గోలు పెట్టడం, ఆ తర్వాత దాన్ని అదుపు చేయడంలో కేరళ ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపణలు లంకించుకోవడమే బీజేపీ ఎత్తుగడ అని పొలిట్‌బ్యూరో దుయ్యబట్టింది. రాజకీయ హింసకు బాధ్యులెవరో కేరళ ప్రజలకు తెలుసునని, ఆ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం తమ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడంలో నిమగ్నమైందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించే శక్తులను ఓడించి..మత సామరస్యం, సామాజిక సమభావనను కొనసాగిస్తూ కేరళ ప్రజలు తమ ఔన్నత్యాన్ని చాటుకుంటారని పొలిట్‌బ్యూరో ధీమా వ్యక్తం చేసింది.

దేశభక్తిని నిరూపించుకునేందుకు
భారత్ మాతాకీ జై అనమనండి

కాశ్మీర్ వేర్పాటువాదిపై కోర్టులో న్యాయవాది ఒత్తిడి

ఇదేమీ టీవీ స్టూడియో కాదు

లాయర్‌ను హెచ్చరించిన న్యాయమూర్తి



షబీర్ షా

న్యూఢిల్లీ : 'ఆయన నిజమైన దేశభక్తుడైతే.. భారత్ మాతాకీ జై అనమనండి..' ఈ వ్యాఖ్యలు ఓ సాధారణ వ్యక్తి చెప్పినవి కావు. న్యాయస్థానం సాక్షిగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫు న్యాయవాది విచారణను ఎదుర్కొంటున్న నిందితుడిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన జమ్మూకాశ్మీర్ వేర్పాటువాది షబీర్ షాపై విచారణ జరుగుతుండగా నిజమైన దేశభక్తుడ్కెతే 'భారత్ మాతా కీ జై' అనమనండి అంటూ న్యాయవాది కోర్టులో వాదించారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమీ టెలివిజన్ స్టూడియో కాదు అని హెచ్చరించారు. మనీలాండరింగ్ కేసులో షబీర్ షాను గత నెలలో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. షా కస్టడీని పొడిగించాల్సిందిగా ఈడీ తరఫు న్యాయవాది రాజీవ్ అవాస్థీ కోర్టుకు గురువారం విజ్ఞప్తి చేశారు. 'విదేశాల నుంచి వస్తున్న నిధులతో కాశ్మీర్‌లో వీధిపోరాటాలు, ఇతర ఉగ్ర కార్యకలాపాలకు షా పాల్పడుతున్నారు. అతని వద్ద కోట్లాది రూపాయలున్నాయి. అవి షాకు ఎలా వచ్చాయి? అదంతా అక్రమంగా సంపాదించిన డబ్బు. అతను విచారణకు కూడా సహకరించడంలేదు. షబీర్ నిజమైన దేశభక్తుడే అయితే తన దేశభక్తిని నిరూపించుకోవాలి... భారత్ మాతా కీ జై అనమనండి..' అని న్యాయమూర్తితో అన్నారు. ఈ వ్యాఖ్యలపై న్యాయమూర్తి సిద్ధార్థ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేసుకు సంబంధించిన పూర్వాపరాలను గురించి మాత్రమే వాదించండి. ఇది టెలివిజన్ స్టూడియో కాదు..' అని అని న్యాయమూర్తి హెచ్చరించారు. షా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని.. కాశ్మీర్‌లో అశాంతి సృష్టించేందుకు విదేశాల నుంచి వచ్చిన నిధులను వాడుతున్నారని, అతనిని మరికొంత కాలం ఈడీ కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోర్టుకు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. దీనికి అంగీకరించిన న్యాయస్థానం అతని ఈడీ కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసింది.

నేడు ఉపరాష్ట్రపతి ఎన్నికలు

రాత్రి ఏడు లోపు ఫలితం!

- **ఓటు వేయనున్న లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు**
- **గోపాల కృష్ణ గాంధీకి 21 పార్టీల మద్దతు**





న్యూఢిల్లీ : దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి ఉపరాష్ట్రపతికి నేడు (శనివారం) ఎన్నికలు జరగనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పార్లమెంట్ ఉభయసభల సభ్యులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలతో పాటు, నామినేటెడ్ సభ్యులు కూడా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగి ఉన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతోంది. అనంతరం ఓట్లు లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. రాత్రి 7 గంటల లోపే ఫలితాలు కూడా వెల్లడయ్యే అవకాశాలున్నాయి. అంటే శనివారమే కొత్త ఉపరాష్ట్రపతి ఎవరనేది కూడా తెలిపోతుంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ కె. షీరిఫ్ వ్యవహరిస్తున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం నూతన ఉపరాష్ట్రపతిని కూడా ఆయనే ప్రకటిస్తారు. రహస్య పేపర్ బ్యాలెట్ ద్వారానే ఓటింగ్ జరుగుతోంది. ఈ పోలింగ్‌లో ఎన్నికల సంఘం సూచించిన పెన్నుతో మాత్రమే ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఒకవేళ వేరే ఏ రకమైన పెన్నునైనా వాడితే ఆ ఓటును తిరస్కరిస్తారు. రాజ్యసభలో 233 మంది ఎన్నికైన సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు ఉన్నారు. లోక్‌సభలో 543 మంది ఎన్నికైన ఎంపీలు, ఇద్దరు నామినేటెడ్ సభ్యులు ఉన్నారు. అయితే రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇది కాకుండా బీజేపీ ఎంపి పాశ్వాన్‌కు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశం లేదు. కోర్టు తీర్పు కారణంగా ఆయన ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నారు. గోవా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు మనోహర్ పారికర్, యోగి ఆదిత్య నాథ్, ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి మౌర్య కూడా ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాల కృష్ణ గాంధీకి దాదాపు 21 పార్టీలు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతిచ్చిన జేడీయూ, బీజేడీలు కూడా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల అభ్యర్థికి మద్దతు పలికాయి. అయితే బీహార్‌లో మహకూటమి నుంచి ఇటీవల బయటకొచ్చి జేడీయూ బిజెపితో కలిసింది. కానీ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గోపాల కష్ణ గాంధీకే మద్దతు ఉంటుందని ప్రకటించింది.

మొఘల్‌సరాయి రైల్వే స్టేషన్ పేరు మార్పుపై..
ఎస్పీ, బీఎస్పీ తీవ్ర అభ్యంతరం

స్వాతంత్ర్యోద్యమంలో ఏ పాత్రాలేని వారి పేర్లు ఎలా పెడ్తారు?

- **రాజ్యసభలో నిలదీసిన ప్రతిపక్షాలు**




న్యూఢిల్లీ : స్వాతంత్ర్యోద్యమంతో ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల పేర్లు చారిత్రక స్థలాలు, రోడ్లకూ పెడుతున్నారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. మొఘల్‌సరాయి రైల్వే స్టేషన్ పేరు మార్పు అంశాన్ని రాజ్యసభలో శుక్రవారం ప్రతిపక్షాలు ప్రస్తావించాయి. ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్‌సరాయి రైల్వేస్టేషన్‌కు హిందూత్వ సిద్ధాంతకర్తల్లో ఒకరైన దీన్‌దయాల్ ఉపాధ్యాయ పేరును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపాదించగా, కేంద్రం ఆమోదించిన విషయం తెలిసిందే. దీనిపై రాజ్యసభలో సమాజ్‌వాదీపార్టీ ఎంపీ నరేశ్‌అగర్వాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూపీ చిత్ర పటాన్ని బలవంతంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. దేశం పేరు కూడా మార్చేస్తారా?అని ఆయన నిలదీశారు. ఆయనకు ఎస్పీ ఎంపీలు మద్దతుగా నిలిచారు. సభ మధ్యలోకి దూసుకువెళ్లి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ అంశంపై వాయిదా తీర్మానానికి ఎస్పీ ఎంపీలు పట్టుపట్టగా, బీఎస్పీ కూడా వారితో గొంతు కలిపింది. అయితే,దీనిపై వాయిదా తీర్మానానికి డిప్యూటీ చైర్మన్ కురియన్ అంగీకరించలేదు. వేరే నిబంధన కింద రావాలంటూ ప్రతిపక్షాలకు సూచించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఎటువంటి పాత్రాలేని వ్యక్తుల పేర్లను చారిత్రక స్థలాలకు ఎలా పెడ్తారంటూ ఎస్పీ ఎంపీలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయను అవమానిస్తున్నారంటూ కేంద్రమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఎదురు దాడికి దిగారు. మొఘలుల పేరే ఉండాలని వారు కోరుకోవడం, దీన్‌దయాల్ పేరును వద్దనటం తప్పని నఖ్వీ అన్నారు. చరిత్ర చదువుకోండి,దీన్‌దయాల్ గొప్ప దార్శనికుడంటూ నఖ్వీ సమర్థించుకున్నారు. ముంబయిలోని విక్టోరియా టెర్మినల్ పేరును ఛత్రపతి శివాజీ టెర్మినల్‌గా మార్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హౌరా నుంచి ఢిల్లీ వెళ్లే మార్గంలోని రైల్వే స్టేషన్‌కు 1862లో మొఘల్‌సరాయిగా ఈస్ట్ ఇండియా కంపెనీ నామకరణం చేసింది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో
రైతుల ఆత్మహత్యలు..

మహారాష్ట్రలో నాలుగు నెలల్లో 855 మంది

- **రాజ్యసభకు తెలిపిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి**



న్యూఢిల్లీ : మహారాష్ట్రలో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 855మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డట్టు కేంద్ర వ్యవసాయశాఖమంత్రి రాధామోహన్‌సింగ్ తెలిపారు. గతేడాది ఇదే కాలంలో 1023మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు ఆయన చెప్పారు. శుక్రవారం రాజ్యసభలో రైతుల ఆత్మహత్యలపై లిఖితపూర్వక సమాధానమిస్తూ కేంద్రమంత్రి ఈ వివరాలను వెల్లడించారు.

వ్యవసాయం లాభసాటిగా మారి రైతుల ఆదాయం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. రైతుల ఆత్మహత్యల నివారణకు తీసుకుంటున్న చర్యలపై మహారాష్ట్రసహా అన్ని రాష్ట్రాలను నివేదికలను పంపాల్సిందిగా కోరినట్టు వ్యవసాయ మంత్రిత్వశాఖ రాజ్యసభకు తెలిపింది. మహారాష్ట్రలోని యవత్మాల్, ఉస్మానాబాద్ జిల్లాల్లోని అమరావతి, ఔరంగాబాద్ డివిజన్లలో పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్టు వ్యవసాయశాఖ సహాయమంత్రి పరుశోత్తమ్ రూపాలా మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆరోగ్యశాఖ ద్వారా అక్కడి రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా 'బలిరాజా చేతనా అభియాన్' పేరుతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మానసిక ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం కూడా 444 జిల్లాల్లో కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో 30 నెలల్లో 1271మంది : ఆ రాష్ట్ర ప్రభుత్వ లెక్క

రాయిపూర్:బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్‌లోనూ రైతుల ఆత్మహత్యలపై ఆ రాష్ట్ర అసెంబ్లీలో చర్చించారు. రెండున్నరేండ్లలో ఛత్తీస్‌గఢ్‌లో 1271 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్టు ఆ రాష్ట్ర హోంమంత్రి రామ్‌సేవక్ పైక్రా తెలిపారు. 2017 జూన్ 30 వరకూ గడిచిన రెండున్నరేండ్లలో ఆ రాష్ట్రంలో మొత్తం 11,826మంది ఆత్మహత్యలకు పాల్పడగా, వారిలో 1271మంది రైతులని మంత్రి వెల్లడించారు. ఐదు జిల్లాల్లో రైతుల ఆత్మహత్యలు అధికంగా జరిగినట్టు ఆయన తెలిపారు. అవి: సూరజ్‌పూర్(198), బలోడాబజార్(181), బలోడ్(170), మహాసముండ్(153), బల్‌రాంపూర్(138)మంది.

నాకు దక్కనిది.. ఎవరికీ...

యువతిని హత్య చేసిన ఉన్మాది

- **రాజస్థాన్‌లో దారుణ ఘటన**



జైపూర్ : 'నాకు దక్కనిది.. ఎవరికీ దక్కనివ్వను...' ఇది తాను ప్రేమించిన యువతిని హత్య చేస్తూ... చాలా సినిమాల్లో విలన్ చెప్పే డైలాగ్. ప్రేమను నిరాకరించిన యువతిని హత్య చేసి రియల్ విలన్‌గా మారాడా ఉన్మాది. రాజస్థాన్‌లో 18 ఏండ్ల యువతిని కిరాతకంగా హత్య చేశాడు. బన్నావారీ ప్రాంతానికి చెందిన వైశాలీ శర్మ (18) ఇటీవలే 12వ తరగతి పూర్తిచేసుకుంది. పై చదువులు పూర్తిచేసి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆమె కలలను నెరవేర్చుకునేందుకు కళాశాలలో చేరే పనిలో బిజీగా ఉంది. ఈ నెల 2 బుధవారం వరకూ ఇంట్లో చలాకీగా తిరుగుతూ ఉన్న వైశాలీ.. జీవితం అర్ధంతరంగా ముగిసిపోతుందని ఎవరూ ఊహించలేదు.

ఆ రోజు ఏం జరిగింది?

అగర్వాల్ కాలనీలోని తన నివాసంలో వైశాలి బుధవారం రోజువారీ పనులు చేసేందుకు వచ్చిన ఇంటి పనిమనిషితో మాట్లాడుతూ కింది ఫ్లోర్‌లో ఉంది. వైశాలి తండ్రి పింకేశ్ శర్మ రెండో ఫ్లోర్‌లో ఉన్నారు. ప్రహరీ గోడ దూకి ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడటం వైశాలి చూసింది. అతడు పక్కింట్లో ఉండే జగదీశ్. ఆమె వైపు దూసుకొచ్చాడు. పదునైన ఆయుధంతో ఆమెపై దాడి చేశాడు. ఆమె కిందపడిపోయింది. అయినా అతడి అక్కసు తీరలేదు. మెడమీద పలుమార్లు ఆయుధంతో పొడిచాడు. అక్కడే ఉన్న పనిమనిషి జగదీశ్‌ను ఆపేందుకు చాలా ప్రయత్నించింది. కానీ, అంతలోనే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. పనిమనిషి అరుపులకు పక్కింటివారు, పైనున్న వికలాంగుడైన వైశాలి తండ్రి అక్కడకు చేరుకున్నారు. రక్తపుమడుగులో వైశాలి పడివుంది. నిందితడు జగదీశ్ అప్పటికే అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యమైపోయింది. గత కొద్ది రోజులుగా జగదీశ్, అతడి సోదరుడు వైశాలిని టీజ్ చేస్తున్నట్టు బాధితురాలి బంధువు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించి.. గురువారం అదుపులోకి తీసుకున్నారు. మొదట నోరువిప్పని జగదీశ్.. ఆ తర్వాత నేరాన్ని ఒప్పుకున్నాడు. ఆమెను పిచ్చిగా ప్రేమించానని అన్నాడు. తాను ప్రేమిస్తున్నట్టు వైశాలికి తెలుసని, అయినా.. ఆమె తనను ఎప్పుడూ పట్టించుకోలేదని పోలీసులకు చెప్పాడు. 'నాకు దక్కకపోతే.. ఎవరికీ దక్కనివ్వకూడదని నిర్ణయించుకున్నాను' అని జగదీశ్ పోలీసులకు చెప్పాడు.

పనిమనిషిపై మూడు నెలలుగా...


ఢిల్లీ: ఒక వ్యాపార వేత్త ఇంటి పనిమనిషిపై మూడు నెలలుగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన దేశ రాజధానిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన 20 ఏండ్ల యువతిని ఇంట్లో నిర్బంధించి, లైంగిక దాడికి పాల్పడటమేకాక, చిత్రహింసలకు గురిచేసినట్టు పోలీసులు తెలిపారు. అతడి చెర నుంచి తప్పించుకున్న ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా... పటేల్ నగర్‌కు చెందిన వ్యాపారవేత్తపై కేసు నమోదుచేసినట్టు చెప్పారు. పశ్చిమ ఢిల్లీలోని కొన్ని షోరూమ్‌లకు యజమాని అయిన సుమారు 50 ఏండ్ల నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు తెలిపారు. బాధితురాలిని బెంగాల్‌లోని దక్షిణ్ దింజ్‌పూర్ జిల్లాకు పంపేందుకు పోలీసులు ఏర్పాట్లుచేస్తున్నారు.

ఫేస్‌బుక్‌లో అవి పోస్ట్‌చేశాడు



గువహతి : టీచర్లతో కాస్త చనువు ఉంటే ఏమవ్వదులే అనుకుంటే..మీ జీవితాలు రోడ్డున పడతాయనటానికి ఫేస్‌బుక్‌లో ఓ కామ టీచర్ పోస్టు చేసిన ఫోటోలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇవి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయటంతో.. ఆ టీచర్‌పై బాధితుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దాంతో అతడ్ని పోలీసులు కటకటాల వెనుక్కి నెట్టారు. అసోంలోని హెలాకాండి జిల్లాలోని కాటిలిచెరా ప్రాంతంలో మారుమూల గ్రామంలో పాఠశాలలో ఫైజుద్దీన్ లష్కర్ అనే టీచర్ పనిచేస్తున్నాడు. ఆ స్కూలులోని విద్యార్థులతో ఫోటోలు దిగాడు. అయితే అతను ఆ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ.. ఫోటోలు తీశాడు. వాటిని తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్టు చేయటంతో..ఆ బిడ్డల తల్లిదండ్రులు మండిపడ్డారు. ఆ కామ టీచర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో ఓ టీచర్‌ను లైంగిక వేధింపులకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. కాగా ఫైజుద్దీన్ ఏవిధంగా బెదిరించి ఆఫోటోలు తీశాడన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌యూలో విద్యార్థి ఉద్యమాలను అణచేందుకు కుట్ర...



న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమాలను అణగదొక్కేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? ఈ నేపథ్యంలో క్యాంపస్‌లో కావాలనే భయోత్పాతాలను సృష్టిస్తున్నారా?.. గతేడాది ఫిబ్రవరి 9 నుంచి వర్సిటీలో జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే ఇది నిజమని అనుకోక తప్పదు. పోలీసుల సోదాలు, ఆధారాలు లేని దర్యాప్తులు, అసమ్మతి గొంతు నొక్కడానికి ఉపయోగిస్తున్న సెక్షన్ 124ఏ సెక్షన్ కింద విద్యార్థుల అక్రమ అరెస్టులు.. వర్సిటీలో భయానక పరిస్థితులను కల్పించేలా చేస్తున్నాయి. విచారణ పేరుతో టీచర్లు, విద్యార్థులను వేధించడం, వారికి నోటీసులు జారీ చేయడమే వర్సిటీ ప్రస్తుత పరిపాలనా విభాగం పనిగా పెట్టుకున్నది. అంతేకాక క్రమశిక్షణా చర్యల పేరుతో పెద్ద మొత్తంలో జరిమానాలు కూడా విధిస్తున్నది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) తప్పుడు ఫిర్యాదుల ఆధారంగానే వర్సిటీ యాజమాన్యం ఈ తతంగానికి పాల్పడుతున్నట్టు స్పష్టమవుతున్నది. ఇక జేఎన్‌యూలో విద్యార్థులు, టీచర్ల ఐక్యతను దెబ్బ తీసేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సరైన విచారణ లేకుండానే పలువురు విద్యార్థులు సస్పెండ్‌కు గురయ్యారు. జేఎన్‌యూ సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు, విద్యార్థులను ఉద్యమాలకు దూరంగా ఉంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉద్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కొందరు పదేపదే మాట్లాడుతుండడం కూడా మనం గమనించవచ్చు. వర్సిటీలో శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న పలు విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. దీన్ని బట్టి ఉద్యమాలు చేయొద్దని, పరిపాలనా యంత్రాంగానికి వ్యతిరేకంగా గొంతెత్తకూడదని అర్థమవుతున్నది. నేను ప్రస్తుతం ఆరు దర్యాప్తులను ఎదుర్కొంటున్నాను. నాపై రెండు ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. క్రమశిక్షణ పేరుతో 20 మందికి పైగా విద్యార్థులను తదుపరి సెమిస్టర్ చదువుకునేందుకు అనర్హులుగా ప్రకటించింది. వీరిలో 14 మందికి భారీ మొత్తంలో జరిమానా విధించింది. వర్సిటీలో విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలని, హాస్టల్ సదుపాయంతోపాటు అన్ని సదుపాయాలను పొందేలా చర్యలు చేపట్టాలని జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేస్తోంది.

రాంజాస్ ఘర్షణల వీడియో క్లిప్పులు కల్పితం

- **పోలీసుల ఏటీఆర్ నివేదికలో వెల్లడి**

న్యూఢిల్లీ : ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన రామ్‌జాస్ కళాశాలలో జరిగిన ఘర్షణలకు సంబంధించి సేకరించిన వీడియో క్లిప్పులు కల్పితమైనవని పోలీసులు తెలిపారు. కాలేజి కాంపస్‌లో, జేఎన్‌యూలోనూ, ఇతర సంఘటనల్లోనూ జరిగిన విధంగానే జాతి వ్యతిరేక నినాదాలు చేసినట్లున్న సమాచారం ఆ వీడియోలో ఉన్నట్టు చెప్పబడిందని పోలీసు డిప్యూటి కమిషనర్ మధుర్ వర్మ తెలిపారు. కాగా ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక కథనం మేరకు "గుర్తు తెలియని సామాజిక మాధ్యమాల నుంచి, మీడియా వెబ్‌సైట్‌ల నుంచి సేకరించిన ఆ వీడియో ఫుటేజ్ స్పష్టంగా లేదని, కల్పితంగా ఉందని, పోలీసులు కోర్టుకు సమర్పించిన 9 పేజీల "యాక్షన్ టేకెన్ రిపోర్ట్"లో పేర్కొన్నారు. ఈ రిపోర్టును ఢిల్లీ కోర్టుకు సమర్పించారు. దీనిపై జాయింట్ పోలీసు కమిషనర్ (క్రైమ్) ప్రవీర్ రాజన్ సంతకం చేశారు. ఈ క్రమంలో ఈ సంఘటనకు సంబంధించిన ఎడిట్ చేయని, అసలు వనరులను తమకు అందిచాలని వివిధ ఎలక్ట్రానిక్ మీడియా వర్గాలను కోరినట్లు పోలీసులు యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.

కర్నాటకలో జలకళ.. తెలుగు రాష్ట్రాలు విలవిల

నీటి విడుదల కోసం ఎదురుచూపు

- డెడ్ స్టోరేజీలోనే శ్రీశైలం, సాగర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కృష్ణా బేసిన్‌లోని ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల కర్నాటక ప్రాజెక్టులకు జలకళ వచ్చిపడింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణా ప్రాజెక్టులు వెల వెల బోతున్నాయి. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నీరు చేరింది. రెండు ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్న కర్నాటక ప్రభుత్వం తెలంగాణకు నీరు ఎప్పుడు విడుదల చేస్తుందోనని ఎదురుచూస్తున్నారు. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లలో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరగడంతో రెండ్రోజుల పాటూ జూరాల ప్రాజెక్టుకు నీరు విడుదల చేశారు. ఆ తర్వాత ఇన్‌ఫ్లో తగ్గడంతో నీటి విడుదల నిలిపివేశారు. ఆల్మట్టి జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 1705 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1704.72 అడుగులుగా ఉన్నది. ఈ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా శుక్రవారం 128.19 టీఎంసీల నీరు నమోదయింది. నారాయణపూర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1615 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1614.24 అడుగులుగా ఉన్నది. ఈ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా శుక్రవారం 37.04 టీఎంసీలుగా ఉన్నది. ఆల్మట్టిలో ఇన్‌ఫ్లో 21,003 క్యూసెక్కులు కాగా నారాయణపూర్‌లో ఇన్‌ఫ్లో 17,790 క్యూసెక్కులుగా ఉన్నది. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందిస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1045 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1037.34 అడుగులకు చేరింది. ఈ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 9.65 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 5.46 టీఎంసీలుగా ఉన్నది. తెలుగు రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందించే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీ స్థాయిలోనే ఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ఇప్పటికీ 778 అడుగులు మాత్రమే ఉన్నది. ఈ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 19.52 టీఎంసీలు మాత్రమే ఉన్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా శనివారం నాటికి 116 టీఎంసీలుగా ఉన్నది. కృష్ణా, తుంగభద్ర బేసిన్‌లలో ఆశించిన మేరకు వర్షాలు కురవలేదు. గత సంవత్సరం కూడా కృష్ణా ప్రాజెక్టులకు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మాత్రమే వరద నీరు వచ్చి చేరింది. ఫలితంగా రబీ పంటలకు మాత్రమే సాగునీరందించగలిగారు. నాగార్జునసాగర్ కుడి కాల్వ కింద 12 లక్షల ఎకరాలు ఏపీలో సాగు కావలసి ఉన్నది. ఎడమకాల్వ కింద మొత్తం 6 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా తెలంగాణలో 3.8 లక్షల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉన్నది. కృష్ణా డెల్టాలో మరో ఆరు లక్షల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా ఈ సంవత్సరం పట్టిసీమ నుంచి పూర్తిస్థాయిలో నీరు పంపింగ్ చేయడంతో ముందుగానే ఖరీఫ్ సాగు ప్రారంభమయింది. రోజుకు 45,000 క్యూసెక్కుల గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు ఏపీ ప్రభుత్వం తరలిస్తున్నది.


ఆల్మట్టి డ్యాం (ఫైల్)

నవతెలంగాణపై సీఎం వ్యాఖ్యలకు నిరసన

గన్‌పార్క్ వద్ద ఫెడరేషన్ ఆందోళన

- అమరవీరుల స్థూపానికి వినతిపత్రం
- జర్నలిస్టుల పట్ల వైఖరి మార్చుకోవాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నవతెలంగాణ దినపత్రికను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య(టీడ బ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) శుక్రవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆందోళన నిర్వహిం చాయి. ఈ సంఘాలకు చెందిన జర్నలిస్టులు పదుల సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. బైటాయించారు. మీడియా పట్ల సీఎం అసహన వైఖరీ నశించాలి, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి నవతెలంగాణపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న నవతెలం గాణ దినపత్రికపై సీఎం ఇష్టానుసారం మాట్లాడటం ఎంతమాత్రం సరికాదన్నారు. ప్రభుత్వ ప్రకటనలను ఆపేయడం ద్వారా ఉద్యోగుల పొట్టకొడుతున్నారని విమర్శించారు. రాజకీయ కారణాలతో అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి అన్యాయం చేయరాదని విజ్ఞప్తి చేశారు. ప్రకటనలను నిలిపేయడం భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవడంలో భాగమేనని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండించారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయం ప్రగతీభవన్ ఎదుట 10టీవీ, వి6, టీవీ5 రిపోర్టర్లు, కెమెరామెన్లపై పోలీసులు దాడిచేయడం దారుణమని వ్యాఖ్యానించారు. పంజాగుట్ట ఏసీపీ వెంకటేశ్వర్లుపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ నాయకులు పి.ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి రాంచందర్, కార్యదర్శి ఎస్‌కే సలీమా, కోశాధికారి ఆర్. వెంకటేశ్, హెచ్‌యూజే అధ్యక్షులు ఇ చంద్రశేఖర్, కార్యద ర్శి బీవీఎన్ పద్మరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు విజయా నంద్, సహాయ కార్యదర్శి గండ్ర నవీన్, రాష్ట్ర నాయకులు జగదీశ్, రఘు, యాదయ్య, రాముడు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తెలియజేసింది.


ఆందోళన చేస్తున్న జర్నలిస్ట్ సంఘాలు

జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ ఆందోళనలు...వినతులు

నవతెలంగాణపై సీఎం కే. చంద్రశేఖర్‌రావు చేసిన వ్యాఖ్యలను వెంటనే తీసుకోవాలని, ప్రగతిభవన్ వద్ద మీడియా ప్రతినిధులపై దాడి చేసిన ఏసీపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు, జేసీ, ఇతర అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. పలుచోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వికారాబాద్‌లో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రమిచ్చారు. సంగారెడ్డిలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. సిద్దిపేటలో కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి, గజ్వేల్‌లో ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. గజ్వేల్‌లో కూడా నిరసన కార్యక్రమం చేపట్టారు. జనగామ కలెక్టరేట్ సూపరింటెండెంట్ వీరప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డీఆర్వో మోహన్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్‌లో డీఆర్‌ఓ వెంకటేశ్వర్లుకు, వనపర్తి జిల్లాలో డీఆర్‌ఓ చంద్రయ్యకు, నాగర్‌కర్నూల్‌లో జేసీ సురేందర్‌కరణ్‌కు వినతిపత్రం అందజేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జేసీ సంగీతకు వినతి పత్రం అందజేశారు. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో కలెక్టర్లకు, కరీంనగర్ లో జాయింట్ కలెక్టర్‌కు, వినతిపత్రాలు అందజేశారు.

జర్నలిస్టులపై దాడులు సరికాదు

- టీఎస్‌యూడబ్ల్యూజే

రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు సరికాదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె విరాహత్ అలీ అన్నా రు. వి6, 10 టీవీ, టీవీ5 రిపోర్టర్లు, కెమెరామెన్లపై ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద కవరేజీ సందర్భంగా పోలీసులు అకారణంగా దాడిచేయడం, దుర్భాలాషడం దారుణమని వ్యాఖ్యానించారు. పం జాగుట్ట ఏసీపీ వెంకటేశ్వర్లును వెంటనే సస్పెండ్ చే యాలని డిమాండ్ చేశారు. అమానుష దాడులతో మీడియా గొంతు నొక్కలేరని వివరించారు. సంబంధిత పో లీసు అధికారులపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పా రు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మంత్రి తుమ్మలకు తీవ్ర అస్వస్థత

- యశోదలో చికిత్స.. నిలకడగా ఆరోగ్యం

నవతెలంగాణ–ఖమ్మంప్రతినిధి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యా హ్నం సమయంలో ఆయన అకస్మా త్తుగా వాంతులు చేసుకు న్నారు. ఆస మయంలో నోటివెంట రక్తం పడట ంతో వెంటనే సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంవీరావు ప్రత్యేక పర్యవేక్షణలో తుమ్మలకు చికిత్స అంది స్తున్నారు. ఈసందర్భంగా డాక్టర్ ఎంవీరావు మాట్లాడుతూ అల్సర్ వల్ల రక్తపు వాంతులయ్యాయని తెలిపారు.

ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉంద ని, అయితే రెండు రోజులు ఐసీయూలో ఉంచి వైద్యం అందించాల్సి ఉంద ని న్నారు. ఈవిష యం తెలుసుకున్న ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్ వెంటనే యశోద ఆస్పత్రికి వెళ్లి మంత్రిని పరామ ర్శించారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలు వాయిదా

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (ఏఈఈ), వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఈనెల 12,13 తేదీల్లో జరగాల్సిన రాతపరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమి షన్ (టీఎస్‌పీఎస్సీ) వాయిదా వేసింది. ఈనెల 27, 28 తేదీ ల్లో నిర్వ హిస్తామని టీఎస్‌పీ ఎస్సీ తెలి పింది.

సంపాదకీయం


రెంటిపైనా పోరు తప్పదు!

నిన్నటి వరకూ నీతిమంతునిగా సాటి నేతల చేత నీరాజనాలు అందుకున్న నేత నితీశ్ కుమార్. అలాగే, హిందూ మతతత్వ వ్యతిరేక యోధునిగా లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఉన్న ఖ్యాతి గణనీయం. అయితే, ఉన్నట్టుండి ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. 'సెక్యులరిజం అవినీతిపై వేసే ముసుగు కాకూడదు' అని నిండు అసెంబ్లీ సాక్షిగా నితీశ్ ప్రకటించి, మతతత్వవాది మోడీ నీడన చేరిపోయారు. లాలూతో తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయించుకుని అవినీతిని ఆయుధంగా మలచుకున్న నితీశ్, తాను 2015లో లాలూతో జత కట్టే నాటికే ఆయన పశుగ్రాస కుంభకోణంలో దోషిగా నిర్ధారితుడై ఉన్నాడన్న సత్యాన్ని చాలా సౌకర్యవంతంగా మరచిపోయారు.

నిజానికి, 'మతతత్వం- అవినీతి'- ఇవి రెండూ విడివిడిగా మనుగడ సాగించడం అసాధ్యం. కానీ, ఇవి రెండూ విరుద్ధ విషయాలుగా ఎదురెదురు నిలబడి దేశ ప్రజలు ఏదో ఒక వైపు నిలబడే విధంగా ప్రేరేపిస్తూ ఉండడమే ప్రమాదం. అవినీతిని విస్మరించి మతోన్మాదాన్ని ఎదిరించలేము. అవినీతిపై యుద్ధం చేస్తూనే, మతోన్మాదాన్ని తుదముట్టించడం కావాలి లక్ష్యం.

అలాగే, 2015 మహాగట్‌బంధన్ సమయంలో 'మోడీ-షా- ఆర్‌ఎస్‌ఎస్‌లను ఓడించి లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు తాము ప్రజల ముందుకు వస్తున్నామని' ప్రకటించిన లాలూ, అప్పటికే 17 ఏండ్లుగా నితీశ్ మతతత్వవాదులతో అంటకాగుతున్నాడన్న విషయాన్ని విస్మరించారు. 2002 గుజరాత్ మారణకాండ సమయంలో అప్పటి వాజ్‌పేయి (ఎన్డీఏ) ప్రభుత్వంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా ఉన్న నితీశ్ గుజరాత్ మారణకాండను కనీసం ఖండించలేదన్న చేదు నిజాన్నీ విస్మరించారు.

తమకు ఏమాత్రం నష్టం చేకూర్చక, అధికారాన్ని అప్పగించే విషయాలపై ప్రజలను రెండు వైరి వర్గాలుగా చీల్చే అవకాశం ఉండడం మన దేశ పాలకవర్గాలకు మంచి అవకాశం. 'మతోన్మాదమా? - అవినీతా?' దేన్నో ఒకదాన్ని ఎంచుకోండి, తేల్చుకోండి అంటే, ప్రజలు దేన్ని ఎంచుకున్నా, ఎటు తేల్చుకున్నా చివరకు విజయులు మాత్రం అవకాశవాద నాయకులే అవుతారు. కచ్చితంగా ప్రజలే పరాజితులు అవుతారు. ప్రజలకు ప్రత్యామ్నాయం లేకుండా నాటకమాడడంలో ఆరితేరిపోయారు మన నాయకులు.




దోపిడీ స్థానంలో అవినీతిని తీవ్ర చర్చనీయాంశం చేయడంలో గొప్ప చాతుర్యం, అంతకు మించిన కుట్ర దాగి ఉంది. దోపిడీ ప్రత్యక్షంగా ప్రజలను పీడిస్తే, అవినీతి పరోక్షంగా ప్రజలకు నష్టం చేకూర్చుతుంది. ఇది పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన రుగ్మత. అంతే కాకుండా అవినీతి తనలో ప్రజలనూ ఎంతో కొంత భాగం చేసుకుంటుంది. మరోదారి తెలియని స్థితిలో 'లంచం తీసుకోవడమూ.. ఇవ్వడమూ నేరమే'నన్న ప్రచారహోరులో చిక్కి తామూ అవినీతిలో భాగమేనన్న అపరాధ భావనలో కూరుకుపోతారు. కాబట్టి దోపిడీపై ఉన్నంత ద్వేషం, కసీ అవినీతిపై ప్రజలకు ఉండదు. కాబట్టి ప్రతిఘటనా పరిమితమే.

మతతత్వం కూడా ఇంతే! సంస్కృతీ, సాంప్రదాయం, నమ్మకాల పేరుతో మతంతో మెజారిటీ ప్రజలను పెనవేసి, క్రమంగా మతానికీ మతతత్వానికీ మధ్య విభజన రేఖ చెరిపేసి, చివరకు మెజారిటీ మతతత్వానికి మౌన సమర్థకులుగా ప్రజలను మలచే కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగిస్తున్నారు హిందూత్వవాదులు. ఇందుకు తమ రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత అవినీతిని వాడుకుంటున్నారు. నాస్తిక, సోషలిస్టు, సామాజిక న్యాయ, ప్రాంతీయ, లౌకికవాద భావజాలాలతో దేశంలోని అనేక రాష్ట్రాలలో బలంగా నిలదొక్కుకుని ఉన్న పార్టీల నేతలు కూడా పచ్చి హిందూత్వవాద పాలకుల పాదాల చెంత మోకరిల్లుతున్నారంటే అందుకు కారణం వారి వ్యక్తిగత అవినీతి తప్ప మరొకటి కాదు. అవినీతిపై యుద్ధమే లక్ష్యంగా ప్రకటించి ఉద్భవించిన ఆమ్ ఆద్మీ లాంటి పార్టీ అధినేత కేజ్రీవాలే తన అనుచరులు, బంధువులపై అలముకున్న అవినీతి ఆరోపణల కారణంగా అనతి కాలంలోనే మౌనంలోకి జారుకోవాల్సి వచ్చిందంటే అవినీతి విషయంలో బీజేపీయేతర నాయకుల బేలతనం అర్థం చేసుకోవచ్చు. అంతమాత్రాన అవినీతి విషయంలో బీజేపీ నేతలేమీ కడిగిన ముత్యాలు కాదు. కర్ణాటకలో నాటి బీజేపీ మంత్రులు గాలి బ్రదర్స్ అవినీతి విశ్వరూపాన్ని చూసిన దేశం దిమ్మెరపోయింది. లలిత్ మోడీ, విజయమాల్యా లాంటి అవినీతి సామ్రాట్‌లను దేశం హద్దులు దాటించి ఇంకా కాపాడుతున్న చరిత్ర బీజేపీ అధినేతలకు ఉంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ సహజలక్షణమే అవినీతి. సరళీకృత ఆర్థిక విధానాల అనంతరం అది ఒక మహావిష వృక్షంలా పెరిగిపోయింది. ఆ మహా విషవృక్షాన్ని అధికారంలోని కమలదళం కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది. లేకుంటే కోటి కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు) భారత ఆర్థిక వ్యవస్థలోని 10శాతం సంపద (200 బిలియన్ డాలర్లు) కేవలం 20మంది అంబానీ, అదానీ, దమానీ లాంటి మోడీ అనుంగు పెట్టుబడిదారుల చేతుల్లో ఎందుకు పోగుపడుతుంది? కేవలం 2017 తొలి ఏడుమాసాల కాలంలోనే వీరి సంపద ఏకంగా 50 బిలియన్ డాలర్లు (3.2 లక్షల కోట్లు) ఎలా అమాంతం పెరిగిపోతుంది? కేవలం 'సన్యాసి' అన్న కారణం చేత, తనను తాను అవినీతి రహితుడినని ప్రచారం చేసుకున్నంత మాత్రాన పచ్చి మతతత్వవాది యోగి ఆదిత్యనాథ్‌కి దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠం ఎలా దక్కుతుంది?

నిజానికి, 'మతతత్వం - అవినీతి' ఇవి రెండూ విడివిడిగా మనుగడ సాగించడం అసాధ్యం. కానీ, ఇవి రెండూ విరుద్ధ విషయాలుగా ఎదురెదురు నిలబడి దేశ ప్రజలు ఏదో ఒక వైపు నిలబడే విధంగా ప్రేరేపిస్తూ ఉండడమే ప్రమాదం. అవినీతిని విస్మరించి మతోన్మాదాన్ని ఎదిరించలేము. అవినీతిపై యుద్ధం చేస్తూనే, మతోన్మాదాన్ని తుదముట్టించడం కావాలి లక్ష్యం.

బాధ్యతే నేరమా..?



రమేష్ రాంపల్లి

సమాధానం కరువైనప్పుడే సహనం నశిస్తుంది. ప్రశ్నకు జవాబు చెప్పలేని స్థితి అసహనానికి దారితీస్తుంది. బుధవారంనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రెస్‌మీట్ ఇందుకు వేదికైంది. ఉన్న ఫళంగా "నవతెలంగాణ" దినపత్రికపై సీఎం వ్యాఖ్యలు ఆయన ఎంతటి బలహీనస్థితికి చేరారో, స్థాయిని మరిచి ఎట్లా చవకబారు నిందా ప్రచార దండకానికి పూనుకున్నారో తెలియజేస్తున్నాయి..! "అదేదో నవతెలంగాణ పేపరట... ఏం రాస్తరండీ... ఈ రాతలు రాష్ట్ర ప్రజలకు అవసరమా..?" ఇవీ సీఎం వ్యాఖ్యలు.. ఒక వ్యవస్థలో ఒక పత్రికకు ఇచ్చే స్థానాన్ని బట్టి ఆ సమాజ ప్రగతి అంచనా వేయొచ్చు అంటారు పెద్దలు. దీనిని బట్టే మన ముఖ్యమంత్రి సాగిస్తున్న ప్రగతిని ప్రజలు అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ 'నవతెలంగాణ' ఏం రాసింది..?

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పట్ల ప్రజల మనోభావాలకు అద్దం పడుతూ, ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలను ప్రశ్నిస్తూ అనేక కథనాలు రాసింది. అది ప్రజా ఉద్యమానికి పాదులు వేసింది. ముఖ్యమంత్రికి కోపం వచ్చింది. "ప్రాజెక్టులు కట్టకపోతే పొలాలకు నీళు ఎట్లా వస్తాయ్. అభివృద్ధి ఎట్లా జరుగుతుంది..?" ఇది అధికారపక్షం వాదన..??? నిజమే..! ప్రాజెక్టులు కట్టాలి. పొలాలు పండాలి. ప్రజలంతా బాగుపడాలి. కానీ ప్రాజెక్టుల పేరుతో జరుగుతున్న విధ్వంసం మాటేమిటి? బహుళ పంటలు పండే భూములు ప్రాజెక్టులకు పోతే ఇక పంటలెలా పండుతాయి. బహుళ ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టులు కడుతున్నప్పుడు దాని వల్ల భూములను కోల్పోతున్నవారు, ప్రయోజనం పొందుతున్నవారు సమానంగా లబ్ధిపొందాలి. కానీ ఇక్కడ జరుగుతున్నదేమిటి..?

ముంపు గ్రామాల్లో 21,800 ఎకరాల పట్టా భూమి, 50 ఎకరాల అసైన్డ్ భూమి, 5,110 ఇండ్లు, వందలాది బోరు బావులు, 250 గొలుసుకట్టు చెరువులు, కోట్లాది రూపాయల విలువైన రోడ్లు, భవనాలు నీటిలో మునిగిపోతున్నాయి. ఇక భూమి సేకరిస్తున్న పద్ధతి జీఓ 123 కావాలా 2013 కావాలా అని అడగటం" ఉరి వేసేముందు చివరి కోరిక ఏమిటని అడిగినట్టుంది. ఫారం ఒకటీ లేదా రెండులో బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారు. అన్నీ నోటిమాటల ద్వారానే తప్ప ఏదీ అధికారికంగా, రాతపూర్వకంగా స్పష్టం చేయరు...! ఈ అస్పష్టతను, అన్యాయాలను ప్రజల ముందుంచింది నవతెలంగాణ. 14 గ్రామాలు, వాటిని ఆవరించి ఉన్న వందలాది ఎకరాలలోని గుట్టలు, వాగులు, వంకలు, అటవీ సంపద, జీవజాలం తదితర అపారమైన పర్యావరణ నష్టాన్ని, జీవ వైవిధ్య రక్షణ పట్టించుకోని ప్రభుత్వ వైనాన్ని కథనాలుగా వెలువరించింది. భూములు లేని పేదల పరిస్థితేమిటి? ఇది లోకానికి ఎరుకచేసింది 'నవతెలంగాణ'. ప్రాజెక్టు సమగ్ర నివేదిక తయారు కాకుండానే ఎందుకు భూసేకరణకు తొందరపడుతున్నారు? ఈ సేకరణలో ప్రజాభీష్టం ఎంత? అని ప్రశ్నించింది. ఇది సహజంగానే ప్రజలు పోరాటానికి సంఘటితం కావడానికీ, వారికి బయట నుంచి మద్దతు కూడగట్టడానికీ దోహదపడింది. అంతే సహజంగా ప్రభుత్వాధినేతకూ కడుపు మండింది. అందుకే ఆయన నవతెలంగాణపై తన అక్కసు వెళ్లగక్కినారు..!



ప్రజా ప్రయోజనాలను గాలికొదిలి, కమీషన్లకు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు రక్షణ ఇవ్వడానికి కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి తన పాలన కింద సాగుతున్న అన్యాయాలను, అక్రమాలను నిరంతరం ప్రజలకు నివేదిస్తున్న 'నవతెలంగాణ'ను నిందించడంలో ఆశ్చర్యం ఏమీలేదు. నిజంగా నవతెలంగాణ చెప్పింది అవాస్తవమైతే, నిజమేమిటో చెప్పి ప్రజల హృదయాలను గెలుచుకోవాలే తప్ప పత్రికలను హేళన చేయడం బాధ్యత అనిపించుకోదు.

ఆయన కేవలం నవతెలంగాణ పత్రికనే కాదు ప్రశ్నించిన సమస్త రాజకీయ పక్షాలనూ, ప్రజా సంఘాలను తూలనాడారు. ఇల్లుకు ఇల్లు, భూమికి భూమి పరిహారం, అర్హులైన వారికి, అవసరమైనవారికి ఉద్యోగం, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు అని సభలు సమావేశాల్లో నోటి నిండా మాట్లాడుతున్న నేతలు స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులతో ఎందుకు ముందుకు రావడంలేదు...? తమ ఊరిని, భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి "ఒక్క విలేజ్ ప్రాజెక్టును ఆపుదా;" వేముల ఘాటేమన్నా ప్రపంచ యుద్ధం తెస్తదా" అనడం ప్రజలను అవమానించడం కాదా..? పత్రికల పట్ల, ప్రజల పట్ల ఆయనకున్న గౌరవం ఇదేనా...? ప్రశ్నించే కలాలను, గళాలను అభివృద్ధి నిరోధకులుగా ప్రచారం చేయడమేనా అభివృద్ధి? ప్రాజెక్టుల పేరుతో ఆయన సాగిస్తున్న తెలంగాణ పురోగమనం దేవతా వస్త్రాల వలె ఆయన సామంతులకు తప్ప సామాన్యులకు కనపడటం లేదు. "మాటలు కోటలు దాటుతాయి.. కాలు గడపదాటదు" అన్నట్టు ముఖ్యమంత్రి మాటలకు, చూపే ఆశలకు అంతులేదు. ఆయన తలపెట్టిన మల్లన్నసాగర్‌లో కొంపాగోడూ, గొడ్డూ గోదా, ఊరూ-పేరూతో పాటు సమస్త జీవితాన్ని కోల్పోతున్న వేల కుటుంబాలు ఆయన దాష్టీకానికి సజీవ సాక్షులుగా కండ్ల ముందుండగా సమాధానం చెప్పలేక ప్రశ్నించే గొంతులను నొక్కజూసే ప్రయత్నం దేనికి సంకేతం..? అక్షరాలను చూసి అధికారం ఆందోళన చెందుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

సమస్తం కోల్పోయి గుండెలు మండుతున్న మనుషులు ఉద్యమాలై ఎగిసిపడుతున్న సందర్భాన్ని అక్షరీకరించడం నేరమా..? పంతాలకు పట్టింపులకు పోతూ చెప్పింది చేయకుండా, చేసేది తెలియనివ్వకుండా కట్టిన మాయపరదాలను తొలగించడం దోషమా..? ఇది ప్రజల పక్షాన నిలిచే ఏ పత్రికకైనా అనివార్యమైన బాధ్యతే కదా..! నిజానికి నిబద్ధతతో ఈ బాధ్యత నిర్వహిస్తున్న నవతెలంగాణను ముఖ్యమంత్రి అభినందించాలి. విజ్ఞతతో సమస్యను గుర్తించి పరిష్కరించాలి. లేదా పత్రిక చెప్పింది తప్పయితే ఒప్పేమిటో ప్రజలకు వివరించాలి. ప్రభుత్వాధినేతగా అది వారి బాధ్యత. అందుకే చెప్పండి...! మా మట్టి, మా నేల, మా గుడిసె, మా చేను, మా చెలక, మా సంబురం, మా జాతర, మా బొడ్రాయి వీటన్నిటినీ మింగుతున్నదెవరు..? ఎందుకు..? అడుగుతున్నారు ప్రజలు. ∎

వైజ్ఞానిక స్పృహ కాస్త పె(ప)ంచుకుందాం రండి!



డాక్టర్ దేవరాజు మహారాజు

భారతీయ సమాజం చాలా విచిత్రమైంది. ఒకవైపు ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలతో ముందంజ వేస్తూనే, మరోవైపు దేవుడికి, దయ్యాలకు, బాబాలకు, అతీంద్రియ శక్తులకు, మూఢనమ్మకాలకు పెద్దపీట వేస్తుంది. అసలు పూజలు చేసి రాకెట్ ప్రయోగాల్లో పాల్గొనే శాస్త్రజ్ఞులు, అర్చనలు చేసి సర్జరీ చేసే వైద్యులు మనకున్నారు. మనకున్న వైజ్ఞానిక సదుపాయాల్ని కాదని వీళ్లు కనీసం ఒక్క నిమిషం కూడా బతకలేరు. అట్లాగని వైజ్ఞానిక స్పృహతో, ఆత్మ విశ్వాసంతో నిలబడనూలేరు. మానసిక దౌర్బల్యం గల పత్రికా విలేకరులు సమాజానికి ఎంత అపకారం చేయగలరో, మానసిక దౌర్బల్యం గల

ఆయా రంగాల్లోని విశేషాల్ని, విజయాల్ని సామాన్యుల కోసం రాసి, శాస్త్రీయ అవగాహనను పెంపొందించాల్సి ఉంది. ఎందుకంటే సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచడం ద్వారా ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించడానికి అలవాటు పడతారు. తద్వారా వారు సామాజిక న్యాయం కోసం పోరాడుతారు. సార్వజనీనత కోసం పాటు పడతారు.


శాస్త్రజ్ఞులు అంతకు పదిరెట్లు కీడు చేయగలరు. అదే అక్షర జ్ఞానం లేనివాడు మానసిక దౌర్బల్యం గల వాడైతే సమాజానికి జరిగే కీడు అంతగా ఉండదు. అందువల్ల చదువుకున్న అజ్ఞానుల వల్లనే, పండిత మూఢుల వల్లనే సమాజానికి ప్రమాదం ఎక్కువ. వీళ్లు శాస్త్రీయాన్ని శాస్త్రీయంగా, అశాస్త్రీయాన్ని అశాస్త్రీయంగా చూడలేరు. అశాస్త్రీయాన్ని తమ మేధో సంపత్తినంతా ఉపయోగించి 'శాస్త్రీయం' చేయాలనుకుంటారు. ఈ ప్రయత్నాలే సమాజాన్ని చావుదెబ్బ తీస్తున్నాయి.

దేశం బాబాలతో, స్వాములతో రోగగ్రస్థమైపోతూ ఉంటే శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు రంగంలోకి దూకరేం? ఒక పెద్ద డిగ్రీ సంపాదించుకుని, ఓ పది పరిశోధనా పత్రాల్ని ప్రచురించుకుని, మూడు సెమినార్లు, ఆరు సింపోజియాలకు హాజరైనంత మాత్రాన అయిపోయిందా? తమకు ఒక విలువను, గౌరవాన్ని ఇచ్చిన సమాజం పట్ల తమ బాధ్యత తీరిందా? మహర్షి మహేష్ యోగి 'వేదాలలో ఆధునిక శాస్త్ర విజ్ఞానమంతా ఉంది' అనంటే; రక్షణశాఖ మంత్రి పర్రికర్ 'మన ఋషులందరూ శాస్త్రజ్ఞులే' అని మన భారతీయ రక్షణ శాస్త్రవేత్తలకు ఉద్బోధిస్తే ఎవరూ ప్రతిస్పందించలేదేం? మహర్షి దయానంద సరస్వతి విమానాల తయారీ గురించి వేదాలలో ఉందని వక్రభాష్యాలు చెబితే ఎవరూ పట్టించుకోలేదేం? ఇటు మతానికి అటు రాజకీయాలకు ముడిపెట్టిన చంద్రస్వామి జైలులో పడ్డా ఎవరూ పెదవి మెదపలేదేం? సత్యసాయిబాబా ప్రశాంతి నిలయంలో ఆయన పడకగదిలో యువకుల హత్యలు జరిగితే, అదేదో పవిత్ర కార్యంగా భావించారా? ఏదీ మన శాస్త్రవేత్తల, మేధావుల పాత్ర? ఏదీ విద్యావేత్తల చొరవ? ప్రభుత్వాలే మూఢత్వంలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు కనీసం కొంతమంది వివేకవంతులైనా ధైర్యంగా ముందుకు రావాలి కదా?

తమకు తాము భగవంతులమని ప్రకటించుకున్న వారి పని ఏమవుతోందో చూస్తూనే ఉన్నాం కదా? పెద్దవాళ్ళతో ఎన్నెన్ని పరిచయాలున్నా కోట్లకొద్దీ డబ్బు మూలుగుతున్నా ఆ రోజుల్లో చంద్రస్వామి జైలుకు వెళ్ళక తప్పలేదు. విభూతి, స్విస్ గడియారాలు, మంగళ సూత్రాల ట్రిక్కులు తేలిపోతున్నాయన్న భయంతోనే సత్యసాయి బాబా చివరిదశలో సాంఘిక కార్యకర్తగా వేషం మార్చాడన్న విషయం గమనించాలి! చూడాలనుకునేవారు బాబా ట్రిక్కులు యూట్యూబ్‌లో స్పష్టంగా చూడొచ్చు! ఆయన కట్టించిన ఆస్పత్రులు మానవ ప్రయత్నాలే కాని, భగవత్ సృష్టికి ఉదాహరణలు కావు. అన్ని ఆస్పత్రులలో మాదిరిగానే ఆ ఆస్పత్రులలో కూడా వైద్య విజ్ఞాన నిపుణులే ప్రాణాల్ని నిలుపుతున్నారు. బాబా చలువవల్ల ప్రాణాలు నిలువలేదు. జబ్బులు నయం కాలేదు. ఆయన చేపట్టిన సాంఘిక కార్యక్రమాల్ని అభినందించొచ్చు. కానీ ఒక అర్థశతాబ్దం పైగా హస్తలాఘవంతో వస్తువుల్ని సృష్టించి జనాన్ని మోసం చేస్తుంటే మన ప్రభుత్వాలేం చేశాయి? వైజ్ఞానిక సంస్థలేం చేశాయి? ఆలోచించండి!

"శూన్యంలోంచి శూన్యం తప్పమరేదీ రాదు" అన్న సూత్రం ఇప్పటిది కాదు. క్రీ.పూ.99-55లోనే లుక్రిషియస్ ప్రతిపాదించాడు. కాని ఇన్ని వేల యేండ్లు గడిచినా మనం శూన్యంలోంచి ఎవరైనా ఏదైనా మ్యాజిక్ చేసి సృష్టిస్తే నిజమేనని నమ్ముతున్నామే? ఇలాంటి విషయాల్లో శాస్త్రవేత్తలు మౌనం వహిస్తారెందుకూ? స్వభావ సిద్ధమైన ప్రకృతి సూత్రాలకు భిన్నంగా ఏదీ జరగదని జన సామాన్యానికి తెలియజెప్పరెందుకని?వీరి మౌనమే 'మానవ దేవుళ్ళ'కు ఒక రకంగా బలం చేకూర్చుతోంది. విద్యావంతులు శాస్త్రజ్ఞులు సామాన్యుడికి అండగా నిలబడకపోవడం వల్లే అతడు అయోమయంలో కొట్టుకుపోతున్నాడు. ప్రవాహానికి ఎదురీదడానికి ఎంతో ఆత్మవిశ్వాసం కావాలి. అయితే అదెంతో కష్టమైన పని. ప్రవాహంలో పడికొట్టుకుపోవడం చాలా తేలికైన పని. అందుకే ఎక్కువ మంది కండ్లు మూసుకుని ప్రవాహంలో కొట్టుకు పోవడానికే ఇష్టపడుతున్నారు. అందుకే ఈ సమాజ స్వరూపం ఇలా ఉంది.

మానసిక దౌర్బల్యం గల కొంతమంది శాస్త్రవేత్తలు ప్రజల్లోకి వచ్చి, ప్రజల భావనల్ని అర్థం చేసుకుని, నిజానిజాలేవో బహిరంగంగా చర్చించలేక పోతున్నారు. నిజానికి అదే వారి ముఖ్యమైన బాధ్యత! అలాంటి వారి గూర్చి కార్ల్ సాగన్ ఇలా అంటాడు. "కొంతమంది వైజ్ఞానికులు నేరుగా కొన్ని ప్రాథమిక విషయాల మీద ప్రజలతో సంభాషించడానికి ఇష్టపడడం లేదు. ఎందుకంటే తమ వ్యక్తిగత ఆత్మన్యూనతా భావంతో వారు అడిగే సూటి ప్రశ్నలకు, చిన్న ప్రశ్నలకు జవాబివ్వలేమోనని భయపడుతూ ఉంటారు. అసలైతే అదొక గొప్ప అవకాశం! సమాజాన్ని ఇంత ముందుకు తీసుకొచ్చిన సైన్సు, మనిషి జీవితాన్ని ఇంత సుఖప్రదం చేస్తున్న సైన్సు గురించి వారు ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో చెప్పుకోగల సందర్భం అది. తాము, తమ రంగంలోని ఇతర సహచరులు చేస్తున్న అద్భుత పరిశోధనల గూర్చి ప్రజలకు చెప్పి ఆ ఆనందాన్ని పంచుకోవడమంటే అదొక అద్భుతమైన అనుభూతే కదా? ఆ విషయమే వారు గ్రహించడం లేదు" అని!



"విజ్ఞానం ద్వారా బలమైన తాత్త్వికత, నిజాయితి, బుద్ధి కుశలత

లభిస్తాయి., శ్రమ పట్ల గౌరవం ఏర్పడుతుంది" అని అన్నాడు

రష్యన్ మహారచయిత గోర్కి. ఇంతకంటే మరింత స్పష్టంగా, మరింత సూటిగా హెచ్చరించాడు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్!

"సత్యాన్ని సత్యంగాను అసత్యాన్ని అసత్యంగాను తెలుసుకో!

హేతువాదం చేయనివాడు మూర్ఖుడు, అవివేకి

హేతువాదం చేయ సాహసించనివాడు బానిస" - ఇలా

దర్శనికులైన కొంత మంది మహానుభావుల మాటలు చెప్పుకునేది ఎందుకంటే అందులోంచి ఏ కొంచెమైనా స్ఫూర్తి ప్రజలు అందుకుంటారని, సమాజంలో శాస్త్రీయ అవగాహన పెంచడంలో శాస్త్రవేత్తల, మేధావుల, ఉపాధ్యాయుల, రచయితల పాత్ర ఎక్కువగా ఉంటుంది. నిజమే కానీ, పౌరులందరికీ కూడా సమాన బాధ్యత ఉంటుంది. వారు భాగస్వాములయినప్పుడే మార్పు సంభవిస్తుంది. సైంటిఫిక్ డెమాక్రసీ రూపుదిద్దుకుంటుంది.


కొత్త కొత్త విషయాల్ని కనిపెట్టి, దేశాన్ని ప్రపంచ దేశాల మధ్య తలెత్తుకునేట్టు చేయగల శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, విద్యావేత్తలు మనకు తప్పకుండా ఉన్నారు. అయితే వారు వారి ప్రయోగశాలలకు, కార్యశాలలకు మాత్రమే కుంచించుకు పోకుండా, ముందుండి నాయకత్వం వహించి, సామాన్యుడి ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ వారికి అండగా నిలబడగలగాలి! రాబోయే తరాల్ని ప్రభావితం చేయగలగాలి కూడా!! అంతేకాదు, మొత్తానికి మొత్తంగా మాజంలో హేతుబద్ధత పెంచగలగాలి!!

విద్య, వైజ్ఞానిక రంగంలోని వారు ముందుకొచ్చి జనాన్ని చైతన్యవంతుల్ని చేయడం ఇక తప్పని సరి. ఆ మాటకొస్తే ఇది ప్రతి పౌరుడి కర్తవ్యం! సైన్సు మాట్లాడుతున్నట్టే మాట్లాడుతూ, తాము గొప్ప ప్రగతి శీల వాదుల మంటూ ప్రకటించుకుంటూనే ఆ ముసుగులోనే శతాబ్దాల కిందటి పనికిరాని నీతుల్ని, శాస్త్రాల్ని వల్లె వేసేవారు ఎక్కువైపోయారు. జనం ఎంతో జాగ్రత్త వహించాల్సి ఉంది. కాలుష్యాల గురించి, కల్తీల గురించి, మద్యపాన నిషేధం గురించి పోరాడుతూనే ఉన్నారు. స్త్రీల దళితుల మైనార్టీల హక్కుల గురించి ఉద్యమిస్తూనే ఉన్నారు. అంతే ఉధృతంగా లేదా అంతకంటే ఉధృతంగా పుచ్చిపోయిన భావజాల ప్రచారకులను కూడా ఎదుర్కోవాలి. ప్రజలంతా ఏకమైతే, మూఢభక్తిలో మునిగే ప్రభుత్వాల్ని కూడా మార్చొచ్చు. వైజ్ఞానిక స్పృహ ఇక అనివార్యమని చెప్పగలిగే వాళ్ళు - చెపుతూనే ఉండాలి. ఉపన్యసించేవారు ఉపన్యసిస్తుండాలి. రాసే రచయితలు రాస్తూండాలి. ఎందుకంటే వైజ్ఞానిక స్పృహను స్వీకరించే సమాజం సిద్ధంగా ఉంది. సిద్ధంగా లేకపోతే సిద్ధం చేయాలి. ఇది అందరి బాధ్యత! పత్రికలు, పుస్తకాలు విరివిగా రావాలి.

ఎందుకంటే... రాగల కాలంలో సరళ విజ్ఞాన శాస్త్ర గ్రంథాలకు ప్రజాదరణ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పాఠకుల్లో శాస్త్రీయ జిజ్ఞాస రేకెత్తించి సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాల్ని ఛేదించడానికి విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు ఎన్నివచ్చినా తక్కువే! శాస్త్రజ్ఞులు, డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు అన్ని రంగాల సాంకేతిక నిపుణులు ఆయా రంగాల్లోని విశేషాల్ని, విజయాల్ని సామాన్యుల కోసం రాసి, శాస్త్రీయ అవగాహనను పెంపొందించాల్సి ఉంది. ఎందుకంటే సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచడం ద్వారా ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించడానికి అలవాటు పడతారు. తద్వారా వారు సామాజిక న్యాయం కోసం పోరాడుతారు. సార్వజనీనత కోసం పాటు పడతారు.

వ్యాసకర్త: ప్రముఖ సాహితీవేత్త.
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్. సెల్: 9908633949

అన్నదాతల వద్దకు బ్యాంకు రుణాలా..?!



సిహెచ్. మధు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వప్నం ఫలిస్తే ఎంత బాగుండు..! అన్న దాతల వద్దకు వచ్చి బ్యాంకులు రుణాలిస్తాయని కేసీఆర్ కలలు కంటున్నారు. ఆశాభావం కాదు నిజమనే నమ్మకంతో మాట్లాడుతున్నారు. ఐదేండ్లు సమయమన్నారు. ఐదేండ్లయినా పర్వాలేదు. అన్నదాతల యింటికి వచ్చి బ్యాంకులు రుణాలివ్వగలరా? ఏ నమ్మకంతో కేసీఆర్ మాట్లాడుతున్నారో, ఏ విశ్వాసంతో అన్న దాతలకు ఆశలు కల్పిస్తున్నారో అర్థం కాలేదు. ఐదేండ్ల వరకు కేసీఆర్ ప్రధాని కాగలరా? ప్రధాని అయితే స్వప్నం నెరవేరగలదు. ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థ తప్పటడుగులు. ఏటీయంలు, మొండిబాకీలు అన్నీ తెల్సినవారు. అన్నదాత వద్దకు వచ్చి బ్యాంకులు రుణాలిస్తాయని కలలు కనటం ఆశ్చర్యం కల్గించే విషయం. అనకూడదు కానీ...

బ్యాంకులు మొండి బాకీలను తట్టుకొని నిలబడగలవా? విశ్వాసం పోగొట్టుకున్న బ్యాంకులలో ప్రజల డిపాజిట్లు జమ అవుతాయనే నమ్మకం లేదు. ఏటీయంలు కళకళలాడుతాయనే విశ్వాసం లేదు. ప్రజలు దాచుకున్న డబ్బును వాళ్లవి వాళ్లకు సరిగ్గా యిస్తారనే విశ్వాసం లేదు. జీఎస్‌టీ బ్యాంకు టర్నోవర్ తగ్గించే అవకాశముంది. ఇన్ని లొసుగులు ఇన్ని లోయలు ఇన్ని చీకట్లు ఉన్న బ్యాంకులు వెలుగులోకి రాగలవా? వచ్చినా రైతుల ఇంటికి రుణాలు తెచ్చివ్వగలవా? ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ నమ్మకంతో అన్నారో కానీ, రైతులకు నమ్మకం లేదు. నాలాంటి వాళ్లకు నమ్మకం లేదు.

నరేంద్రమోడీ ప్రధానిగా ఉన్నంత కాలం అన్నదాతల యింటి వద్దకు కాదు బ్యాంకు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా అప్పు పుట్టకపోవచ్చు. ఇప్పుడిస్తున్న కనీస అప్పుకూడా రైతులకు మాయం కావచ్చు. కేసీఆర్ మనసులో ఏముందో కానీ ప్రధాని నరేంద్రమోడీ కార్పొరేట్ ప్రధాని. రైతు వ్యతిరేక ప్రధాని. 'వ్యవసాయ భారత్'గా ఇప్పటి వరకు మనదేశానికి పేరుంది. డిజిటల్ ఇండియాగా మార్చుతానని ప్రధానియే అంటున్నారు. డిజిటల్ ఇండియాలో రైతుకు స్థానమెక్కడ? కనిపించటం కష్టం. నరేంద్రమోడీ కాలంలో జరిగిందేమిటో.. జరుగుతున్న దేమిటో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలియదనుకోను. రిజర్వ్ బ్యాంక్ స్వతంత్ర వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేసారు. గవర్నర్ ఉర్జిత్‌పటేల్ నామమాత్రం! నోట్లరద్దుతో లేని కల్లోలం తెచ్చిపెట్టారు. అంతెందుకూ? రైతు రుణాల మాఫీ విషయంలో కేసీఆర్ రైతులకిచ్చిన హామీ పట్టించుకోలేదు. ప్రధాని నరేంద్రమోడీ ఎన్నడైనా రైతులగూర్చి మాట్లాడారా? ఏ నమ్మకంతో కేసీఆర్ అన్నదాతల వద్దకు బ్యాంకు రుణాలని నమ్మకం పలికారో అర్థం కాలేదు. నరేంద్రమోడీ ప్రధానిగా ఉన్నంతకాలం రైతు బతుకులకు భద్రత లేదు.

శరద్‌యాదవ్ ఇటీవల పార్లమెంట్‌లో ఒక మాట చెప్పారు. విషాదకరమైన, దుఃఖపూరితమైన మాట 'మోడీ కాలంలో ప్రతిదినం 15-20 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఈ విషాదం ప్రధాని మోడీకి చీమకుట్టినట్టుగా లేదు.. ఇటువంటి ప్రధాని కాలంలో, రైతు వ్యతిరేక ప్రధాని కాలంలో రైతుల యింటివద్దకు బ్యాంకు రుణాలు రాగలవా? ఎంత వెక్కిరింపు!?

మోడీ కాకపోతే మరొకరు ప్రధాని అవుతారు. ఎవరు ప్రధాని అయినా, కార్పొరేట్ సామ్రాజ్య రక్షకునిగా మారుతారే తప్ప రైతు రక్షకునిగా మారరు. ఎన్ని చూడలేదు మనం..? రైతు ఆత్మహత్యలపై ఇన్ని మాట్లాడుతున్న కాంగ్రెస్ కాలంలో రైతు ఆత్మహత్యలు లేవా? కాంగ్రెస్ కాలంలో రైతు బతుకు పచ్చని పంటగా ఉందా? ఎండిపోయిన గడ్డిలా ఉండి ఎన్నో రాష్ట్రాలకు ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారు. ఇందులో రైతు కుటుంబాల నుండి వచ్చిన వారున్నారు. వీళ్లు రైతులకు చేసిందేమీ లేదు. రైతు వ్యతిరేక పునాదులు ఈ వ్యవస్థలో ఉన్నాయి. అంతెందుకూ?



మన కేసీఆర్ ప్రధాని అయితే, గియితే రైతు వద్దకు బ్యాంకు రుణాలు స్వప్నం ఫలించవచ్చు. సాధ్యమా? ఏమో గుర్రం ఎగిరినా ఎగురవచ్చు. జింక అరణ్యాన్ని పాలించినా పాలించవచ్చు. చెప్పలేం... రాజకీయాలు ఊహకందటం లేదు. వెంకయ్య ఉపరాష్ట్రపతి అవుతారని ఊహించామా? మన తెలుగు ఉపరాష్ట్రపతి అయ్యాడని ఎగిరి గంతులేస్తున్నాం.. కానీ అందులో 'రాజకీయాలు' లేవని ఎవరైనా అనగలరా?

ఐదేండ్ల తర్వాత రైతుల ఇంటికి బ్యాంకులు లోన్ తెచ్చియిస్తారని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎలా నమ్మకం కలిగిందో అర్థం కాదు. కేసీఆర్ విజ్ఞుడు. బాగా చదువుకున్న నాయకుడు. పదమూడేండ్ల ఉద్యమంలో ప్రజలతో కలిసి నడిచిన లీడర్. అంతనమ్మకం ఎలాకలిగిందో అర్థంకాదు. ఐదేండ్ల మాట. ఎలా అనగలిగారు? బ్యాంకులలో అంతధనం మూలబడి ఉందా? డబ్బును ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితిలో బ్యాంకులున్నాయా? పాలకపక్షానికి, బ్యాంకులకు డెబ్బైయేండ్ల స్వతంత్ర కాలంలో లేని ప్రేమ రైతులపై అకస్మాత్తుగా కలుగుతుందా?

ఈ దేశంలోని ఆర్థిక నిపుణులు, ఆర్థిక శాస్త్రవేత్తలు పనికిమాలిన వాళ్లు వాళ్ళకు దేశ పునాదులు అవసరం లేదు. పల్లెలు, సామాన్యజనం, రైతులు... దేశం వ్యవసాయంపై ఆధారపడి ఉందని నిజాన్ని వారు అంగీకరించరు. దేశంలో పెరిగిన విపరీత ఆర్థిక అంతరాలు వాళ్ల దృష్టికి రావు. వాళ్లకార్పొరేట్ వెలుగులు చూసి, అందచందాలు చూసి దేశం చాలా అభివృద్ధిలో వుందని ఆర్థిక లెక్కలు వేస్తారు. నల్లధనం స్విడ్జర్లండ్‌లో ఉంటే ఇక్కడ పెద్దనోట్లు రద్దు చేయిస్తారు. 70శాతం ఇంగ్లీషు రానివాళ్లు దేశంలో వుంటే 50శాతం నిరక్షరాస్యులుంటే... నగదు రహిత లావాదేవీలు, డిజిటల్ ఇండియా అంటారు. వ్యవసాయానికి ప్రాధాన్యత యివ్వకుండా పరిశ్రమలు.. పరిశ్రమలు అంటరు. సుమారు పదిలక్షల కోట్లు మొండి బకాయిలు జనం తలలపై మోపారు. పరిశ్రమలమూలంగా ఎందరికి ఉపాధి లభించింది! పది లక్షల కోట్లు నిరుద్యోగులకిస్తే ఎన్ని లక్షల మంది ఉపాధి పొందేవారు. వారికి అంచనా లేదు. ఇదంతా కేసీఆర్‌కు తెలియదనుకోలేను. మూడేండ్ల నుండి రైతుల రుణమాఫీ గురించి కేసీఆర్ ఎన్నిసార్లు కేంద్రానికి విన్నవించినా పట్టించుకున్న నాథుడులేడు. ఎంత ఇవి? కొన్ని వేల కోట్లు అంతే! అరుంధతీ భట్టాచార్య రైతుల రుణమాఫీ సాధ్యం కాదు అనేచెబుతున్నారు. ఇది ఎవరి ప్రపంచం? ఎవరి దేశం? రైతులదా? ధనిక వర్గానికి... ఐదేండ్ల వరకు బ్యాంకుల రుణం మారిపోతుందా? ఏ నమ్మకం మీద మాట్లాడుతున్నారు?

రాబోయే ఏడాదిలో బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలినా ఆశ్చర్యపోవల్సిన అవసరం లేదు. బ్యాంకులు ప్రధానమైన వ్యవసాయరంగానికి అప్పులివ్వటం లేదు. సామాన్యజనం వాడుకునే వస్తువులను కుటీర పరిశ్రమలకు అప్పగించి అప్పులు యివ్వటం లేదు. వాహనాలకు, ఉన్నోళ్ల ఉద్యోగుల గృహాలకు, దివాలా తీసే పరిశ్రమలకు అప్పులిస్తున్నారు. ఇవి ఉత్పత్తిరంగాలు కావు. ఉపాధి రంగాలు కావు. బ్యాంకులు అనుసరిస్తున్న వైఖరితో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలినా ఆశ్చర్యపోవల్సిన అవసరం లేదు.

సెల్: 9949486122

అవమానాలే కసిని పెంచాయి...

జులై నెల ఓ అద్భుతం జరిగింది. క్రికెట్‌ను ఓ మతంగా పూజించే దేశంలో.. మహిళ క్రికెట్ జట్టుకు మాత్రం ఏమాత్రం గౌరవం లేదు... కనీస సౌకర్యాలు లేవు. అన్ని అవమానాలను అధిగమించి ప్రపంచకప్ ఫైనల్ వరకు వెళ్లారు. ఎన్నడూ లేని విధంగా దేశం మొత్తం టీవీల ముందు కూర్చుని మహిళా క్రికెట్‌ను చూసేలా చేశారు. ఇదంతా అందరికీ తెలిసిందే. కానీ ప్రారంభ దశలో వాళ్లు పడ్డ అవమానాలు అనేకం. అమ్మాయిలన్న కారణంగానే ఎంతో వివక్షను ఎదుర్కొన్నారు. ఓ ఐదుగురు క్రికెటర్ల అనుభవాలు.. వారి మాటల్లోనే.

ఆ ప్రవర్తన చూశాకే...



'నాకు ఐదారేండ్లు ఉన్నప్పుడు బాయ్‌కట్ ఉండేది. సో నేను అబ్బాయిలతో కలిసి ఆడేటప్పుడు తమ మధ్యలో అమ్మాయి ఉందన్న విషయాన్ని కూడా ఎవ్వరూ గుర్తించేవారు కాదు. కానీ వాళ్లు గుర్తించాక షాకయ్యారు. భిన్నంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. ఆ ప్రవర్తనను చూసిన తరువాతే సిక్స్‌లు కొట్టాలని, వికెట్స్ తీయాలని కసి నాలో పెరిగింది'

- శిఖా పాండే, ఆల్‌రౌండర్

నిత్యం ప్రశ్నలే...



'మహిళల క్రికెట్ రూల్స్ అన్నీ పురుషుల క్రికెట్‌లో ఉన్నట్టే ఉంటాయా' నన్ను నిత్యం అడిగేవారు. 'ఐదు రోజుల గేమ్ ఆడతారా? బౌండరీస్ అంతే విశాలంగా ఉంటాయా? బ్యాట్స్ ఒకేతీరుగా ఉంటాయా? భిన్నంగా ఉంటాయా' వంటి పిచ్చి ప్రశ్నలన్నీ వేసేవారు. ఎవరు ఆడుతున్నారన్నది కాదు... ఏ క్రీడలో అయినా రూల్స్ ఒకే విధంగా ఉంటాయి. ఇటీవలి ఓ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కూడా 'మీ అభిమాన మేల్ క్రికెటర్ ఎవరు?' అని అడిగారు. మహిళల పట్ల వాళ్ల ఆలోచనలు ఎలా ఉంటాయనడానికి ఉదాహరణలు ఇవి'

- మిథాలీరాజ్, కెప్టెన్

తిరస్కరణే నడిపించింది...



'అండర్-19 బెంగాల్ జట్టుకు ఎంపికైన తరువాత ఓరోజు ప్రాక్టీస్ నుంచి ఇంటికి ట్రైన్‌లో వస్తున్నాను. చేతిలో క్రికెట్ కిట్ బ్యాగ్ ఉంది. చాలా పెద్దది. క్రికెట్ ఆడటానికి నీకేమీ సిగ్గుగా అనిపించడం లేదా? అది అబ్బాయిల గేమ్ కదా... వంటి వ్యాఖ్యలు వినిపించేవి. ఆ రోజు ఆ మాటలు అన్నవాళ్లే ఈ రోజు నన్ను చూసి గర్వపడుతున్నారు. వివక్ష పూరిత పరిస్థితిలు ఎదుర్కొన్నది చిన్నతనంలోనే వెస్ట్‌బెంగాల్‌లోని చకధాలో ఉన్నప్పుడే. నేను టీమ్‌లో ఉన్నందుకు... అమ్మాయి ఉన్న టీమ్‌లో మేం ఆడం అని చెప్పి... చుట్టుపక్కల అబ్బాయిలు తిరస్కరించేవారు'

- ఝులన్ గోస్వామి, ఫాస్ట్ బౌలర్

ప్రొఫెషనల్‌గా ఆడతారా?



'నా చుట్టుపక్కల వాళ్లు, కుటుంబం నుంచి కోచ్ వరకు అందరూ నాకు సహకరించారు. ప్రారంభం నుంచి నన్ను ప్రోత్సహిస్తూ ఇంకా బాగా ఆడేందుకు తోడ్పడ్డారు. ఒకే ఒక్క సవాల్ నేను ఎదుర్కొన్నది... నేను వచ్చిన ప్రాంతంలో ఎక్కువమంది క్రికెట్ ఆడకపోయేవారు. అలాంటిచోట అమ్మాయిల క్రికెట్‌కు అవకాశమే లేదు. చాలా కాలం వరకు అమ్మాయిలు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడతారన్న విషయం నాకు కూడా తెలియదు. కానీ ఓ రోజు స్కూల్ నేను కొందరు అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడుతుండటం గమనించిన మా టీచర్ 'నీకు క్రికెట్ అంటే ఎక్కువ ఆసక్తి ఉంటే.. అమ్మాయిల టీమ్‌ను ఏర్పాటు చేద్దాం' అన్నారు. అలా నా లాంటి అమ్మాయిలకు తమలోని నైపుణ్యాన్ని చూపించే అవకాశం దొరికింది'

- హర్మాన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్

కరాటే నాకు ప్లస్...




'చాలాసార్లు ఇది చేయడానికి మన శరీరం సహకరిస్తుందా అని ఆలోచిస్తాం. సింపుల్‌గా నో చెప్పేస్తాం. వందశాతం అంగీకారం లేకుండా ఓ పెద్ద టాస్క్‌కోసం నువ్వు సన్నద్ధమవ్వడం అనేది పెను సవాల్. అంతకుమించి నేనే సమస్యా ఎదుర్కోలేదు. ఎందుకంటే అబ్బాయిలతో కలిసి ఆడుతున్నా సరే.. అక్కడ నేనే బాస్. అబ్బాయిలను ఏడిపించేదాన్ని. కారణం... చిన్నప్పటినుంచి నేను కరాటే నేర్చుకుని ఉండటం. దాంతో నన్ను టచ్‌చేయడానికి కూడా ఎవ్వరూ సాహిసించేవాళ్లు కాదు. కాబట్టి గ్రూప్‌లో ఎప్పుడూ నేనే లీడర్'

- వేదా కృష్ణమూర్తి, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్ ఉమెన్

ఇట్లచేద్దాం

కొంచెం నీటిలో దాల్చిన చెక్క పొడి వేసి మెత్తగా పేస్టులా చేసుకుని మొటిమలకు పట్టిస్తే తగ్గుముఖం పడతాయి.



ఆడపిల్ల పుట్టినందుకే...

హారిక డిగ్రీ పూర్తి చేసింది. ఇంట్లో పీజీ చేపిద్దామనుకున్నారు. తనకు కూడా చదువంటే చాలా ఇష్టం. ఈ లోపు మంచి సంబంధం ఉందని దగ్గరి బంధువులు చెప్పారు. అబ్బాయిది గవర్నమెంట్ ఉద్యోగం. పేరు కిషోర్. మంచి సంబంధం వదులుకుంటే మళ్ళీ దొరకడం కష్టమని ఆ సంబంధమే ఖాయం చేశారు. ఘనంగా పెండ్లి చేశారు. కొన్ని రోజులు వారి సంసారం బాగానే సాగింది. కిషోర్‌కు తాగుడు అలవాటయింది. కొత్తలో తాగొచ్చినా ఇంట్లో పెద్దగా గొడవ చేసేవాడు కాదు. దాంతో హారిక పట్టించుకునేది కాదు. కొన్ని రోజులకు హారిక నెల తప్పింది. అబ్బాయే కావాలని కిషోర్ అంటుండేవాడు. హారిక అందమైన పాపకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె కష్టాలు మొదలయ్యాయి.

ఆడపిల్లను కన్నదని కిషోర్, హారికను నానా మాటలూ అనేవాడు. రోజూ తాగొచ్చి కొట్టేవాడు. బాధలన్నీ మౌనంగా భరించేది. రెండో సారి కొడుకు పుడతాడని ఆశపడింది. అప్పుడైనా తన కష్టాలు తీరిపోతాయిని కలలు కన్నది. పుట్టింట్లో తన కష్టాలు తెలిస్తే బాధపడతారని వారికి చెప్పకుండా లోలోపలే కుమిలిపోయేది. ఆ కష్టాల మధ్యనే హారిక రెండోసారి నెల తప్పింది. ఈ సారి కొడుకు పుడతాడని కిషోర్ తెగ సంబర పడ్డాడు. హారిక మనసులో మాత్రం భయం. ఈ సారి కూడా ఆడపిల్లే పుడితే తన పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని ఒకటే దిగులు.

చివరకు హారిక భయపడినట్టే జరిగింది. మళ్ళీ ఆడపిల్లే పుట్టింది. తన కష్టాలు రెట్టింపయ్యాయి. 'పుట్టింది ఎవరైతే ఏంటి, మంచిగా పెంచుకుందాం' అని హారిక ఎంత నచ్చజెప్పాలని చూసినా కిషోర్ అస్సలు వినేవాడు కాదు. తాగుడు ఇంకా పెంచేశాడు. విపరీతంగా కొట్టేవాడు. ఈ బాధలు భరించలేక పోలీస్ స్టేషన్లో కేసుపెట్టింది. పోలీసులు కిషోర్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడానికి ప్రయత్నించారు. పోలీసులు ఎంత చెప్పినా కిషోర్ తన ధోరణి మార్చుకోలేదు. చివరకు పోలీసులు కూడా చేతులెత్తేశారు.

పోలీస్‌స్టేషన్‌లో కేసుపెట్టిందని కిషోర్, హారికపై కోపం పెంచుకున్నాడు. ఒక రోజు అర్ధరాత్రి తాగొచ్చి హారికను విపరీతంగా కొట్టి ఇంట్లో నుంచి గెంటేశాడు. ఆ సమయంలో ఎటు పోవాలో తెలియక పిల్లలతో పాటు పోలీస్ స్టేషన్‌లోనే తల దాచుకుంది. తెల్లవారిన తర్వాత ట్రైన్ ఎక్కి పుట్టింటికి వచ్చి జరిగిన విషయమంతా చెప్పింది. ఏం చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమె బంధువుల ద్వారా ఐద్వా లీగల్‌సెల్ గురించి తెలిసి వారికి ఫోన్ చేసింది.

ఫోన్లో వాళ్ళు చెప్పిన అడ్రస్ ప్రకారం వెళ్ళి అక్కడి వాళ్ళకు తన కష్టాలన్నీ చెప్పుకుంది. 'ఓ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఇంత ఘోరంగా ప్రవర్తిస్తాడా? పైగా అతను బాగా చదువుకున్న వాడు. ఈ రోజుల్లో కూడా ఆడపిల్ల పుట్టిందని సమాజంలో ఒక హోదా ఉన్న వాళ్ళే ఇలా ప్రవర్తిస్తే ఇక చదువు లేని వారి పరిస్థితి ఏమిటి?' అని లీగల్‌సెల్ వాళ్ళు అతనితో మాట్లాడటానికి రమ్మని ఎన్ని సార్లు కబురు పంపినా అతను రాలేదు. దాంతో కిషోర్ వివరాలు కనుక్కోమని స్థానిక ఐద్వా నాయకులకు చెప్పారు.

> **చివరకు హారిక భయపడినట్టే జరిగింది. మళ్ళీ ఆడపిల్లే పుట్టింది. తన కష్టాలు రెట్టింపయ్యాయి. 'పుట్టింది ఎవరైతే ఏంటి, మంచిగా పెంచుకుందాం' అని హారిక ఎంత నచ్చజెప్పాలని చూసినా కిషోర్ అస్సలు వినేవాడు కాదు.**

లీగల్‌సెల్ సభ్యులు, స్థానిక ఐద్వా నాయకులు, కేవీపీఎస్ వారి సహకారంతో అతను పని చేసే ఆఫీస్‌కు వెళ్ళారు. అప్పటికే కిషోర్ వారం రోజుల నుంచి సెలవులో ఉన్నాడని తెలిసింది. అయినా కూడా కిషోర్ పై అధికారులను కలిసి అతను భార్యా, పిల్లల్ని ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో చెప్పారు. హారికను, పిల్లల్ని చూసి స్పందించిన అధికారులు వెంటనే కిషోర్‌కు ఫోన్ చేసి 'నీ భార్యా పిల్లలతో ఇంత ఘోరంగా ప్రవర్తిస్తావా? ఆడపిల్ల పుట్టిందని భార్యను కొట్టి అర్ధరాత్రి ఇంట్లో నుంచి గెంటేస్తావా? నువ్వు ఇలాగే చేస్తే నిన్ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తాం. ఇకపై మంచిగా ఉండకపోతే చివరకు ఉద్యోగమే పోయే ప్రమాదం ఉంది. ఇప్పుడైనా నీ భార్యా పిల్లల ముఖం చూసి వదిలేస్తున్నాం' అని హెచ్చరించారు.

అమాయకురాలైన హారిక అప్పటి వరకు భర్త ఎన్ని కష్టాలు పెట్టినా, ఎంత హింసించినా మౌనంగా భరించింది. అందుకే అతని ఆటలు సాగాయి. ఎప్పుడైతే ఆమె లీగల్‌సెల్ వారి సహాయంతో భర్త పని చేసే ఆఫీస్ వరకు వెళ్ళిందో అతనిలో భయం మొదలయింది. దాంతో వెంటనే అతను హారికకు ఫోన్ చేసి ఇంటికి రమ్మంటూ బతిమలాడుకున్నాడు. ఐతే ఆమె మాత్రం 'ఏమైనా మాట్లాడాలనుకుంటే లీగల్‌సెల్ దగ్గరకు వచ్చి మాట్లాడు' అని ఫోన్ పెట్టేసింది.

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

వెంటనే లీగల్ సెల్‌కు వచ్చి 'మేడమ్ నేను చేసింది తప్పే, ఇకపై అలా చేయను. నా భార్యా పిల్లలను నాతోపాటే తీసుకెళతాను. మంచిగా చూసుకుంటా' అన్నాడు.

అతని మాటలు విన్న బాధ్యులు 'ఇప్పుడు నువ్వు నీ ఉద్యోగం పోతుందని భయపడి ఇలా మాట్లాడుతున్నావు. మళ్ళీ కొన్ని రోజుల తర్వాత నీ బుద్ధి కచ్చితంగా మారుతుంది. అయినా ఆడపిల్ల పుట్టిందని భార్యను హింసించడం ఏంటి. చదువుకున్న వాడివేగా. ఆడపిల్లలు పుట్టడానికి కారణం ఎవరు. మగాళ్ళు కాదా? ఆ మాత్రం తెలియదా? ఎవరు పుడితే ఏంటి. జాగ్రత్తగా పెంచుకోవాలి. తాగొచ్చి నీ ఇష్టం వచ్చినట్టు కొట్టి అర్ధరాత్రి బయటకు గెంటావు. ఆ సమయంలో వాళ్ళకు ఏమైనా అయితే పరిస్థితి ఏంటి? నీ లాంటి వాళ్ళు ఇంత మూర్ఖంగా ఆలోచిస్తున్నారు కాబట్టే ఆడపిల్ల పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుంది' అన్నారు.

'మేడమ్, ఇప్పటి వరకు నేను చేసిన దానికి సిగ్గుపడుతున్నా. హారికను చాలా కష్టాలు పెట్టాను. నా పిల్లల్ని కూడా ప్రేమగా దగ్గరకు తీసుకోలేదు. ఇకపై ఇలాంటి తప్పు చేయను. వాళ్ళను ప్రేమగా చూసుకుంటా. నా మాట నమ్మండి' అంటూ బతిమాలుకున్నాడు.

> **'ఓ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఇంత ఘోరంగా ప్రవర్తిస్తాడా? పైగా అతను బాగా చదువుకున్న వాడు. ఈ రోజుల్లో కూడా ఆడపిల్ల పుట్టిందని సమాజంలో ఒక హోదా ఉన్న వాళ్ళే ఇలా ప్రవర్తిస్తే ఇక చదువు లేని వారి పరిస్థితి ఏమిటి?'**

'నీతో రావాలా? వద్దా అని నిర్ణయించుకోవల్సింది హారిక. మేము కాదు. కాబట్టి నువ్వు నీ భార్యతోనే మాట్లాడుకో' అన్నారు. కిషోర్ పక్కనే ఉన్న భార్యతో 'హారిక ఇకపై నీకూ, పిల్లలకు ఎలాంటి కష్టం లేకుండా చూసుకుంటా. ఇప్పటి వరకు నీతో చాలా తప్పుగా ప్రవర్తించాను. పిల్లలను తీసుకుని మన ఇంటికి వచ్చేసెయ్' అన్నాడు. భర్త అంతగా బతిమలాడడంతో హారిక కిషోర్‌తో వెళ్ళడానికి ఒప్పుకుంది.

అయితే వెళ్ళే ముందు స్థానిక ఐద్వా వాళ్ళ సలహా కూడా తీసుకుంది. మళ్ళీ కిషోర్‌తో ఏదైనా సమస్య వస్తే తమను కలవమని ఐద్వా నాయకులు ధైర్యం చెప్పారు. వారిచ్చిన ధైర్యంతో హారిక పిల్లల్ని తీసుకుని భర్తతో వెళ్ళింది. ఆమె అక్కడకు వెళ్ళిన రోజు మామ ఇంటికి వచ్చి 'చూడమ్మా, ఇకపై మావాడి వల్ల నీకూ, పిల్లలకు ఎలాంటి సమస్య రాదు. మంచిగా చూసుకుంటాడు. నీకు ఏ కష్టం వచ్చినా మేమూ తోడుగా ఉంటాం. ఎక్కడికీ వెళ్ళి కంప్లయింట్ ఇవ్వకు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

రెండు వారాల తర్వాత లీగల్‌సెల్ సభ్యులు హారికకు ఫోన్ చేస్తే 'మేడమ్ మా వారు నన్ను బాగానే చూసుకుంటున్నాడు. అంతకు ముందులా తాగడంలేదు. కొట్టడం లేదు. పిల్లల్ని కూడా ప్రేమగానే చూసుకుంటున్నాడు. మీతో మాట్లాడిన తర్వాత భయపడ్డాడు. ఇదంతా మీ వల్లే జరిగింది. పోలీసులు చెప్పినా వినని వాడు మీరు ఆయన ఆఫీస్‌కు వెళ్లి మాట్లాడిన తర్వాత చాలా మారిపోయాడు. మీరు నాకు చేసిన ఈ సాయం ఎప్పటికీ మర్చిపోలేను' అని సంతోషంగా చెప్పింది.

- మీనా కుమారి, మేడ్చల్

ప్రజా సేవకు ఐకాన్




మాగీ గే (5 ఆగస్టు, 1923-)

Women of the day

మహిళలు అంటే వంటచేస్తూ.. పిల్లలను కంటూ ఇంటికే పరిమితం కావాలన్న మగవారి ఆలోచనలను తిప్పికొడుతూ గాల్లో చెక్కర్లు కొట్టారు ఆమె. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఇద్దరు చైనా అమెరికన్ పైలట్లలో ఒకరిగా నిలిచారు. పైలెట్‌గా ఆ తర్వాత భౌతిక శాస్త్రవేత్తగా అనునిత్యం ప్రజల కోసం ఆలోచించిన ఆమె తన మరణాంతరం ప్రజాసేవకు ఐకాన్‌గా గుర్తింపబడ్డారు. ఆమే మాగీ జీ.. చైనా అమెరికన్ మాహిళా పైలట్, భౌతిక శాస్త్రవేత్త.

మాగీగే బర్కిలీ, కాలిఫోర్నియాలో జన్మించారు. స్థానిక బర్కిలీ విశ్వవిద్యాలయంలో పట్టభద్రురాలయ్యారు. భౌతికశాస్త్రంలో విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఆ తర్వాత లారెన్స్ లివర్మోర్ నేషనల్ లాబొరేటరీలో పనిచేశారు. వర్క్‌షాపులు, ప్రాజెక్టులు, డాక్యుమెంటరీల ద్వారా ఆమె తన పరిశోధనాంశాలను ప్రపంచానికి తెలియపరిచారు. పైలట్‌గానూ శిక్షణ పొందిన ఇద్దరు చైనా - అమెరికా మహిళా పైలట్లలో ఆమె ఒకరు. రెండవ ప్రపంచ యుద్ధంలో మహిళా ఎయిర్‌ఫోర్స్ సర్వీస్ పైలట్ (WASP) లో పనిచేసిన అమెరికన్ ఏవియేటర్. యుద్ధంలో పాల్గొనాలన్న తన ఆశను మగపైలట్లు నెరవేరనివ్వలేదని ఆమె ఆవేదన చెందారు. 2009 ఆమె జీవిత కథ 'స్కై హై: ది ట్రూ స్టోరీ ఆఫ్ మాగీ గే', మారిస్మాస్ మోస్ రాశారు. అందులో ఆమె గురించిన చాలా విషయాలను ప్రస్తావించారు.

ఆమె అనేక దశాబ్దాలుగా అల్మెడా కౌంటీ డెమోక్రాటిక్ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. వోటర్ రిజిస్ట్రేషన్, నిధుల సేకరణకు మద్దతు ఇచ్చారు. కాలిఫోర్నియా డెమోక్రాటిక్ పార్టీ ఎగ్జిక్యూటివ్ బోర్డ్, ఆసియా పసిఫిక్ ద్వీపవాద డెమోక్రాటిక్ కాకస్ లలో పనిచేశారు.

హ్యాపీ రక్షా బంధన్...



రక్షా బంధన్ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచక. ఈ పండుగ వస్తోందంటే రాఖీల కోసం షాపింగ్‌కు పరుగెడతారు చాలా మంది. అలా కొనకుండా ఇంట్లోనే స్వయంగా మీరే రాఖీని తయారు చేసుకోవచ్చు.

పిల్లలు ఆడుకునే క్లే తో అందమైన రాఖీలను తయారు చేసుకోవచ్చు. దీని కోసం నారింజ, నీలం రంగు క్లే, నీలం రంగు వెల్వేట్ క్లాత్, కత్తెర, గమ్, పసుపు రంగు లైట్‌వెయిట్ దారం ఉంటే సరిపోతుంది. ముందుగా వెల్వేట్ క్లాత్‌ను గీటారు మాదిరి కట్ చేసుకొని దాని మీద నారింజ, నీలం రంగు క్లే ను బొమ్మలో చూపిన విధంగా గమ్ సహాయంతో అతికించుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత లైట్ వెయిట్ దారం మధ్య భాగంలో గమ్‌తో వెల్వేట్ క్లాత్‌ను అతికిస్తే సరిపోతుంది.

దీని కోసం పసుపు రంగు దారం, కత్తెర, గమ్, తెలుసు రంగు చిన్న పూసలు, రంగు రంగుల కాగితాలుంటే సరిపోతుంది. ముందుగా పేపర్లను బొమ్మలో చూపిన విధంగా ఫ్లవర్ మాదిరి కట్ చేసుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత వాటి చివరి భాగంలో పూసలను గమ్‌తో అతికించాలి. ఈ మొత్తం భాగాన్ని దారం మధ్య భాగంలో గమ్ సహాయంతో అతికించుకోవాలి. అంతే చాలా సులభంగా పేపరు రాఖీ రెడీ !

చమ్కీతో అందమైన మెరిసే రాఖీలను తయారు చేసుకోవచ్చు. దీన్ని తయారు చేసుకోవడానికి పసుపు, ఎరుపు, నీలం రంగు చమ్కీలు, గమ్, ఎరుపు రంగు దారం, అట్ట ముక్క, కత్తెర ఉంటే సరిపోతుంది. ముందుగా అట్ట ముక్కను బొమ్మలో చూసిన విధంగా వివిధ ఆకారాల్లో కట్ చేసుకోవాలి. దాని మీద గమ్ పెట్టి నిండుగా చమ్కీ చల్లుకుంటే సరిపోతుంది. ఇలా చేసుకున్న తర్వాత ఒకదాని మీద మరొక మళ్ళీ గమ్‌తో అతికించుకోవాలి. తర్వాత ఎరుపు రంగు దారం మధ్య భాగంలో ముందుగా తయారు చేసుకున్న రాఖీని అతికించుకుంటే సరిపోతుంది.

దీని కోసం పసుపు రంగు దారం, గులాబీ, ఆకుపచ్చ, నారింజ, నీలం రంగు కాగితాలు, గమ్, నీలం రంగు స్టోన్స్ ఉంటే సరిపోతుంది. బొమ్మలో చూపిన మాదిరి పేపర్లను గుండ్రంగా, గట్టిగా మడిచి వాటి చివర గమ్‌తో అతికించుకోవాలి. ఇలా తయారు చేసుకున్న మొత్తం భాగాలను ఫ్లవర్ మాదిరి అమర్చితే సరిపోతుంది. ఆ తర్వాత దారం మధ్య భాగంలో ఫ్లవర్‌ను గమ్‌తో అతికించుకుంటే సరిపోతుంది.

ఇది డిజైనర్ రాఖీ. దీన్ని చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు. డిజైనర్ నీలం రంగు దారం, నలుపు, పసుపు రంగు కాగితాలు, గమ్, కత్తెర ఉంటే సరిపోతుంది. ముందుగా బొమ్మలో చూసిన విధంగా పేపర్లను డిజైన్స్ గా కట్ చేసుకొని గమ్‌తో అతికించుకొని పక్కన పెట్టుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత దారం మధ్య భాగంలో రాఖీని అతికించుకుంటే సరిపోతుంది.

దీని కోసం వెల్వేట్ బాల్స్, గమ్, దారం, చిన్న చన్న కుందన్స్ ఉంటే సరిపోతుంది. ముందుగా దారం మధ్య లోకి కుందన్స్‌ను, వెల్వేట్ బాల్స్‌ను ఎక్కించుకొని వాటి చివర్లను గట్టిగా ముడి వేసుకుంటే సరిపోతుంది. ఇది చూడటానికి అందంగా, సింపుల్‌గా కనిపిస్తుంది.







పర్‌ఫ్యూమ్స్...



పరిమళభరితమైన వాసన సహజంగానే మూడ్‌ను మార్చుతుంది. దాంతో పాటు సానుకూల ఆలోచనలను పుట్టిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో చాలా రకాల పర్‌ఫ్యూమ్స్ లభిస్తున్నాయి. కొన్ని పర్‌ఫ్యూమ్స్ కొద్ది సమయం మాత్రమే వాసనను వెదజల్లి మాయం అవుతాయి. ఆ తర్వాత మళ్లీ వేసుకోవాల్సి వస్తుంది. అలా కాకుండా రోజంతా తాజాదనంతో పరిమళాలను వెదజల్లాలంటే కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- పర్‌ఫ్యూమ్ వేసుకునే ముందు చర్మానికి పెట్రోలియం జెల్లీ పెట్టుకుంటే సరిపోతుంది. పెట్రోలియం జెల్లీ సహజంగా సువాసనను పీల్చుకుంటుంది. దీని కారణంగా పర్‌ఫ్యూమ్ వాసన రోజంతా ఉండిపోతుంది. శరీరంలో ముఖ్య భాగాలైన మెడ, మోచేతులు, మణికట్టు, భుజాల భాగంలో పెట్రోలియం జెల్లీ రాసుకుంటే సరిపోతుంది. ఇలా రాసుకోవడం వల్ల చెమట వాసన రాకుండా ఉంటుంది.
- ఎక్కువ రోజులు పర్‌ఫ్యూమ్‌ను నిల్వ ఉంచుకోకూడదు. ఒకవేళ ఉంచితే తడి లేని చల్లటి ప్రదేశంలో ఉంచాలి. పర్‌ఫ్యూమ్ బాటిల్స్‌ను బాత్ రూమ్, కిటికీలు, మెడిసిన్స్ దగ్గర పెడితే పర్‌ఫ్యూమ్ వాసన తగ్గుతుంది.
- బాడీ లోషన్ కూడా పర్‌ఫ్యూమ్ వాసనను పీల్చుకొని కొన్ని గంటల వరకు సువాసన ఏ మాత్రం తగ్గకుండా తాజాగా ఉంచుతుంది. అలాగే సహజ సిద్ధమైన నూనెలు కూడా ఇదే విధంగా పని చేస్తాయి.
- పొడి చర్మతత్వం ఉన్న వారు లోషన్, పెట్రోలియం జెల్లీ, నూనెలు రాసుకొని పర్‌ఫ్యూమ్ వేసుకుంటే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల తాజాదనంతో పాటు సువాసన కోల్పోకుండా ఉంటుంది. అలాగే స్నానం చేసిన వెంటనే బట్టలు వేసుకొని పర్‌ఫ్యూమ్ వేసుకోవడం వల్ల రోజంతా సువాసన భరితంగా ఉంటారు.
- పర్‌ఫ్యూమ్ వేసుకొని సంగీతం వింటే ఆ భావన చాలా బాగుంటుంది. ప్రతి పరిమళంలోనూ ఎదో ఒక మాధుర్యం దాగి ఉంటుంది. ఉదాహరణకు సిట్రస్ వాసనకు సంబంధించిన పర్‌ఫ్యూమ్ అయితే చాలా ఘటుగా తాజాగా ఉంటుంది. అలాగే ఫ్రూటీ లేదా ఫ్లోర పువ్వులకు చెందిన పర్‌ఫ్యూమ్ అయితే చాలా ఎక్కువ సమయం శరీరాన్ని సువాసన భరితంగా ఉంచుతాయి.

ఆయేషామీరా కేసు పునర్ విచారణకు సిట్



అమరావతి : ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్మశీ విద్యార్థిని ఆయేషామీరా హత్య, అత్యా చారం కేసు పునర్విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేస్తూ శుక్రవారం ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది.డీఐజీ స్థాయి అధికారితో పాటు మహిళా పోలీస్ అధికారులతో కూడిన సిట్‌కు పర్యవేక్షకునిగా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను నియమిస్తూ జీఓ ఎమ్‌నం -132ను ప్రభుత్వం విడుదల చేసింది. 2007 డిసెంబరు 27న కృష్ణాజిల్లా ఇబ్రహీపట్నం వద్ద ప్రైవేటు హాస్టల్లో ఉంటున్న ఆయేషాపై గుర్తు తెలియని దుండగుడు అత్యాచారం చేసి పాశవి కంగా హత్య చేశాడు. మాజీ ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు బంధువులపై ఆరోపణలు రావడంతో ఈ కేసు రాజకీయంగా కీలకంగా మారింది. అప్పుడు విజయవాడ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సివి ఆనంద్ ఈ కేసును 24 గంటల్లో ఛేదిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. నిందితుల్లో కీలక రాజకీయ నేతల బంధువులు ఉండటంతో అప్పటి అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందని టీడీప ఆరోపించింది.

వైసీపీలో నైతిక విలువలు : ఎమ్మెల్యే రోజా

నంద్యాల : వైఎస్ఆర్‌సీపీ నైతిక విలువలున్న పార్టీ అని, ఆ పార్టీ ఎమ్మెల్యే రోజా పేర్కొ న్నారు. శుక్రవారం నంద్యాలలోని శిల్పా మోహన్‌రెడ్డి ఇంటిలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దాదాపు లక్ష మంది సమక్షంలో శిల్పా చక్ర పాణిరెడ్డి నైతిక విలువలతో తన పదవికి రాజీనామా చేశారన్నారు. 21 మంది వైసీపీ ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి సంతలో పశువుల్లా కొన్నారన్నారు. ఆయనకు దమ్మూ ధైర్యముంటే వారితో రాజీనామా చేయించి ఎన్నికల్లో సత్తా చూపాలని సవా ల్ విసిరారు. బోండా ఉమా, ఎస్సీ, ఎస్టీ,బీసీ అని లేకుండా అందరి ఎమ్మెల్యేలను అసెంబ్లీలోనే పాతరేస్తానన్న మాటలు ఏమయ్యాయన్నారు. రాజారెడ్డి హత్యకేసుకు కారణమైన వారికి టీడీపీ ప్రభుత్వం పదవులు ఎలా ఇచ్చిందో గుర్తించుకోవాల న్నారు. నారాయణరెడ్డిని ఉప ముఖ్యమంత్రి కెఇ. కృష్ణమూర్తి దారుణంగా హత్య చేయించిన విషయం ఈ జిల్లా వాసులు మర్చిపోలేదన్నారు. నంద్యాల ప్రజలు వైసీపీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు.

రాజేంద్రసింగ్‌పై దాడి

- యాత్రకు అడుగడుగునా టీడీపీ అడ్డంకులు
- రాజధానిలో వాహనాల ఫ్లెక్సీల చించివేత
- పోలీస్ పహారాతో బృందం పర్యటన



తుళ్లూరు : కృష్ణానది పరివాహక పరిరక్షణ బృందం యాత్ర శుక్రవారం కృష్ణా జిల్లా నుండి గుంటూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ బృందాన్ని టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆ బృందం వాహనాలపై ఉన్న ఫ్లెక్సీలను చింపే శారు. తొలుత తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లోని పలుగ్రామాల్లో బృంద నాయకులు రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్, నేచురల్ సిటీస్ రూపకర్త ప్రొఫెసర్ విక్రమ్‌సోనీ, ఏక్తా పరిషత్ చైర్మన్ రాజగోపాల్, ఆర్థిక సామాజిక పట్టణ పరిశోధన నిపుణులు ప్రొఫెసర్ రామచంద్రయ్య, జలసాధన సమితి అధ్యక్షులు దూచెర్ల సత్యనారాయణ, పర్యావరణ పరిరక్షకుడు గోవిందాచార్యులు పర్యటించారు. ఉండవల్లి ఎత్తిపోతల పథకం నిర్మాణం జరుగుతున్న కృష్ణానది వద్ద పరిరక్షణ యాత్ర బృందం సభ్యులు విలేకరులతో మాట్లాడారు. కృష్ణానది పక్కనే ఈ లిప్టు పనులను ప్రభుత్వం అనవసరంగా ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం ఖర్చు పెడుతున్న రూ.230 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని విమర్శించారు. ఈ క్రమంలో రాజధానికి భూములిచ్చినవారు బృందంతో గొడవకు దిగారు. ఈ సమయంలోనే భూములు ఇవ్వని వారు రావడంతో కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మంగళగిరి సీఐ మధుసూధనరావు, తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కుమార్ అక్కడకు చేరుకుని గొడవ పడుతున్న ఇరు గ్రూపులకు సర్దిచెప్పి పంపించారు. అనంతరం బృందం కురగల్లు మీదుగా సచివాల యం పరిశీలించేందుకు వెళ్ళే ప్రయత్నం చేశారు. కురగల్లు గ్రామం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్ళడానికి వీల్లేదంటూ వాహనాలకు అడ్డుగా నిలిచారు. బృందం సభ్యులపై దాడికి యత్నించారు. తుళ్ళూరు మండలం పెదపరిమి - నీరుకొండ మధ్య పెద్దసంఖ్యలో వచ్చిన టీడీపీ నాయకులు కమిటీ కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. వాహనాలకు ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని బృంద సభ్యులను తుళ్ళూరుకు తీసుకొచ్చారు. స్థానిక సాయిబాబా మందిరంలో బృందం సభ్యులు, టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. తాము రాజధాని నిర్మాణానికి ఇష్టపూర్వకంగా భూములిచ్చామని, ఎవరి బలవంతం లేదని టిడిపి నాయకులు చెప్పారు. రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ మాట్లాడుతూ కృష్ణానదీతీర ప్రాంత పరిరక్షణను విస్మరిస్తే జీవన మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా జరుగు తున్న యాత్రను అడ్డుకోవడం బాధాకరమన్నారు. అనంతరం బృందం సభ్యులు రాయపూడి, లింగాయపాలెంలో పర్యటించాల్సి ఉన్నప్పటికీ పోలీసులు అమరావతి పంపివేశారు.

నియంతృత్వ పోకడలు తగవు :సీపీఐ(ఎం)

టీడీపీ నియంతృత్వ పోకడలను సీపీఐ(ఎం) రాజధాని డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. వివిధ రంగాల్లో నిపుణులుగా ఉన్న బృందసభ్యులు రాజధాని ప్రాంతంలో వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వస్తే వారిని అడ్డుకోవడం సరైనది కాదని సీపీఐ(ఎం) రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ఖండించారు.

వైసీపీ అభ్యర్థి శిల్పా నామినేషన్

- మూడో రోజు ఆరు దాఖలు

నంద్యాల : కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలకు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల పర్వం ప్రారంభమైన మూడో రోజు శుక్రవారం మొత్తం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నిర్ణ యించుకున్న ముహూర్తానికి మొదటి సెట్టు నామినేషన్‌ను దాఖలు చేసిన శిల్పా మోహన్‌రెడ్డి.. రెండోసెట్టు నామినేషన్‌ను స్వయంగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌కు అందజేశారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా తన అనుచరులతో ఆర్‌డీఓ కార్యాలయానికి చేరుకుని పత్రాలు దాఖలు చేశారు. నంద్యాల ఉప ఎన్నికలకు ఇప్పటివరకూ ఆరుగురు అభ్యర్థుల నుంచి 13 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. వైసీపీ అభ్యర్థిగా ఎస్.చంద్రమోహన్‌రెడ్డి మూడు సెట్లు, రవిచంద్ర కిషోర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.

స్థానికుల సహకారం లేకుండా ఎలా నడుపుతారు?

నరసాపురం : పోలీసుల నిర్బంధం నడుమ కాలుష్యం వెదజల్లే మెగా ఆక్వా ఫుడ్ పార్కును జనావాసాల్లో పెడుతున్నారని, ప్రజల సహకారం లేకుండా ఎలా నడుపుతారని సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రశ్నించారు. ఆక్వా ఫుడ్ పార్కు బాధిత గ్రామా లైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం బేతపూడి, జొన్నలగరువు, భీమ వరం మండలం తుందుర్రులో ఆయన శుక్రవారం రాత్రి పర్యటించారు. ఇటీవల ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీలను ఆపిన రోజున ఏం జరిగిందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పరిశ్రమలకు తాము వ్యతి రేకం కాదని, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను జనావాసాల మధ్య పెట్టవద్దనే తా ము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పుతోనే ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. చంద్రబాబు, కేంద్రం కలిసి ఆక్వా మెగా ఫుడ్‌పార్కుకు హామీ ఇచ్చారని, అందువల్లే ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఎంతకాలం నిర్బంధం పెట్టి గ్రామాల్లో పనులు చేపడతా రని, ఒకవేళ పనులైపోయినా ఫ్యాక్టరీలోకి రొయ్యల లారీలు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగ న్మోహన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ,పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తది తర రాష్ట్ర నాయకులంతా దీనిపై స్పందించి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలపా లని కోరారు.

టీఎస్ఆర్టీసీ ఈయూ నుంచి రాఘవరెడ్డి బహిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ జోనల్ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్ రాఘవరెడ్డిని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నుంచి బహిష్కరించినట్టు ఆ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాఘవరెడ్డి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పలుమార్లు హెచ్చరించినా మార్పు లేనందున బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు, సభ్యులు ఎవరూ ఇకపై ఆయనతో సంప్రదింపులు జరపరాదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రతపై నేడు హోంగార్డుల సంఘాల సమావేశం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతు శనివారం ప్రెస్‌క్లబ్‌లో హోంగార్డుల సంఘాల నాయ కులు సమావేశం కానున్నారని అఖిలభారత హోం గార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంకినేని నారా యణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం లోని హోంగార్డులందరిని క్రమబద్ధీకరించి వారికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పే స్కేలు ఇస్తా మని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని తాజాగా కేవలం జీతాల పెంపు గురించే మాట్లాడు తున్నారని అన్నారు. అలాగాక గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

యాజమాన్య కోటా భర్తీ లోపభూయిష్టం

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని అన్ ఎయిడెడ్ నాన్ మైనార్టీ వత్తి విద్యా సంస్థల్లో యాజమాన్య కోటా భర్తీ లోపభూయిష్టంగా ఉందని పేర్కొంటూ హైకోర్టులో రిట్ దాఖలైంది. ఇంజినీరింగ్ బికేటగిరి సీట్లను మేనేజిమెంట్లే భర్తీ చేసుకునే సౌకర్యాన్ని జీవో 13 ద్వారా 2014లో తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని పేర్కొంటూ హైదరాబాద్‌లోని స్ట్రెథనింగ్ ఆఫ్ ప్రైవేట్ ఇన్‌టేటివ్ ఇన్ రూరల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి రిట్ దాఖలు చేశారు. రిట్‌లో ప్రతివాదులుగా తెలంగాణ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి, ఉన్నత విద్య కౌన్సెల్ కార్యదర్శి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్లను చేశారు. యాజమాన్యాలే నేరుగా సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని, ఇందుకు ఎంసెట్ ర్యాంక్‌గానీ, విద్యార్థుల ప్రతిభగానీ వారికి అవసరం లేకుండా డొనేషన్స్ ఇచ్చినవారినే వారికి ఇష్టమైన వారినే ఎంపిక చేస్తున్నారని రిట్‌లో పేర్కొన్నారు. డొనేషన్స్ తీసుకోరాదని సుప్రీంకోర్టుకు తీర్పుకు భిన్నంగా చేస్తున్నారని, జీవోను కొట్టేయాలని రిట్‌లో హైకోర్టును కోరారు.

అవినీతి డీఈఓలపై చర్యలు తీసుకోవాలి


- డీఎస్ఈ ఎదుట డీటీఎఫ్ ధర్నా

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

అవినీతికి పాల్పడుతున్న డీఈఓలపై చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రఘుశంకర్‌రెడ్డి, ఎంఎన్ కిష్టప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఆదిలాబాద్ డీఈఓ లింగయ్య కరీంనగర్‌లో డీఈఓగా విధులు నిర్వహించినప్పుడు అనేక అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. వరంగల్, జనగాం, భూపాలపల్లి తదతర జిల్లాల డీఈఓల అవినీతిపై ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆదేశించినా, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. డీఈఓ లింగయ్యకు ఆర్‌జేడీగా ఉద్యోగోన్నతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య, శంతన్, వెంకట్రాములు, రాష్ట్ర కార్యదర్శులు శామ్యూల్, రాజిరెడ్డి, లింగారెడ్డి, భాస్కర్, ఏసురెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా పాపిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) చైర్మెన్‌గా తుమ్మల పాపిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మరో మూడేండ్లపాటు ఈ పదవిలో నియమిస్తూ విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2014, ఆగస్టు 4న తుమ్మల పాపిరెడ్డి ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా నియమితులయ్యారు. వాస్తవానికి శుక్రవారంతో ఆయన పదవికి గడువు ముగుస్తుంది. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించి పాపిరెడ్డిని గురువారం మళ్లీ నియమించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. 2020, ఆగస్టు 4వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మె న్లుగా ఓయూకు చెందిన ఆర్ లింబాద్రి, హెచ్‌సీయూకు చెందిన వెంకట రమణలను నియమితులయ్యారు. వారి నియామక ఉత్తర్వులు ఆది లేదా సోమవారం వెలువడే అవకాశముంది. కార్యదర్శిగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎన్ శ్రీనివాసరావును మరోసారి అవకాశం కల్పించారు. సోమవారం కొత్త వైస్ చైర్మెన్లు బాధ్యతలు స్వీకరించే అవకాశమున్నట్టు తెలిసింది. మంగళవారం ప్రస్తుతం వైస్ చైర్మెన్లుగా పనిచేస్తున్న కె వెంకటాచలం, ఎస్ మల్లేష్‌లను సన్మానించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

సీఎం వ్యాఖ్యలపై గుస్సా

నిరసనగా దిష్టిబొమ్మ దహనం

- టీ-మాస్ ఫోరం



నిరసన తెలుపుతున్న టీమాస్ ఫోరం నాయకులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు దళితులు, మహిళలు, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులను అవమానపరిచేలా చేసిన వ్యాఖ్యలను టీ-మాస్ ఫోరం ఖండించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య పార్కు వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేసింది. ఈ సందర్భంగా పోలీసులు, టీ-మాస్ ఫోరం నాయకులు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. దిష్టిబొమ్మను దహనం చేయకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. టీ-మాస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు ఈడ్చి వేశారు. దీంతో టీ-మాస్ నేతలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వీరిని అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో నాయకులు శ్రీరాంనాయక్, ఎంబీసీ సంఘం కార్యదర్శి పైళ్ల ఆశయ్య, తెలంగాణ సామాజిక న్యాయవేదిక కన్వీనర్ మన్నారం నాగరాజు, డి గణేశ్‌నాయక్, ప్రజానాట్యమండలి జక్కిడి నర్సింహ్మారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు జావేద్, గోపీ, అశోక్‌రెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా విమలక్క, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో కాకుండా దొర అహంకారంతో దళితులు, మహిళలు, ప్రజా ఉద్యమాలు, వామపక్ష నాయకులను అవమానపరిచేలా మాట్లాడటాన్ని ఖండించారు. సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయని సీఎం, ప్రజాఉద్యమాలు చేసే సంఘాలను, నాయకులను విమర్శించడం సిగ్గుచేటని అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీ-మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ నాయకులు విమలక్క, పైళ్ల ఆశయ్య, కిల్లె గోపాల్, శ్రీరాంనాయక్, నాగరాజు, గణేశ్‌నాయక్, కూరపాటి రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు కోట రమేశ్, నాగేశ్వర్, డివైఎఫ్ఐ నాయకులు విజయ్‌కుమార్, మహిళా నాయకులు ఆశాలత, అరుణజ్యోతి, సీఐటీయూ నాయకులు ఎం. వెంకటేశ్, ఆర్.వాణి, జె.కుమారస్వామి, పీఆర్ఎస్ఎస్ నాయకులు బి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు..మరిచారు

- 'డీఎస్సీ'పై మరోసారి మాట తప్పిన సర్కార్
- టెట్ ఫలితాలతోనే సరిపెట్టిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

"కొంతమంది నిరుద్యోగుల అభ్యర్థన మేరకు టెట్ నిర్వహిస్తున్నాం, టెట్ ఫలితాల రోజే డీఎస్సీ(టీఆర్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేస్తాం. ఆరోజే సిలబస్, విధివిధానాలూ ప్రకటిస్తాం..." టెట్ నోటిఫికేషన్ సందర్భంగా సచివాలయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి మాట్లాడిన మాటలివి... ఇప్పటికే పదుల సంఖ్యలో డీఎస్సీపై మాటిచ్చి తప్పినట్టే, ఆయన మాటలు మరోసారి అమలుకు నోచుకోలేదు. టెట్ ఫలితాలను విడుదల చేసినా, డీఎస్సీ నోటిఫికేషన్ మాత్రం ప్రకటించలేదు. దీంతో నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. తెలంగాణ రాష్ట్రమేర్పడి మూడేండ్లు దాటినా, నేటికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క టీచర్ పోస్టునూ సర్కారు భర్తీ చేయలేదు. రాష్ట్రంలో 8,792 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ఇదే సంఖ్యను సుప్రీంకోర్టుకూ చెప్పింది. పోస్టుల భర్తీ విషయంలో అనేక సార్లు ప్రభుత్వం మాటిచ్చి తప్పింది. వచ్చే దసరాకు డీఎస్సీ, సంక్రాంతికి డీఎస్సీ, పదిరోజుల్లో, 15 రోజుల్లో డీఎస్సీ అంటూ డిప్యూటీసీఎం కడియం శ్రీహరి, మంత్రి జగదీశ్‌రెడ్డి పలుమార్లు ప్రకటనలు చేశారు. వాళ్లే కాదు.. ఈ తూచ్ ప్రకటనలకు సీఎం కేసీఆర్‌కు కూడా అతీతుడేమీ కాదు. వరంగల్ ఉపఎన్నిక సమయంలో రెండు రోజుల్లో డీఎస్సీ వేస్తామని ప్రకటించారు. కానీ ఈ ప్రకటనలేవీ అమలుకు నోచుకోలేవు. ఇటీవల కాలంలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని నిరుద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వంలో కొంత చలనం మొదలైంది. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. గతంలో జులై 25లోపే డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెప్పినా, ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో సెప్టెంబర్ మొదటివారం వరకూ మరోసారి సమయం తీసుకున్నది. ఈకేసును సెప్టెంబర్ 11న న్యాయస్థానం విచారించనుంది.

అభ్యర్థుల్లో ఆందోళన...

ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2012ఆగస్టు 27న డీఎస్సీ అప్పటి ప్రభుత్వం నిర్వహించింది. 2016 జనవరిలో 15,615 టీచర్ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో పదివేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల టీచర్ పోస్టుల ఉన్నాయని అధికారులు చెప్పారు. కానీ ఈపోస్టులను 8,792 పోస్టులకు తగ్గిపోయాయి. నోటిఫికేషన్ ఇవ్వకుండా జాప్యం చేస్తే వాటిలోనూ కోతపెట్టే అవకాశముందని నిరుద్యోగులు వాపోతున్నారు. త్వరలో డీఎస్సీ ప్రకటన అని చెప్పినప్పుడల్లా వేలాది రూపాయలు అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుం టున్నామని చెబుతున్నారు. మరో పక్క ప్రభుత్వం పోటీపరీక్షలకు గతేడాది ఇచ్చిన వయోపరిమితి పెంపు గడువు జులై 25తో పూర్తయింది. దీన్ని మరోసారి పొడిగిస్తారా లేదా అని నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. పొడిగించకపోతే వయోపరిమితి దాటిన చాలా మంది డీఎస్సీకి దూరమయ్యే అవకాశముంది.

జిల్లాల లిస్టే తయారు కాలేదంటా..?

ప్రస్తుతం ప్రకటించిన 8,792 పోస్టులు పది జిల్లాలకు సంబంధించినవి. విద్యాశాఖ ఇప్పటికీ 31 జిల్లాల సమాచారం సేకరించలేదు. దీనికితోడు డీఎస్సీ(టీఆర్‌టీ) గైడ్‌లైన్స్ కూడా ఇంత వరకు తయారు చేయలేదు. అయితే విధివిధానాలు తయారుచేసి టీఎస్‌పీఎస్సీకి ఇస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ చెప్పారు. డీఎస్సీ సెలబస్ మాత్రం టీఎస్‌పీఎస్సీ ఇస్తుందని, విద్యాశాఖకు సంబంధం లేదని ఆయన టెట్ ఫలితాల సందర్భంగా విలేకరులకు తెలిపారు. డీఎస్సీ ఎప్పుడనేది తమకు తెలియదని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అధికారులు చెబుతుతున్నారు. కడియం శ్రీహరి విదేశాలల్లో ఉండటంతో డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడనేదానిపై సస్పెన్స్ నెలకొంది.

కేసీఆర్ కోపం వెనుక..

హిమాన్షు వ్యవహారమేనా?

- నాపై ఆరోపణలు చేస్తుంటే ప్రభుత్వపరంగా ఖండించలేరా
- ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్య ఆగ్రహం !
- ఏదైనా లీగల్‌గా ఇబ్బందులొస్తే ఏం చేస్తారని మండిపాటు

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు రోజుల క్రితం జరిగిన విలేకరుల సమావేశంలో విచక్షణ కోల్పోయి మాట్లాడడానికి హిమాన్షు మోటర్స్ వ్యవహారమేనని తెలిసింది. పోలీసుల వాహనాల కొనుగోలుకు సంబంధించి కేంద్ర మాజీ మంత్రి, ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడు కుమారుడు హర్ష టయోట కంపెనీ నుండి హిమాన్షు మోటర్స్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన పోలీసుల వాహనాల్లో భారీ కుంభకోణం జరిగింది జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత జైరాంరమేశ్ వెంకయ్యనాయుడును నిలదీశారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నుండి స్వర్ణభారత్ ట్రస్టు కంపెనీకి లబ్ధి చేకూరే విధంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. దీనిపై తగిన రీతిలో రాష్ట్రప్రభుత్వం తరపున వివరణ ఇవ్వకపోవడాన్ని వెంకయ్యనాయుడు సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో తూతూమంత్రంగా వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించినట్టు తెలిసింది. ఏదైనా లీగల్ సమస్యలు వస్తే ఏం చేస్తారని కూడా అడిగారని తెలిసింది. ప్రభుత్వపరంగా వాస్తవాలు బయటపెట్టాల్సి ఉండేదని కోరినట్టు సమాచారం. ఎన్‌డిఎ రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు తెలియజేసి, ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో సరిగా స్పందించకపోవడాన్ని కూడా సీరియస్‌గా తీసుకున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే నేరెళ్ల ఘటనతో పాటు పోలీసుల వాహనాల కొనుగోలుపైనా చెప్పేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ విలేకరుల సమావేశం పెట్టారని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అయితే ఇదే సమయానికి విద్యుత్ కాంట్రాక్టు క్రమబద్ధీకరణ కేసుపై కోర్టు తీర్పు వెలువడడంతో సీఎం కేసీఆర్ ఆగ్రహంతో ఊగిపోయారని అంటున్నారు. అయితే వాహనాల కొనుగోలు వ్యవహారంలో జరుగుతున్న తతంగాన్ని చూసి కేసీఆర్ తట్టుకోలేకపోతున్నారని సమాచారం.

ఈ ఏడాది 70 కోట్ల చేప పిల్లల విత్తనాలు పంపిణీ : తలసాని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది 70 కోట్ల చేప పిల్లల విత్తనాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు మత్స, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మెన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌చందా, మత్స్య శాఖ కమిషనర్ సువర్ణ, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గత ఏడాది 27కోట్ల చేప పిల్లల విత్తనాలు పంపిణీ చేశామని చెప్పారు. ఈ ఏడాది77రిజర్వాయర్లు, 19,465 గ్రామ పంచాయతీ చెరువులు, 4,467 ప్రభుత్వ చెరువుల్లో సుమారు 70కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

రుణమాఫీ పథకం పరిశీలనకు పంజాబ్ బృందం

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం అమలు తీరుతెన్నులు పరిశీలించేందుకు పంజాబ్ నుంచి అధికారుల బృందం వచ్చింది. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సీ. పార్థసారధితో శుక్రవారం ఈ బృందం భేటీ అయింది. ఈ భేటీలో పంజాబ్ రాష్ట్ర వ్యవసాయ సహకార విభాగపు అదనపు ముఖ్య కార్యదర్శి డిపి రెడ్డి, పంజాబ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ బల్విందర్‌సింగ్ సిద్దుజీ, సహకార బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌కె బతీష్, ఆర్థిక శాస్త్రవేత్త (హెడ్), పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ సుక్‌పాల్ సింగ్ ఉన్నారు.

సింగరేణిలో ఉధృతంగా హరితహారం

- 50.7 లక్షల మొక్కలను నాటాం: సీఎండీ ఎన్ శ్రీధర్

హైదరాబాద్: సింగరేణి సంస్థ కోల్‌బెల్ట్ వ్యాప్తంగా మూడో విడత హరితహారం కార్యక్రమం ఉధృతంగా సాగుతున్నట్టు సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 50 లక్షల మొక్కల మైలురాయిని దాటినట్టు ఆయన వెల్లడించారు. జులై 12 నుంచి ఇప్పటివరకు ఉచితంగా పంపిణీ చేసిన వాటితో కలిపి 50,79,214 మొక్కలను నాటినట్టు వివరించారు. కోటి మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. నాటిన మొక్కల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్ని ఏరియాల మేనేజర్లను శ్రీధర్ ఆదేశించారు.

సమాన పనికి సమాన వేతనంపై హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు సమాన పనికి సమాన వేతనం ఇస్తామని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడాన్ని తెలంగాణ అదనపు కార్యక్రమ అధికారుల సంఘం(టీఏపీవో) స్వాగతించింది. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్ర నారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్స్ ఉద్యోగులకు సైతం వేతనాలు ఇవ్వడానికి అన్ని రాష్ట్రాల కంటే ముందే అంగీకరించినందుకు దన్యవాదాలు తెలి యజేస్తున్నట్టు చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఉపాధి హామీ చట్టం కింద 11 ఏండ్లుగా పనిచేస్తున్న 16 వేల మంది ఎఫ్ఏ, టీఏ, ఈసీ, సీవో, ఏపీవో, ఏపీడీ, పీవో తదితరులు పనిచేస్తున్నారని వివరించారు. వీరంతా గ్రామాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని శాఖల మాదిరిగానే మాకు క్రమబద్ధీకరణ వర్తింపజేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్‌కు డబ్బు పిచ్చి: వీహెచ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం చంద్రశేఖర్‌రావుకు డబ్బు పిచ్చి పట్టిందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. అవసరం లేకున్నా బైసన్ పోలో గ్రౌండ్ కోసం ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన కొత్త సచివాలయం కట్టాలని చిన్నజీయార్ స్వామి చెప్పడం వల్లే ఈ పనికి ఒడికట్టారని మండిపడ్డారు. కేసీఆర్ సచివాలయానికి వచ్చే ఉద్దేశం లేనప్పుడు కొత్త సెక్రటేరియేట్ ఎందుకో అర్థంకావడం లేదన్నారు. స్వామీజీలను కలవడానికి సీఎంకు సమయం ఉంటుందికానీ రైతులను కలిసేందుకు తీరిక ఉండదా అని ప్రశ్నించారు. నేరేళ్ల ఘటనలో దళితులపై కేసులు పెట్టడం కాదు ముఖ్యమంత్రి, ఆయన కుమారుడిపై కేసులు పెట్టాలని విహెచ్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు డబ్బుపిచ్చి పట్టిందని, ఛలాన్ల పేరుతో పేదల రక్తం పీల్చుతున్నారని మండిపడ్డారు. ప్రతి నెల ఇంత కలెక్షన్ రావాలని ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌కు షరతు పెట్టడం వల్లే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఏ ఊరికి వెళితే నేను ఆ ఊరికి వెళ్లి ప్రజలకు వాస్తవాలు చెబుతానని సవాల్ విసిరారు. దళితులపై జరిగిన దాడి గురించి కాంగ్రెస్ ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని పీసీసీ అధికార ప్రతినిధి ప్యాట రమేష్ అన్నారు. మిడ్‌మానేరులో ఇసుక అక్రమాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన ఇసుకను తోడేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా అత్యున్నత పదవిలో ఉన్న కేసీఆర్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై నిరసన

- ముక్తకంఠంతో ఖండించిన ప్రతిపక్షాలు



నవతెలంగాణ-యంత్రాంగం

గాడితప్పుతున్న ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన ప్రతిపక్షాలపై నోరుపారేసుకోవడం సీఎం కేసీఆర్‌కు తగదని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రతిపక్షాలు, ముఖ్యంగా వామపక్షాలను ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడిన తీరును నిరసిస్తూ శుక్రవారం పలుచోట్ల ఆందోళన నిర్వహించారు. సీఎం అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో టీ-మాస్ ఫోరం ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాస్‌రావు మాట్లాడారు. సీఎం హోదాలో ఉన్న కేసీఆర్ నలుగురికి మంచీచెడు చెప్పాల్సి ఉండగా ఆయనే హోదా తగ్గించుకుని వామపక్షాలు, ఇతర పార్టీలను, పత్రికపై అనుచితంగా మాట్లాడటం తగదని అన్నారు. కొన్ని చోట్ల విలేకరులపై దాడులు జరగడం హేయమైన చర్య అని అభివర్ణించారు. పత్రికారంగం ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, అటువంటి వాటిపై అనుచిత వ్యాఖ్యలు, విలేకరుల దాడులు ప్రభుత్వానికి తగిన పని కాదని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ముదిగొండలో టీ-మాస్ ఫోరం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నల్లగొండ, సూర్యాపేట, దేవరకొండలో టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో టీమాస్ ఫోరం మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వామపక్షాలు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశాయి. టీమాస్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. హుజూరాబాద్ పట్టణంలో దళిత, ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని మెత్కులగూడెం చౌరస్తాలో టీమాస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మెదక్ ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సిద్దిపేటలో మోకాళ్లపై నిల్చుని, కండ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసనలు తెలిపారు.

రష్యా సాయంతో గెలవలేదు

ప్రజల మద్దతుతోనే అధికార పగ్గాలు : ట్రంప్

- హిల్లరీని జైలుకు పంపాలని వర్జీనియాలో రిపబ్లికన్ పార్టీ కార్యకర్తల డిమాండ్



వాషింగ్టన్ : అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందేందుకు తానేమీ రష్యా సహకారం తీసుకోలేదని, ప్రజల మద్దతుతోనే దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉద్ఘాటించారు. ఉద్యోగాల కల్పన కోసం రైజ్ యాక్ట్‌ను (రీఫార్మింగ్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయిమెంట్) అమల్లోకి తెచ్చామని అన్నారు. వర్జీనియాలో రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు తీసిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. అవినీతి నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అవినీతిపరులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని అన్నారు. ట్రంప్ నోట ఈమాట వెలువడగానే రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు కరతాల ధ్వనులు మోగించారు. డెమోక్రటిక్ పార్టీ నేత హిల్లరీ క్లింటన్‌ను జైలుకు పంపాలని బిగ్గరగా నినాదాలు చేశారు. ట్రంప్‌నకు అనుకూలంగా ప్లకార్డులు ప్రదర్శించారు. అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందితే అమెరికాను ఉన్నత శిఖరాలకు చేరుస్తానని ఇచ్చిన హామీని ట్రంప్ నిలబెట్టుకుంటారని తాము ఆకాంక్షిస్తున్నామని అన్నారు. గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి సంబంధించిన ఈమెయిల్స్, కీలక దస్త్రాలను వికీలీక్స్ సంస్థ బహిర్గతం చేసింది. వాటిపై విచారణ జరిపించి హిల్లరీని జైలుకు పంపాలని ట్రంప్ మద్దతుదారులు డిమాండ్ చేశారు.

విచారణ బాధ్యతలు గ్రాండ్ జ్యూరీకి అప్పగింత

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసు కుందనే ఆరోపణలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్..రిపబ్లికన్ పార్టీ నేత ట్రంప్‌నకు సహకరించినట్టు హిల్లరీ బృందం ఆరోపిస్తోంది. దీనిపై విచారణ చేపట్టి హిల్లరీని జైలుకు పంపాలని ట్రంప్ మద్దతుదారులు గత కొన్ని నెలలుగా డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో వైట్‌హౌస్ స్పందించింది. ఈ కేసు విచారణ బాధ్యతలను గ్రాండ్ జ్యూరీకి అప్పగించనున్నట్టు తెలిపింది. ప్రజల వద్ద నుంచి రహస్య సమాచారాన్ని గ్రాండ్ జ్యూరీ సేకరిస్తుంది. గ్రాండ్ జ్యూరీకి రాబర్ట్ ముల్లర్ నేతృత్వం వహించనున్నట్టు సమాచారం.

నెతన్యాహుపై అవినీతి ఆరోపణలు

జెరూసలేం: ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూపై వెలుగు చూసిన అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని ఇజ్రాయిలీ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ కేసు దర్యాప్తుపై మీడియా కవరేజ్‌ను నియంత్రించాలని, నెతన్యాహు పేరును బయటకు పొక్కనీయరాదని కోర్టు తన ఆదేశాలలో పేర్కొం ది. ఈ కేసులో నిందితుడిగా వున్న మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ యారీ హారో ప్రభుత్వ సాక్షిగా మారితే ప్రధాని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుందని న్యాయని పుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా వుం డగా తానెటువంటి తప్పూ చేయలేదని నెతన్యాహు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అధికార మార్పిడి లక్ష్యం తో కొనసాగుతున్న ఈ క్షుద్రవేట ఇప్పుడు పతాకస్థాయికి చేరిందని నెతన్యాహు ప్రతినిధి విమర్శిం చారు. అంతిమంగా ఈ కుట్ర విఫల మవటం ఖాయమని, ఎటువంటి తప్పూ లేని కేసులో దర్యాప్తు చేపట్టితే ఒరిగేదేమీ వుండదని ఆయన వ్యాఖ్యానించారు. నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులకు కొందరు వ్యాపార వేత్తలు ఇచ్చిన బహుమతులపై ఒక కేసులో పోలీసులు ఆరాతీయగా మరో కేసులో ఇజ్రాయిలీ ప్రచురణకర్తతో జరిగిన సంభాషణలపై నెతన్యాహును పోలీసులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేస్తా : పుతిన్



మాస్కో : వచ్చే ఏడాది జరగనున్న రష్యా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీచేయనున్నట్టు ఆ దేశాధ్యక్షుడు పుతిన్ తెలిపారు. సైబీరియా తూర్పు ప్రాంతంలో సందర్శించిన పుతిన్ ఆ గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని గ్రామస్తులు పుతిన్‌ను కోరారు.

వారి అభ్యర్థనలపై పుతిన్ స్పందించారు. ' అవును.. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీచేస్తాను' అని చిరునవ్వు చిందించారు. కాగా, వచ్చే ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ పోటీ చేయాలని రష్యన్లు కోరుతున్నారు. ఈ విషయంపై పుతిన్ తాజాగా స్పష్టతనిచ్చారు. లెవాడాలోని ఇండిపెండెంట్ రష్యన్ సోషియాలజికల్ సెంటర్ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం...66 శాతం మంది రష్యన్లు తమ తదుపరి అధ్యక్షుడిగా కూడా పుతిన్ కొనసాగాలని కోరుకుంటున్నారు.

బ్రిటన్ సరిహద్దులో భద్రతా ప్రమాణాలు డొల్ల

లండన్ : బ్రిటన్ సరిహద్దులో భద్రతా ప్రమాణాల డొల్లతనం మరోసారి బహిర్గతమైంది. దేశ సరిహద్దు ద్వారా ప్రవేశిస్తున్న శరణార్థుల్లో అర్హులను గుర్తించలేకపోతున్నట్టు పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది తెలిపారు. తాజాగా, బ్రిటన్ సరిహద్దుల్లో అభద్రతాభావం అధికంగా ఉన్నదని బార్డర్స్ జనరల్ సెక్రటరీ లూస్ మోర్టిన్ తెలిపారు. భద్రతా సిబ్బంది కొరత కారణంగా తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోతునానమని అన్నారు. పని ఒత్తిడి కారణంగా గతేడాది 7,900 మంది ఉద్యోగులు తమ పదవులకు రాజీనామా చేశారన్నారు. బ్రెగ్జిట్ (ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగడం) తర్వాత బ్రిటన్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తున్న శరణార్థులను కట్టడిచేయలేకపోతున్నామని మోర్టిన్ తెలిపారు.

వెంటనే10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

గిరిజన సంఘాల డిమాండ్

- ఎస్టీ రిజర్వేషన్ సాధన జేఏసీ ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం గిరిజనులకు వెంటనే 10 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. రిజర్వేషన్‌ల సాధన కోసం గిరిజన జేఏసీకి తోడుగా ఎస్టీ రిజర్వేషన్ సాధన జేఏసీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాయి.

గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే ఎగ్జిక్యూటీవ్ ఆర్డర్ ద్వారా జీవో విడుదల చేసి రిజర్వేషన్‌లను అమలు చేయాలని కోరాయి. రిజర్వేషన్ల పెంపులో జాప్యం జరిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించాయి. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం ధర్మానాయక్ అధ్యక్షతన గిరిజన రిజర్వేషన్‌ల పెంపు పై చర్చా వేదిక జరిగింది. ఈ వేదికలో సీపీఐ (ఎం) నుంచి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల మల్లేశ్, కాంగ్రెస్ గిరిజన సెల్ నాయకులు ఆర్ జగన్‌లాల్, టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు బాబురావు నాయక్, గిరిజన ఐక్యవేదిక నాయకులు వి వివేక్ నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్, టీఎస్ఎఫ్ నాయకులు ఎం శోభన్ నాయక్ టీజీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ గిరిజన జాబితాలో ఇతర కులాలను కలపడం, తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. గిరిజన రిజర్వేషన్ల పెంపును పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం గిరిజన జాబితాలో ఇతర కులాలను కలిపిందని విమర్శించారు. గిరిజన రిజర్వేషన్‌లను రాజకీయ దృష్టితో కాకుండా రాజ్యాంగ సూత్రాలకు లోబడి శాస్త్రీయ బద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాల మల్లేశ్ మాట్లాడుతూ వాల్మీకి బోయ, ఖాయితీ లంబాణ్, మాలీ కులాలకు గిరిజనులకు మధ్య తగవు పెట్టేందుకే ఈ కులాలను గిరిజన జాబితాలో చేర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కులాలపై చిత్తశుద్ధి ఉంటే వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జగన్‌లాల్ మాట్లాడుతూ బీసీ కులాలకు గిరిజన లక్షణాలు లేవన్నారు. ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చాలంటే ఆయా కులాలకు ఐదు లక్షణాలు ఉండాలని, కాని ఈ కులాలకు ఏ ఒక్క లక్షణమూ లేదన్నారు. బాబురావు నాయక్ మాట్లాడుతూ గిరిజన రిజర్వేషన్ల పెంపుకు కేంద్రం ఆమోదం లేదని, రాష్ట్రంలో ఉన్న గిరిజన జనాభా ఆధారంగా ఎగ్జిక్యూటీవ్ ఆర్డర్‌తో రిజర్వేషన్‌లను పెంచొచ్చన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి గిరిజన రిజర్వేషన్ల పెంపును ఆమోదింప చేయాలని కోరారు. ఎం ధర్మానాయక్ మాట్లాడుతూ 10 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం జీవో జారీ చేయాలన్నారు. ఇతర కులాలను గిరిజన రిజర్వేషన్‌లో కలుపుతూ ఒకే బిల్లుగా కేంద్రానికి పంపించిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక బిల్లును కేంద్రానికి పంపి రిజర్వేషన్లను అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా గిరిజన ఉద్యోగ పదోన్నతుల్లో రిజర్వేషన్లను కోల్పోయిన వారికి తిరిగి ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

రష్యా అల్రోసా వజ్రాల గనిలో ప్రమాదం : 16 మంది కార్మికులు గల్లంతు

మాస్కో : రష్యాలోని అల్రోసా వజ్రాల గనిలో ప్రమాదం చోటు చేసుకున్నది. పంపింగ్ కేంద్రం లోకి నీరు వచ్చి చేర డంతో16 మంది కార్మికులు గల్లంతయ్యారు. దీంతో, అప్రమత్తమైన యాజమాన్యం 130 మంది కార్మికులను సురక్షిత ప్రాంతానికి తరలించింది. గల్లంతైన వారికోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయని గని నిర్వాహకులు సెర్గే ఐవానోవ్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియ రాలేదన్నారు.

ఎంబీసీలకు.. విద్య, న్యాయ, పరిపాలన శాఖల్లో రిజర్వేషన్‌లు కల్పించాలి

- బీసీ కమిషన్‌కు ఎంబీసీ సంఘాల విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

విద్య, న్యాయ, పరిపాలనా శాఖల్లో రిజర్వేషన్‌లు కల్పించాలని ఎంబీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. కుల సంఘాల పెద్దలు, కులాల వారీగా జనాభా లెక్కలు తీసి వారి సామాజిక, విద్యా పరమైన స్థితిగతులను, జీవన ప్రమాణాలను రాజకీయంగా పరిశీలించి నివేదిక అందజేయాలని కోరింది. శుక్రవారం జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాలప్పతో 40 కులాలకు చెందిన నాయకులు బీసీ కమిషన్ ఛైర్మెన్ బీఎస్ రాములును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కాలప్ప మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలను మూడు వర్గాలుగా విభజించి ఓబీసీ, ఎంబీసీ డీనోటిఫైడ్ కులాలుగా గుర్తించాలన్నారు. ఎంబీసీ కులాల విద్యార్థులకు కేజీ టు పీజీ ఉచిత విద్యను అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేటు, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో కూడా రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టును ఎంబీసీలకు కూడా వర్తింపచేయాలన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణ

- బీసీ సంక్షేమ శాఖ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన సివిల్స్ పరీక్షలో ప్రవేశం కోసం బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల అభ్యర్థులు కోసం బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్లో దరఖాస్తు ఫారం, నోటిఫికేషన్‌ను పొందుపర్చింది. అభ్యర్థులు 28 లోగా రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొంది. ఉచిత శిక్షణకు సంబంధించి సెప్టెంబర్ 9న ఆన్‌లైన్ ద్వారా రాత పరీక్ష నిర్వహించనుంది.

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదు. రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది.

కాంగ్రెస్‌లో బీసీల పోరు బాట!


50 సీట్లకు పట్టు

- నేడు రాహుల్‌గాంధీతో నేతల భేటీ
- 36 సీట్లిస్తే ఒక్కటీ గెలవలేదంటున్న మరో గ్రూప్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో ఒకవైపు అసమ్మతి మంట మండుతూనే ఉన్నది. మరోవైపు బీసీ నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం పోరుబాట పట్టారు. బలమైన సామాజికవర్గం తమను అణగదొక్కుతున్నదని బీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార టీఆర్ఎస్ బీసీలకు తాయిలాలు ప్రకటిస్తూ వారిని తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తుంటే... కాంగ్రెస్‌లోని బీసీలను మాత్రం పార్టీనే నిర్లక్ష్యం చేస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ వద్ద ప్రస్తావించేందుకు పార్టీ సీనియర్ నేత టి నాగయ్య నేతృత్వంలో 30 మంది బీసీ నేతలు ఢిల్లీకి శుక్రవారం వెళ్లారు. శనివారం ఉదయం రాహుల్‌గాంధీతో వారు భేటీ కానున్నారు. పార్టీలో తమకు జరుగుతున్న అన్యాయం, తమకు పార్టీలో కీలకమైన పోస్టులివ్వాలని ఈ సందర్భంగా కోరనున్నారు. తెలిసింది. రాష్ట్రంలో మొత్తం 119 ఎమ్మెల్యే సీట్లు ఉంటే జనాభా ప్రకారం తమకు 50 శాతం సీట్లు ఇవ్వాలని అడగాలని నిర్ణయం తీసుకున్నారు. లేకుంటే ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించుకుంటామని చెప్పేందుకు ఢిల్లీ వెళ్లనున్నట్టు బీసీ నేత ఒకరు చెప్పారు. ఈ అంశంపై తాము అధిష్టానంతో అమీతుమీకి సిద్ధమవుతామని కూడా వారు అంటున్నారు. రాష్ట్ర నాయకత్వం కూడా తమను హేళన చేసి మాట్లాడుతున్నట్టు చెబుతున్నారు. గత ఎన్నికల్లో బీసీలకు 36 సీట్లు కేటాయిస్తే ఒక్కటైనా గెలిచారా? ఇప్పుడేం గెలుస్తారు.

వారి వద్ద అంత డబ్బు ఉందా? అంటూ ముఖ్యమైన నేత తన అనుయాయుల వద్ద అవహేళన చేసి మాట్లాడినట్టు చెబుతున్నారు. గత ఎన్నికల్లో పార్టీకి బలంలేని నాంపల్లి, చార్మినార్ వంటి సీట్లు కేటాయించి గెలవలేదని చెప్పడం సరికాదన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని బీసీ నేత క్యామ మల్లేష్‌కు కేటాయించి, అక్కడ మల్‌రెడ్డి బ్రదర్స్‌ను ప్రోత్సహించి రెబల్‌గా పోటీ చేయిం చారు. ఆయన ఓటమికి పార్టీయే కారణమైందన్న విమర్శలు ఉన్నాయి. భువనగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థి పోతంశెట్టి వెంకటేశ్వర్లు ఉండగా...ఈసారి బెంగళూరుకు చెందిన స్థిరాస్తి వ్యాపారి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని పోటీ చేయించాలని పీసీసీ భావిస్తున్నది. కల్వకుర్తి నియోజవర్గం నుంచి ఎన్టీఆర్‌ని ఓడించి సంచలనం సృష్టించిన చిత్తరంజన్‌దాస్‌కు ప్రస్తుతం కనీసం నామినేషన్ పదవి కూడా ఇవ్వకుండా ఇవ్వలేదు.



కొన్ని నియోజకవర్గాల్లో బీసీలు కీలకంగా ఉన్నప్పటికి రాష్ట్ర నాయకత్వం తమ వర్గీయులను ప్రోత్సహి స్తున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. బీసీ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య పార్టీ అధ్యక్ష పదవిని 11 నెలలకే ఆయనను తప్పించారు. ఈ వ్యవహారం వెనక బలమైన సామాజిక వర్గం కీలకపాత్ర పోషించినట్టు ఇప్పటికీ గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని రాహుల్‌గాంధీకి వివరించడంతో పాటు తమకు న్యాయం జరగక్కపోతే వేరు కుంపటికి కూడా వెనకాడబోమని అంటున్నారు.

నవచిత్రం



'జయ జానకి నాయక' చిత్రంలో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్

జయ జానకి నాయక ఆడియో అదుర్స్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యాజైశ్వాల్ హీరోహీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జయజానకి నాయక'. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు ఇటీవల విడుదలయ్యాయి. రిలీజైన ఆడియోకు శ్రోతల నుంచి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, 'దేవిశ్రీ ప్రసాద్ అందించిన ట్యూన్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. ఇటీవల విడుదలైన పాటలు శ్రోతలను విశేషంగా అలరిస్తున్నాయి. బోయపాటి శ్రీను మార్క్ టేకింగ్‌తో రూపొందిన చిత్రమిది. ఆయన గత చిత్రాలను మించే స్థాయిలో ఈ సినిమా ఉంటుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటన, యాక్షన్ ఎపిసోడ్స్, రకుల్ ప్రీత్ సింగ్ గ్లామర్ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'లైఫ్‌లో కష్టం వచ్చిన ప్రతిసారి ప్రేమను వదిలేస్తాం. కానీ నేను ప్రేమించాను కాబట్టి ప్రేమను వదలను అనే ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. తల్లిదండ్రులు బాగుండాలని కోరుకున్నట్టుగానే ప్రేమించిన అమ్మాయి కూడా బాగుండాలని తపించే పాత్ర హీరోది. నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి సినిమాను రాజీపడకుండా నిర్మించారు. ఇది తెలుగు ప్రేక్షకుల హృదయాలను తాకే చిత్రమవుతుంది' అని దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ చెబుతూ, 'నా కెరీర్‌ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. బోయపాటి వంటి మాస్ డైరెక్టర్‌తో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో మాస్ ఆడియెన్స్‌నే కాదు ఫ్యామిలీ, యూత్‌ను సైతం ఆకట్టుకునే అంశాలున్నాయి' అని చెప్పారు.


సమాన పనికి సమాన వేతనం..



స్వర భాస్కర్

'సమానత్వంపై హాలీవుడ్‌లో మహిళలు పోరాడుతారు. అలాంటి పోరాటం మన దగ్గర ఎందుకు చేయరు' అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ నటి స్వరభాస్కర్. 'ప్రేమ్ రతన్ ధన్ పాయో', 'రాంఝానా' చిత్రాలతో బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా 'సమాన పని సమాన వేతనం' విషయంపై ఓ ఇంటర్వ్యూలో స్వర భాస్కర్ మాట్లాడుతూ, 'ఒక కథానాయికగా పది రోజులు పనిచేసి వంద రోజులు పనిచేసిన నటుడు పొందిన వేతనాన్ని ఇవ్వాలని నేను అనట్లేదు. ఒకవేళ నేను కథానాయకుడితో సమానంగా వంద రోజులు పనిచేస్తే కచ్చితంగా సమాన వేతనాన్నే ఆశిస్తాను. కథానాయికలు ఈ విషయంపై ముందుకొస్తే మరింత మార్పు వస్తుంది. ఎవరూ మన కోసం ప్రత్యేకంగా ఏదీ చేయరు. మనకు ఏం కావాలో మనమే సాధించుకోవాలి. హాలీవుడ్‌లో గమనిస్తే అక్కడి మహిళలు సమానత్వంపై పోరాడతారు. అది గొప్ప విషయం. మన బాలీవుడ్‌లో ఇలా ఎందుకు చేయకూడదు?. ఈ విషయంలో హాలీవుడ్ నుంచి మనం స్ఫూర్తి పొందవచ్చు. ప్రజలు పోరాడనంత వరకు ఏ ఉద్యమం కూడా ఊపందుకోదు. నల్లజాతీయులకు 1950ల మధ్య వరకు పౌరహక్కుల్ని ఇవ్వలేదు. చాలా ఏండ్లపాటు వారు ఇబ్బందులు పడ్డారు. దళితుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఇలాంటి వివక్షే సినిమా రంగంలో ఉన్న మహిళలపై కొనసాగుతోంది' అని తెలిపారు. ప్రస్తుతం 'వీరే ది వెడ్డింగ్' చిత్రంలో స్వర భాస్కర్ నటిస్తున్నారు.


ట్రాజెడీ కింగ్‌కు తీవ్ర అస్వస్థత



దిలీప్ కుమార్

బాలీవుడ్ దిగ్గజ నటుడు దిలీప్ మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన్ని బుధవారం ముంబయిలోని లీలావతి ఆస్పత్రిలో చేర్పించారు. తొలుత ఐసీయులో ఉంచి చికిత్స అందించారు. గురువారం దిలీప్ కుమార్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆయన భార్య సైరాబాను తెలిపారు. అయితే రెండు కిడ్నీలు చెడిపోవడంతో శుక్రవారం మళ్ళీ ఐసీయుకి తరలించినట్టు బాలీవుడ్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్టు, ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని దిలీప్ కుమార్‌కు వైద్యం అందిస్తున్న డా॥జలీల్ పార్కర్ తెలిపినట్టు సమాచారం. బాలీవుడ్‌లో ట్రాజెడీ కింగ్‌గా, మెథడ్ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్న దిలీప్ కుమార్ ఆరు దశాబ్దాల సినీ జీవితంలో 65 చిత్రాల్లో నటించారు. 'అందాజ్', 'బాబుల్', 'దీదార్', 'ఆన్', 'దేవ్‌దాస్', 'అజాద్', 'నయా దౌర్', 'యహుది', 'మధుమతి', 'కోహినూర్', 'మొఘల్ ఎ అజమ్', 'గంగా జమున', 'రామ్ ఔర్ శ్యామ్' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించారు.

దక్షిణాది పరిశ్రమలను చూసి నేర్చుకోవాలి




అక్షయ్‌కుమార్

దక్షిణాది చిత్ర పరిశ్రమలను చూసి బాలీవుడ్ ఎంతో నేర్చుకోవాలని ఓ పక్క చురకలంటిస్తూనే మరో పక్క సౌత్ సినిమాలపై బాలీవుడ్ యాక్షన్ కథానాయకుడు అక్షయ్‌కుమార్ (అక్కీ) ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా నటిస్తున్న 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో అక్కీ మాట్లాడుతూ, 'బాలీవుడ్‌లో ఈ ఏడాది చాలా సినిమాలు పరాజయం చెందాయి. దీనికి కారణం కంటెంట్ గురించి పట్టించుకోకపోవడమే. దక్షిణాదిలో ఎంతో పద్ధతిగా ఉంటారు. బడ్జెట్ విషయంలో చాలా క్లారిటీగా ఉంటారు. పబ్లిసిటీకి కూడా పెద్దగా ఖర్చు పెట్టరు. ముఖ్యంగా మంచి కథలు రాసుకుంటారు. ఎక్కడైనా మంచి సినిమానే ఆడుతుంది. ఈ విషయంలో సౌత్ నుంచి మనం చాలా నేర్చుకోవాలి' అని అన్నారు. ఇక 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' విడుదల సందర్భంగా అక్కీ సతీమణి ట్వింకిల్ ఖన్నా తన పెళ్ళినాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. 'మాకు పెళ్లైన కొత్తలో మా వారికి ఒక్కటే చెప్పా. డార్లింగ్ నా హృదయాన్ని, జీవితాన్ని, ఆఖరికి నేను తినే తిండి నీతో పంచుకోగలను. కానీ నా టాయిలెట్‌ను మాత్రం పంచుకోలేనని చెప్పా' అని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నారు. ఈ నెల 11న 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' చిత్రం రిలీజ్ కానుంది.



సమంత


ఉన్నది ఒకటే జిందగీ..



రామ్

'నేను శైలజ' వంటి హిట్ చిత్రాన్ని అందించిన కిశోర్ తిరుమల దర్శకత్వంలోనే కథానాయకుడు రామ్ మరో సినిమాలో నటిస్తున్న విషయం విదితమే. ఈ చిత్రానికి 'ఉన్నది ఒకటే జిందగీ' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు రామ్ ట్వీట్ ద్వారా శుక్రవారం ప్రకటించారు. నేడు (శనివారం) ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేస్తున్నట్టు ఆయన ట్వీట్‌లో అభిమానులతో షేర్ చేసుకున్నారు. ఈ చిత్రాన్ని స్రవంతి రవికిశోర్ నిర్మిస్తున్నారు. డిఫరెంట్ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రంలో రామ్ సరసన ఇద్దరు కథానాయికలు నటిస్తున్నారు. మొదట ఇద్దరు కథానాయికలుగా అనుపమ పరమేశ్వరన్, మేఘా ఆకాష్‌లను ఎంపిక చేశారు. కానీ కొన్ని కారణాల వల్ల మేఘా ఆకాష్ ఈ చిత్రం నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో లావణ్య త్రిపాఠిని ఫైనలైజ్ చేశారు. వీరిపై త్వరలోనే ఊటీలో చిత్రీకరణ జరుగనుంది.

నా సినిమాను ఎప్పుడు చూస్తారు..?



అమీర్‌ఖాన్, షారూఖ్ ఖాన్

ట్విట్టర్ వేదికగా ఇద్దరు బాలీవుడ్ స్టార్స్ అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అంతేకాదు కాసేపు సరదాగా ట్వీట్ చేసుకున్నారు. శుక్రవారం షారూఖ్ ఖాన్ నటించిన 'జబ్ హ్యారీ మెట్ సెజల్' చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా ఈ చిత్రం విజయం సాధించాలని కోరుతూ మొదట అమీర్ ఖాన్ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన షారూఖ్ 'ధన్యవాదాలు. మీరు నిర్మిస్తున్న నూతన చిత్రం 'సీక్రెట్ సూపర్ స్టార్' ట్రైలర్ కూడా అద్భుతంగా ఉంది. మరి మీరు నా సినిమాను ఎప్పుడు చూడబోతున్నారో చెప్పండి' అని రీట్వీట్ చేశారు. దీంతో ఈ ఇద్దరి సూపర్‌స్టార్స్ ట్వీట్ సందడిని చూసి ఇరు హీరోలను ఫాలో అవుతున్న అభిమానులు ఖుషి అవుతున్నారు. ఇదిలా ఉంటే, బాలీవుడ్‌లో నెపోటిజం(బంధుప్రీతి) అనే పదం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో దానికసలు అర్థమే నాకు తెలియదు అంటున్నారు షారూఖ్. 'జబ్ హ్యారీ మెట్ సెజల్' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో మాట్లాడిన షారూఖ్ స్పందిస్తూ, 'నెపోటిజం అన్న పదానికి నాకు అర్థం తెలియదు. నాకు 25ఏండ్లు ఉన్నప్పుడు ఢిల్లీ నుంచి ముంబయి వచ్చాను. ఇక్కడ అందరూ నన్ను అభిమానించి ఆదరించారు. అందుకే నాకు ఆ పదానికి అర్థం తెలియడం లేదు. ఎవరన్నా ఈ పదం గురించి చర్చించినప్పుడు నెపోలియన్ గురించి మాట్లాడుతున్నారేమో అనిపిస్తుంది. నాకు ఇంగ్లీష్ వచ్చు, కానీ ఆ పదానికి మాత్రం సరైన అర్థం తెలియదు' అని చెప్పొకొచ్చాడు షారూఖ్. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో అనుష్క శర్మ హీరోయిన్‌గా నటించింది. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి పాజిటివ్ టాక్ వస్తోంది.

నిర్మాతగా ద్విభాషా చిత్రం..!

బాలీవుడ్‌లో కథానాయికలు నిర్మాతలుగా మారి సత్తాచాటిన వారు చాలా మందే ఉన్నారు. ఈ ట్రెండ్ తెలుగులోనూ కనిపించబోతోంది. తెలుగు, తమిళ భాషల్లో అగ్ర తారగా పేరొందిన సమంత త్వరలోనే నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ వార్త గతంలోనూ వినిపించినప్పటికీ అది వాస్తవరూపం దాల్చలేదు. దీంతో ఇప్పుడు కచ్చితంగా ఓ సినిమాను నిర్మించేందుకు సిద్ధమైందట సమంత. ఈ నేపథ్యంలో ఓ మలయాళ చిత్ర రీమేక్ హక్కులను కొనుగోలు చేసిన విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో నిర్మించాలని సమంత భావిస్తోందట. అంతేకాదు ఇందులో తనే కథానాయికగానూ నటించనుందని సమాచారం. ఎస్.వి.ఎస్.పీ.పార్టనర్స్ ఎల్ఎల్‌పీ అనే బ్యానర్‌పై తన స్నేహితులు వాణి, శ్రీరామ్‌లతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించడానికి సమంత సిద్ధమవుతుందని టాక్. అంతేకాదు వంశీ, శ్రీరామ్, మేఘ్న వినోద్‌లతో కలిసి వ్యాపారం రంగంలోకి కూడా అడుగుపెడుతున్నట్టు తెలుస్తుంది. సమంత ప్రస్తుతం తెలుగులో 'రంగస్థలం 1985', 'రాజుగారి గది 2', 'మహానటి', తమిళంలో 'మెర్సల్', 'ఇరుంబు థిరై', 'అనీథి కథైగల్'తోపాటు శివకార్తికేయన్ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా ఉంది.

ఫేవరేట్ హీరో పవర్‌స్టార్..



మేఘా ఆకాష్

'చిన్న వయసులోనే ఎన్నో విభిన్నమైన పాత్రలు చేస్తున్న బాలీవుడ్ నటి అలియా భట్ అంటే నాకు చాలా ఇష్టం. తెలుగు కథానాయికల్లో త్రిష అంటే ఇష్టం. హీరోల విషయానికి వస్తే పవన్ కళ్యాణే నా ఫేవరేట్ హీరో' అని అంటోంది మేఘా ఆకాష్. నితిన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన 'లై' చిత్రంతో హీరోయిన్‌గా మేఘా ఆకాష్ తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ నెల 11న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో మేఘా ఆకాష్ శుక్రవారం మీడియాతో ముచ్చటించింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

'నేను చెన్నైలో పుట్టి పెరిగినప్పటికీ మా నాన్న ఆకాష్‌రాజా తెలుగువారే. అడ్వర్టైజింగ్ ఏజెన్సీను నిర్వహిస్తున్నారు. అమ్మ బిందు రాజా మాత్రం మలయాళీ. యాడ్ ఫిల్మ్ డైరెక్టర్. నేను విజువల్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ చేశాను. యాక్టింగ్‌పై ఆసక్తితో సినీ రంగంలోకి వచ్చాను. నాకు తొలి ఛాన్స్ తమిళంలో వచ్చింది. ధనుష్ హీరోగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఎన్నై నొక్కి పాయుమ్ తోట' చిత్రంలో నటిస్తున్నాను. ఆ చిత్రం షూటింగ్ టైమ్‌లోనే 'లై' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. కథ బాగా నచ్చడంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశా. తమిళ చిత్రాల కంటే తెలుగు చిత్రమే ఫస్ట్ రిలీజ్ కావడం ఆనందంగా ఉంది. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో నేను చైత్ర అనే పాత్రలో కనిపిస్తాను. చాలా ఎనర్జిటిక్‌గా ఉంటూ ఎప్పుడూ హుషారుగా మాట్లాడుతుంటాను. రియల్ లైఫ్‌లో మాత్రం నేను చాలా కామ్ పర్సన్‌ని. ఇందులో నా పాత్రకు కథలో ప్రాధాన్యత ఉంటుంది. గ్లామర్‌గా కనిపిస్తూనే నటనతో అలరిస్తాను. అంతేకాదు పాత్ర చాలా ఆసక్తికరంగానూ ఉంటుంది. ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. నితిన్‌తో వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయనకు ఓపిక ఎక్కువ. డౌన్ టు ఎర్త్ పర్సన్. ఎప్పుడూ సరదాగా ఉంటాడు. నటన పరంగా పలు సలహాలు కూడా ఇచ్చాడు. దర్శకుడు హను రాఘవపూడి సినిమాను చాలా బాగా తీర్చిదిద్దారు. హను టేకింగ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. సినిమాలో నటించేటప్పుడు నాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చాడు. ఈ చిత్రం షూటింగ్ యూఎస్‌లోని లాస్‌వేగాస్, చికాగో, శాన్‌ఫ్రాన్సిస్కోలో 75రోజులపాటు జరిగింది. అది చాలా కష్టమైన షెడ్యూల్. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్రం నా కెరీర్‌కు బ్రేకిస్తుందని నమ్ముతున్నాను. ఇక తెలుగులో రామ్ హీరోగా రూపొందుతున్న చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. కానీ డేట్స్ కుదరకపోవడంతో వదిలేసుకున్నాను. ప్రస్తుతం తెలుగులో పవన్ కళ్యాణ్ నిర్మాతగా, నితిన్ హీరోగా రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నాను. తమిళంలో ధనుష్ చిత్రంతోపాటు 'ఒరు పక్కా కథై' చిత్రంల్లో నటిస్తున్నా. ఈ చిత్రాలు నాకు మంచి పేరు తెచ్చిపెడతాయని ఆశిస్తున్నా' అని చెప్పింది.

సెన్సార్ ప్రశంసలు..



పోసాని కృష్ణమురళి, అదితి సింగ్

శ్రీకర్‌బాబు దర్శకత్వంలో దగ్గుబాటి వరుణ్ సమర్పణలో మధురం మూవీ క్రియేషన్స్ పతాకంపై మాధవి అద్దంకి నిర్మిస్తున్న చిత్రం 'నేను కిడ్నాప్ అయ్యాను'. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాధవి అద్దంకి మాట్లాడుతూ, 'సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. సెన్సార్ బోర్డ్ సభ్యులు చూసి బాగా ఎంజాయ్ చేశారు. ఆర్టిస్టుల నటనతోపాటు టీమ్ అందరిని మెచ్చుకున్నారు. క్లీన్ 'యూ' సర్టిఫికెట్ వచ్చింది. దర్శకుడు శ్రీకర్‌బాబు సినిమాని చాలా బాగా తెరకెక్కించాడు. బ్రహ్మానందం, పోసాని, తాగుబోతు రమేష్, రఘుబాబు, కృష్ణభగవాన్, పృథ్వీల హాస్యం ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ నెల రెండో వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. 'అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. కిడ్నాప్ డ్రామా నేపథ్యంలో సాగే చిత్రమిది. సెన్సార్ సభ్యులు ప్రశంసించడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. సినిమా కోసం చాలా మంది పేరున్న డిస్ట్రిబ్యూటర్స్ అంతా మమ్మల్ని సంప్రదిస్తున్నారు. సినిమాకు క్రేజ్ పెరుగుతుంది. కచ్చితంగా అందరిని అలరించే చిత్రమవుతుంది' అని దర్శకుడు శ్రీకర్‌బాబు అన్నారు.

కబ్జా నేపథ్యంలో మాస్ పవర్ ఆరంభం



'మాస్ పవర్' చిత్ర ప్రారంభోత్సవ దృశ్యం

శివ జొన్నలగడ్డ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'మాస్ పవర్'. ప్రియచైతన్య హీరోయిన్‌గా, సర్వేశ్వర మూవీస్ పతాకంపై గుద్దేటి బసవప్ప మేరు నిర్మిస్తోన్న ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి పారిశ్రామిక వేత్త సారిపల్లి కొండలరావు క్లాప్‌నివ్వగా, టి.రామ సత్యనారాయణ కెమెరా స్విచాన్ చేశారు. ముత్యాల రామదాసు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ, 'శివ 'పోలీస్ పవర్'తో మాస్ హీరోగా అందరిన్ని ఆకట్టుకున్నాడు. మళ్లీ అలాంటి కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. సినిమా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'ఇటీవల బసవప్ప, నా కాంబినేషన్‌లో వచ్చిన 'పోలీస్ పవర్' పెద్ద విజయం సాధించింది. ఇది విజయవంతంగా 50 రోజులు కూడా పూర్తి చేసుకుంది. మళ్లీ అదే కలయికలో రెండవ సినిమాగా 'మాస్ పవర్'ను తెరకెక్కించడం సంతోషంగా ఉంది. కాలనీలో ఒక హౌస్‌ను ఓ పొలిటికల్ లీడర్ కబ్జా చేస్తే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. తిరిగి ఆ హౌస్‌ను యాజమానికి హీరో ఎలా అప్పగించాడనేది ఈ చిత్ర కథ. నా స్టయిల్‌లో పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. టెక్నికల్‌గా సినిమా హైలైట్‌గా నిలుస్తుంది. యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి' అని శివ జొన్నలగడ్డ తెలిపారు. నిర్మాత బసవప్ప మేరు చెబుతూ, 'పక్కా పవర్‌ఫుల్ మాస్ అంశాలున్న ప్యాకేజ్ చిత్రమిది. ఐదు ఫైట్లను, పాటలను ఐదుగురు ఫైట్ మాస్టర్స్, కొరియోగ్రాఫర్లతో కంపోజ్ చేయిస్తున్నాం. ఈ నెల 10 నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తాం' అని చెప్పారు.

భయపెడుతూనే నవ్వించే లచ్చి



'లచ్చి'లో జయతి

'వెన్నెల' కార్యక్రమం ద్వారా బుల్లితెరకు పరిచయమైన జయతి హీరోయిన్‌గా మారి నటిస్తున్న చిత్రం 'లచ్చి'. జె9ఫోర్ షోస్ పతాకంపై జయతి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఈశ్వర్ దర్శకుడు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం గురించి జయతి మాట్లాడుతూ, 'చాలా టీవీ కార్యక్రమాలు చేసిన అనుభవంతో మొదటిసారి సినిమా నిర్మాణం చేపట్టాను. హర్రర్ కామెడీ చిత్రాలు చాలా వచ్చాయి. కానీ ఇది వైవిధ్యమైన హర్రర్ కామెడీతో రూపొందిస్తున్న చిత్రం. వైవిధ్యమైన కథ, కథనం ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురి చేస్తుంది. ఈ చిత్రం అంతా నేను నటించిన లచ్చి పాత్ర చుట్టూతే తిరుగుతుంది. ఇందులో ఉన్న అనేక మలుపులు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతాయి. ప్రముఖ కమెడీయన్స్ కడుపుబ్బా నవ్విస్తారు. అలాగే లెజెండ్ కెమెరామెన్ యం.వి.రఘుతో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయన ఈ చిత్రాన్ని మరో మెట్టుకి తీసుకెళతారు. ఈ చిత్రానికి మరుదూరి రాజా ఆకట్టుకునే డైలాగ్‌లు రాశారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మా ప్రయత్నాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'నాకిది తొలి చిత్రం. దర్శకుడు ఈశ్వర్ ప్రతి పాత్రను అలరించేలా తీర్చిదిద్దారు. ఇందులో నేను ప్రధాన పాత్రలో కనిపిస్తాను' అని మరో నటి తేజస్విని తెలిపారు.

కేసీఆర్ వ్యాఖ్యలు ఫ్యూడల్ సంస్కృతికి నిదర్శనం..

కమ్యూనిస్టులను విమర్శించటం అంటే సూర్యుడిపై ఉమ్మేయటమే

- నవతెలంగాణపైన, మీడియాపైన దౌర్జన్యం గర్హనీయం
- సీఎంపై కమ్యూనిస్టు నేతలు, మేధావుల ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


కమ్యూనిస్టు పార్టీలపట్ల, నవతెలంగాణ దినపత్రికపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు... ఆయనలోని ఫ్యూడల్ సంస్కృతికి నిదర్శనాలని పలువురు వామపక్ష నేతలు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను విమర్శించటం అంటే సూర్యునిపై ఉమ్మేయటమేనని ఎద్దేవా చేశారు. ప్రజల పత్రిక అయిన నవతెలంగాణపై ఆయన అవాకులు, చెవాకులు పేలటం దారుణమని విమర్శించారు. ప్రజా సమస్యలను వెలికితీసే మీడియాపై పోలీసుల దౌర్జన్యం.. రాష్ట్రంలో అప్రజాస్వామిక పోకడలకు నిదర్శనమని వారు చెప్పారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలను విడనాడాలని సీఎంకు, ప్రభుత్వానికి హితవు పలికారు.

హోదాని మరిచిపోయారు..: కోదండరామ్, టీ జేఏసీ చైర్మెన్



"కేసీర్ సీఎం హోదాలోనున్న విషయాన్ని మరిచిపోయారు. ప్రతి నాయకుడికి.. ఇతర పార్టీలపై విమర్శలు చేసే హక్కు ఉంటుంది. కానీ ఆ విధంగా విమర్శించేటప్పుడు ఉపయోగించే భాష హుందాగా ఉండాలి. ప్రస్తుతం కేసీఆర్ తెలంగాణ సమాజానికి ముఖ్యమంత్రి. ఆ స్థాయి వ్యక్తి తన హోదాను మరిచి విపక్షాలపైన, పత్రికలపైనా మాట్లాడటం సరికాదు..."

కమ్యూనిస్టు పార్టీలకో చరిత్ర ఉంది... : చుక్కా రామయ్య, మాజీ ఎమ్మెల్సీ



"దేశలో కమ్యూనిస్టు పార్టీలకు ఒక చరిత్ర, సిద్ధాంతాలు ఉన్నాయి. అలాంటి పార్టీల నుద్దేశించి సీఎం ఈ విధంగా వ్యాఖ్యానించటం భావ్యంకాదు. ఆయా పార్టీలపై కామెంట్ చేసేటప్పుడు కాస్త చూసుకుని మాట్లాడితే బావుండేది..."

పత్రికలపై వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: జస్టిస్ చంద్రకుమార్

"నవతెలంగాణ పత్రికపైన సీఎం చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం..."



ఖమ్మంలో ఆయన్ను కాపాడింది ఎవరు...?: గోవర్థన్, (సీపీఐ ఎంఎల్ -న్యూడెమోక్రసీ)

"కేసీఆర్ నిరాహారదీక్ష చేసినప్పుడు పోలీసులు అరెస్టు చేసి ఖమ్మానికి తరలించారు. అప్పుడు ఆయన్ను కాపాడింది ఎవరో గుర్తుచేసుకోవాలి. ఆయన్ను ఆనాడు ఆదుకుంది కమ్యూనిస్టులే. ఇప్పుడు అధికారం అనే అహం ఆయన కండ్లను కమ్మేసింది. అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ఆయన కమ్యూనిస్టులపైన, నవతెలంగాణ పత్రికపైనా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి..."

ఆయనో పిట్టల దొర.. : తాండ్రకుమార్, ఎంసీపీఐ (యు)

"కేసీఆర్ వ్యాఖ్యలు పిట్టల దొర మాటల్లా ఉన్నాయి. గతంలో చేసిన వాగ్దానాలను అమలు చేయాలని కోరితే అరెస్టులు చేయిస్తున్నారు. ధర్నాచౌక్‌ను ఎత్తేశాడు. నేరెళ్ల, జిల్లెళ్ల బాధితులను తీవ్రంగా హింసించారు. ఇదేంటని అడిగితే సమాధానం ఉండదు. హిమాన్షు మోటార్ల వ్యవహారం గురించి ప్రశ్నిస్తే అడ్డదిడ్డంగా సమాధానాలిస్తారు. ఇదేం పద్ధతి, ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటలేనా అవి...? పత్రికలు, ప్రజలపట్ల ఆయనకు ఎంతమాత్రం గౌరవం లేదు.."

లోపాలను ఎత్తిచూపితే కక్షగడుతున్నారు...: వేములపల్లి వెంకటరామయ్య, (సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ)

"కేసీఆర్ వ్యవహారశైలి మొదటి నుంచి ఇదే విధంగా ఉంది. ఆయన పాలనలోని లోపాలను ఎత్తిచూపి, విమర్శించిన వారిపై కక్షగట్టటం ఆయనకు పరిపాటిగా మారింది. అసలు కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం మీద, దాని విలువల మీద ఎంతమాత్రమూ గౌరవం లేదు. పత్రికల గొంతునొక్కేందుకు ప్రయత్నించటం ఆయనలోని నిరంకుశత్వానికి నిదర్శనం..."

వలసపాలనలో కూడా ఈ దుస్థితి లేదు..: బండ సురేందర్‌రెడ్డి, ఫార్వర్డ్‌బ్లాక్

"ఉమ్మడి రాష్ట్రంలో, వలస పాలనలో కూడా రాష్ట్రంలో ఈ దుస్థితి లేదు. కేసీఆర్ అడుగడుగునా పోలీసుల్నిపెట్టి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజల దురదృష్టం. కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు లేవంటున్న కేసీఆర్ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి.. ఆనాడు టీఆర్ఎస్‌ను స్థాపించినప్పుడు కూడా ఆయనకు ఎన్ని ఓట్లు, ఎన్ని సీట్లు వచ్చాయో గుర్తు తెచ్చుకోవాలి. నవతెలంగాణాపై ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం..."

మేకపోతు గాంభీర్యం: జానకిరాములు, ఆరెస్పీ

"కేసీఆర్‌కు కమ్యూనిస్టుల చరిత్ర తెలియదనుకోవటం మన అవగాహనా రాహిత్యం. కానీ ఇప్పుడు తెలియనట్టు నటిస్తున్నాడు. ఎందుకంటే కమ్యూనిస్టులందరూ ఏకమైతే తనకు రాష్ట్రంలో పుట్టగతులుండబోవని కేసీఆర్‌కు తెలుసు. అందుకే ఇంతగా అక్కసు వెళ్లగక్కుతున్నాడు.. పత్రికలు, మీడియాపై సీఎం చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి..."

టిక్కెట్ల రద్దుతో రైల్వేకు రూ.1400 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయాణికులను ఆకట్టుకొనేందుకు రైల్వే శాఖ శతవిధాలుగా ప్రయత్నిస్తున్నది. కొత్త స్కీమ్‌లను ప్రవేశపెడుతూ ఖజానా నింపుకుంటున్నది. తాజాగా ఈ ఏడాదికి గాను ప్రయాణికులు రద్దు చేసుకున్న టిక్కెట్ల నుంచి రైల్వే శాఖకు రూ.1400 కోట్ల ఆదాయం సమకూరిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గత ఆర్థిక ఏడాదితో పోలిస్తే ఈ మొత్తం 25 శాతం పెరిగింది. ఈ విషయాన్ని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజెన్ గోహైన్ రాజ్యసభలో వెల్లడించారు. 2015 రైల్వే టిక్కెట్ క్యాన్సిలేషన్, రిఫండ్‌కు సంబంధించిన నిబంధనల మేరకు భారీ మొత్తం సమకూరినట్టు వివరించారు.రైలు బయలుదేరే సమయానికి 48 గంటల ముందు రద్దు చేసుకున్నవారి వసూలుచేసే చార్జీలను రెండింతలు చేసింది.

11 నుంచి అయోధ్యపై విచారణ

- ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పాటు

న్యూఢిల్లీ:రామజన్మభూమి,బాబ్రీ మసీదు వివాదంపై 11 వతేది మధ్నాహ్నం రెండు గంటల నుంచి సుప్రీం కోర్టు విచారించనున్నది. ముగ్గురు న్యాయమూర్తుల ప్రత్యేక ధర్మాసనం వాద,ప్రతివాదనలు విననున్నది. గతేడాది ఇరు పక్షాలు బయటనే సమస్యను పరిష్కరించుకోవాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. అలా కానిపక్షంలో తిరిగి సుప్రీం జోక్యం చేసుకుంటుందని స్పష్టం చేసింది.సున్నితమైన ఈ అంశం మళ్లీ సుప్రీం ముందుకువచ్చింది.

ఎస్ఈజెడ్‌లపై విచారణ 8 వారాలకు వాయిదా

- సమాధానమివ్వని రాష్ట్రాలకు నాలుగు వారాల చివరి అవకాశం : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ:ప్రత్యేక ఆర్థిక మండళ్ల(ఎస్ఈజెడ్) కోసం సేకరించి, నిరుపయోగంగా ఉంచిన భూములను తిరిగి రైతులకు ఇచ్చి వేయాలన్న పిటిషన్‌పై విచారణను మరో 8 వారాలకు సుప్రీంకోర్టు వాయిదా వేసింది. దీనికి సంబంధించి ఇప్పటివరకూ సమాధానమివ్వని రాష్ట్రాలకు మరో నాలుగు వారాల సమయమిస్తున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. ఆ రాష్ట్రాలకు ఇదే చివరి అవకాశమని ఈ కేసును విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఎస్ఈజెడ్ నిబంధనలను పాటించని కార్పొరేట్ సంస్థలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. జనవరి 9న విచారణ సందర్భంగా కేంద్రంతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర,తమిళనాడు, కర్నాటక, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జులై 4వరకూ సమాధాన మివ్వని వాటిలో ఏపీ, బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలున్నాయి. ఎస్ఈజెడ్‌ల విషయంలో నిబంధనలు పాటించని కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని, రైతుల భూములు వెనక్కి ఇప్పించాలని కోరుతూ ఎస్ఈజెడ్ ఫార్మర్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ జరుగుతోంది. ఐదేండ్లలో ఎస్ఈజెడ్‌ల కోసం 4842.38 హెక్టార్ల భూమిని సేకరించగా, కేవలం 362 హెక్టార్లను మాత్రమే వినియోగిస్తున్నారని, మిగతా 4480 హెక్టార్ల భూమి నిరుపయోగంగా ఉంచారని అసోసియేషన్ తన పిటిషన్‌లో పేర్కొన్నది.

బ్రహ్మణపల్లి హైస్కూల్‌ను నడిపించాలి:టీపీఏ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పెద్దపల్లి జిల్లా బ్రహ్మణపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను యధావిధిగా నడిపించాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం (టీపీఏ) రాష్ట్ర అధ్యక్షులు నాగటి నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి ప్రకాశ్, కార్యదర్శి పగడాల లక్ష్మయ్యతో కలిసి సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యకు వినతిపత్రం అందించారు. బ్రహ్మణపల్లి పాఠశాలను మూసివేయవద్దని తల్లిదండ్రులు, విద్యార్థులు డీఈఓ, కలెక్టర్‌ను వేడుకున్నా వారు వినడం లేదని చెప్పారు. మూసివేయద్దని ప్రభుత్వ పెద్దలిచ్చిన ఉత్తర్వులనూ అమలు చేయడం లేదని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వస్తున్నారనీ, కానీ టీచర్లు మాత్రం రావడం లేదని వివరించారు.

ఉద్యోగం ఇస్తామంటూ...

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

తమ సంస్థలో ఉద్యోగాలున్నాయంటూ పదే..పదే ప్రకటనలిచ్చాడు. ఆ తర్వాత ఇంటర్వ్యూలూ నిర్వహించాడు. 'ఉద్యోగానికి ఎంపికయ్యావ్... జీతభత్యాలు మాట్లాడుకుందాం' రావాలంటూ ఓ యువతిని పిలిపించాడు. కంగ్రాట్స్ చెప్పే ముసుగులో ఆ యువతికి మత్తు కలిపిన స్వీటు ఇచ్చాడు. అది తిని స్పృహ కోల్పోగానే ఆ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ యువతి నగ్నచిత్రాలను ఫోన్లో చిత్రీకరించాడు. విషయం బయట చెబితే..ఆ చిత్రాలన్నీ సోషల్ మీడియాలో పెడుతానంటూ బెదిరించాడు. వాటిని అడ్డు పెట్టుకుని తన కోరిక తీర్చాలంటూ మళ్లీ వేధింపులు మొదలు పెట్టాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లో కేపీఆర్ ఇంటర్ కాంటినెంట్ (కేపీఆర్ ఐసీ) పేరిట ఓ సంస్థను రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఏర్పాటు చేశాడు. తన సంస్థలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయంటూ కొద్దిరోజుల కింద వివిధ రూపాల్లో ప్రకటన ఇచ్చాడు. దాన్నిచూసిన ఓ యువతి (29) దరఖాస్తు చేసుకుంది. ఇంటర్వ్యూ నిర్వహించిన రాజశేఖర్‌రెడ్డి ఉద్యోగంలో సెలక్ట్ అయినట్టు లెటర్ పంపించాడు. ఉద్యోగంలో చేరేముందు జీతభత్యాలు మాట్లాడానికి కార్యాలయానికి రావాలని కబురు పంపాడు. దీంతో ఆ యువతి కేపీఆర్ఐసీకి వెళ్లింది. అక్కడ ఆమెకు రాజశేఖర్‌రెడ్డి కంగ్రాట్స్ చెబుతూనే మత్తు కలిపిన స్వీట్లు ఇచ్చాడు. వాటిని తిన్న యువతి కొద్దిసేపటికే స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత యువతిపై లైగింకదాడికి పాల్పడ్డాడు. ఆమె నగ్న దృశ్యాలను ఫోన్‌లో చిత్రీకరించాడు. కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన యువతిని నిందితుడు బెదిరించాడు. విషయాన్ని ఎవరికైనా చెబితే అశ్లీల చిత్రాలను మీ కుటుంబసభ్యులకు చూపెడతానని, సామాజిక మాధ్యమాల్లో పెడుతానని బెదిరించాడు. దాంతో భయపడిన ఆ యువతి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే అశ్లీల చిత్రాలను అడ్డుపెట్టుకొని తిరిగి రాజశేఖర్‌రెడ్డి తన కోరిక తీర్చాలని వేధించటం మొదలుపెట్టాడు. భరించలేని యువతి విషయాన్ని ఇంట్లో చెప్పింది. వారి సహాయంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అన్నికోణాల్లో కేసును విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లంచాలిచ్చే పరిస్థితి పోవాలె

నవతెలంగాణ - శామీర్‌పేట


తెలంగాణ రాష్ట్రం వచ్చాక రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి లంచాలిచ్చే పరిస్థితి క్రమంగా పోతున్నదని, ఇది మంచి పరిణామం అని సీఎం కే. చంద్రశేఖర్‌రావు అన్నారు. రైతులు ఆఫీసులకు వెళ్లగానే పనులు పూర్తి అవుతున్నాయని చెప్పారు. కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలను ఆరు నెలల్లో అన్నివిధాలా అభివృద్ధి పరుస్తామని సీఎం కే.చంద్రశేఖర్‌రావు హామీనిచ్చారు. ఒక క్రమపద్ధతిలో పూర్తిస్థాయిలో అభివృద్ధిపరిచి గ్రామాల రూపురేఖలు మారు స్తామన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం కేశవరం, లక్ష్మాపురం సర్పంచ్‌లు గోనె మంజుల, కటికెల శ్యామల అధ్యక్షతన శుక్రవారం గ్రామస భలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీ ఆర్ మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాలను అభి వృద్ధి పరిచేందుకు రూ.27 కోట్లు మంజూరు చేస్తు న్నామని ప్రకటించారు. కేశవరం గ్రామానికి రూ. 12 కోట్లు విడుదల చేస్తున్నామని, అవసరమైతే మరో రూ.12కోట్లు అదనంగా ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. కేశవరం గ్రామ అభివృద్ధిపై రేపు(శనివారం) మధ్యాహ్నం కల్లా జీవో విడుదల చేస్తామన్నారు. 15 రోజుల్లో కేశవరం రెవెన్యూ రికార్డులన్నీ మ్యుటేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. లక్ష్మాపూర్, కేశవరం గ్రామస్తులు చెప్పిన సమస్యలన్నీ పరిష్కరించి ఆరునెలల్లో ఆ గ్రామ రూపురేఖలు మారుస్తానన్నారు. లక్ష్మాపూర్ చెరువుని గోదావరి జలాలతో కళకళలాడేలా చేసి 365 రోజులు చెరువు నిండుకుండలా ఉండేలా చేస్తానన్నారు. లక్ష్మాపురం అభివృద్ధికి 15 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ, లైబ్రరీ, గ్రామ పంచాయతీ భవనాలు, మార్కెట్ యార్డు, అంగన్‌వాడీ భవనాల ఏర్పాటు గురించి, తదితర సమస్యల గురించి సర్పంచ్, జేసీ చెప్పారన్నారు. వాటిని నిర్మాణాలు చేపతామన్నారు. ప్రతి గ్రామంలో రైతు సమాఖ్య ఏర్పాటు చేసుకోవాలని, దీనిద్వారానే రైతుల సమస్యలు పరిష్కరించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఒకే రకం పంటలు వేసి రైతుకు రైతే శత్రువు అవుతున్నారని, అలాకాకుండా క్రాప్ కాలనీలుగా విభజించుకొని పంటలు పండించాలని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా అందిస్తున్నామని కేసీఆర్ వెల్లడించారు. ఆటోమేటిక్ స్టార్టర్ల ద్వారా నష్టపోతామని వాటి ద్వారా నీళ్లు, విద్యుత్ వృథా అవుతుందని చెప్పారు. అందుకే వాటిని త్వరలో తీసేయాలని గ్రామ రైతులకు ముఖ్యమంత్రి సూచించారు. హరితహారం ఏ ఒక్కరి కోసమో కాదని, తెలంగాణ ప్రజలందరి కోసం తలపెట్టిన కార్యక్రమమని తెలిపారు. కేశవరంలో ఇంటింటికి ఆరు మొక్కలు నాటి సంరక్షించాలని, వచ్చే ఏడాది జనవరి నాటికి ఎవరైతే ఆరు మొక్కలను నాటి ఎదిగేలా కృషిచేస్తారో ఆయా ఇంటికి రెండేసి పాడిపశువులను ఉచితంగా అందజేస్తానని హామీఇచ్చారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో మల్టీపర్పస్ హాలు నిర్మిస్తానని అన్నారు. గ్రామస్తులంతా కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. ఒక్క పోలీసు కేసు కూడా లేకుండా కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరావు, ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్, జేసీ ధర్మారెడ్డి, నాయకులు సత్యనారాయణ, భాస్కర్‌యాదవ్, జడ్పీటీసీ బాలేష్, పలు శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కాపాడేందుకు నిజాలను దాయొద్దు..

ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సీపీఐ (ఎం) హితవు

- చట్టంపై గౌరవం ఉంటే కేటీఆర్ రాజీనామా చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మంత్రి కేటీఆర్‌ను కాపాడేందుకు నిజాలను దాయొద్దని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డికి సీపీఐ (ఎం) హితవు పలికింది. కేటీఆర్‌పై వెల్లువెత్తుతున్న అభియోగాలకు సమాధానం చెప్పకుండా వాస్తవాలను దాటేసేందుకు పల్లా ప్రయత్నిస్తున్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. తద్వారా మంత్రిని కాపాడేందుకు క్యూ కడుతున్నారని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ పార్టీకి చట్టాలు, రాజ్యాంగపట్ల ఎంతమాత్రం గౌరవం ఉన్నా కేటీఆర్‌తో వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఆయనపై విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. హిమాన్షు కంపెనీలో కేటీఆర్ వాటాలపై చర్చ మొదటిసారి వెలుగులోకి వచ్చినప్పుడు... ఏడేండ్లుగా ఆ కంపెనీతో తనకు సంబంధమే లేదంటూ మంత్రి చెప్పారని గుర్తు చేశారు. ఇందుకు భిన్నంగా రాజేశ్వరరెడ్డి సదరు కంపెనీ యాక్టివిటీలో లేదంటూ వాదిస్తున్నారని చెప్పారు. యాక్టివిటీలో లేని కంపెనీకి మోటారు సైకిళ్ల కొనుగోళ్ల ఆర్డర్‌ను ఎలా ఇచ్చారంటూ తమ్మినేని ఈ సందర్భంగా ప్రశ్నించారు. డైరెక్టర్‌గా ఇన్‌కంట్యాక్స్ రిటర్న్‌ను కేటీఆర్ ఎలా సమర్పించారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్, ఇతర రాజ్యాంగ సంస్థలు మొట్టికాయలు వేయకముందే చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కేటీఆర్‌తో రాజీనామా చేయించటం ద్వారా తెలంగాణ సమాజానికి జవాబుదారీతనంగా ఉండాలని హితవు పలికారు.

కన్నీటి వీడ్కోలు...

అధికార లాంఛనాలతో పీఎం భార్గవ అంత్యక్రియలు

- సీఎస్, తమ్మినేని, నారాయణ సహా పలువురి నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రఖ్యాత శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్ పీఎం భార్గవ అంత్యక్రియలు శుక్రవారం అధికార లాంఛనాలతో ముగిశాయి. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన భౌతిక కాయానికి కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గౌరవ వందనం సూచికగా ఉన్నతాధికారుల సమక్షంలో పోలీసులు గాల్లోకి ఆరురౌండ్‌ల కాల్పులు జరిపారు. అధికారులు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, కుటుంబ సభ్యులు, ఇతరులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఒకటో తేదీన ఆయన అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ప్రజల సందర్శనార్థం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పీఎం భార్గవ భౌతికకాయాన్ని ఉప్పల్‌లోని ప్రశాంత్ నగర్ కమ్యూనిటీహాల్‌లో ఉంచారు. భార్గవ భౌతికకాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్, డిజి నర్సింహారావు, నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, నాయకులు పల్లా వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, మాజీ ఎమ్మెల్సీలు చుక్కా రామయ్య, ఎం గేయానంద్, మాజీ ఐఎఎస్ ఛాయారతన్, సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపీఎస్ఎన్) ప్రధాన కార్యదర్శి టి రమేష్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి శ్రీనాథ్, నాయకులు బిఎన్‌రెడ్డి, సత్యప్రసాద్, రాజా, సర్వేశ్వరరావు, శ్రీనివాస్, ప్రముఖ దర్శకుడు బి నర్సింగరావు, సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా, కల్పనా కన్నభిరాన్, బయోటెక్ ఎండీ



వరప్రసాద్‌రెడ్డి, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వేదకుమార్ తెలంగాణ మేధావుల కో-ఆర్డినేషన్ చైర్మెన్ (రిటైర్డు) ప్రొ॥ ఎ. గోపాలకిషన్, కార్యదర్శి రాజేందర్‌బాబుతోపాటు పలువురు సందర్శించి నివాళులర్పించారు. భార్గవ కుమారుడు మోహిత్ భార్గవ, కూతురు వనీత భట్టాచార్యలను పరామర్శించారు. ప్రశాంత్‌నగర్‌లో ఆయన నివాసం నుంచి భౌతిక కాయాన్ని మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు జరిపారు. ఈ కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి అర్విండ్ సింగ్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ ఎం ప్రశాంతి, ఆర్డీవో చంద్రకళ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ మీడియాతో మాట్లాడుతూ భార్గవ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తామని చెప్పారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయామని అన్నారు. సైన్స్ అభివృద్ధికి విశేష కృషి చేశారని చెప్పారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. నారాయణ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ భావాలను సైద్ధాంతికంగా వ్యతిరేకించారని అన్నారు. తన భావాలను కుండబద్దలు కొట్టినట్టు చెప్పేవాడని చెప్పారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ గొప్ప శాస్త్రవేత్తల్లో భార్గవ ఒకరని అన్నారు. పరిశోధనలకే పరిమితం కాకుండా ప్రజల్లో మూఢవిశ్వాసాలను పారద్రోలేందుకు తనవంతు కృషి చేశారని చెప్పారు. దేశం గర్వించదగ్గ ప్రజా శాస్త్రవేత్త మరణిస్తే ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ప్రజా శాస్త్రవేత్తకు ఈ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?అని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

సిలబస్ కొంపముంచింది

(మొదటిపేజీ తరువాయి)

విద్యాశాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ జి కిషన్ ఇతర విద్యాశాఖ అధికారులతో కలిసి టెట్ -2017 ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. గతంలో ఆగస్టు5న విడుదల చేస్తామని చెప్పినా, ఒకరోజు ముందుగానే అధికారులు ఫలితాలను విడుదల చేశారు. పేపర్(డీఈడీ)-1లో మొత్తం 98,848 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా, 56,708 (57.37శాతం) మంది అర్హత సాధించారు. పేపర్(బీఈడీ)-2లో 2,30,932 మంది పరీక్షకు హాజరైతే 45,055 (19.51శాతం) మాత్రమే అర్హత సాధించారు. మ్యాథ్స్అండ్ సైన్స్ విభాగంలో 1,11,018 మంది పరీక్ష రాస్తే 20,323(18.31శాతం) ఉత్తీర్ణత సాధించగా, సోషల్ స్టడీస్ విభాగంలో 1,19,914మంది హాజరైతే 24,732 (20.62శాతం) మంది అర్హత సాధించారు. పేపర్-1లో రాజన్న సిరిసిల్లా జిల్లా 74.27శాతంతో మొదటిస్థానంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 47.90శాతంతో చివరిస్థానంలో నిలిచింది. పేపర్-2లో మంచిర్యాల జిల్లా 24.02శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో, సిద్దిపేట జిల్లా 16.80శాతం చివరి స్థానంలో నిలిచింది. మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో భద్రాద్రి జిల్లా24.91శాతం ఉత్తీర్ణతతో మొదటిస్థానంలో, మేడ్చెల్ జిల్లా 15.93శాతంతో చివరిస్థానంలో ఉంది. సోషల్ స్టడీస్ విభాగంలో మంచిర్యాల 26.06శాతంతో మొదటిస్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లా 17.15శాతంతో చివరి స్థానంలో నిలిచింది. అయితే మరో 16,032 మంది ఫలితాలను వివిధ కారణాలతో విత్‌హెల్డ్‌లో పెట్టినట్టు కమిషనర్ జి కిషన్ తెలిపారు. విద్యార్థుల బ్యాగుబరువుపై తల్లిదండ్రులు, ప్రయివేటు బడుల యాజమాన్యాల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో త్వరలో ఓ కమిటీని వేస్తామని చెప్పారు. డ్రగ్స్ విషయంలోనూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాల్లో సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి, అడిషనల్ డైరెక్టర్ కృష్ణారావు, ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్ సత్యనారాయణ, ఎస్‌సీఈఆర్టీ అధికారి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పెరగాలనేనా?

గత నెల 23న జరిగిన టెట్-2017 పరీక్షకు విద్యాశాఖ నిర్వహించింది. దీనిలో కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టింది. పేపర్-1కు టెన్త్‌స్థాయి, పేపర్-2కు ఇంటర్‌స్థాయిలో సిలబస్‌ను ఇచ్చింది. దీన్ని నిరసిస్తూ కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు.

విద్యాశాఖ అధికారులు మాత్రం దీన్ని సమర్థించుకుంటున్నారు. నాణ్యత పెరగాలంటే ఇలాంటివి అవసరమేనని చెబుతున్నారు. ఇప్పటికే డీఎస్సీకోసం అనేక మంది అభ్యర్థులు ఏండ్ల నుంచి ప్రిపేర్ అవుతున్నా, గతేడాది కంటే పేపర్-2లో ఐదుశాతం తక్కువ ఫలితాలు రావడం ఈ సిలబస్ ఎఫెక్టేనని అభ్యర్థులు చెబుతున్నారు.

కొలువు పోదు... పర్మినెంట్ కాదు!

(మొదటిపేజీ తరువాయి)

లెక్చరర్లకు మినిమం టైంస్కేల్ ప్రకారం వేతనాలు పెరిగాయి. తాజాగా కాంట్రాక్టు ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లోకి విలీనం చేసుకుంటూ వేతనాలు పెంచింది. అదేవిధంగా జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల మ్యూచువల్ బదిలీలు జరుగుతున్నాయి. అదే పద్ధతిలో మిగతా చోట్ల చేసే అవకాశం ఉంది. ప్రమోషన్లు ఇచ్చే అవకాశం కూడా లేకపోలేదని అధికారవర్గాలు అంటున్నాయి. ఎవరి ఉద్యోగం పోకుండా, పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తామని జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకులకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. అయితే వారి క్రమబద్ధీకరణకు సంబంధించి కేసు కోర్టులో నడుస్తున్నది. తీర్పు ఎలా ఉంటుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సంకటంలో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో 2000 సంవత్సరంలో 142,143 జీవోల ద్వారా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో అర్హతలున్న వారినే కాంట్రాక్టు లెక్చరర్లుగా అప్పటి ప్రభుత్వాలు నియమించాయి. తెలంగాణలోనూ అదే విధానం అమలవుతున్నది. జూనియర్ కాలేజీల్లో 3,687 మంది, డిగ్రీ కాలేజీల్లో 926 మంది, పాలిటెక్నిక్ కాలేజీల్లో 435 మంది, విశ్వవిద్యాలయాల్లో సుమారు 1,700 మంది, విద్యుత్ శాఖలో 23,667 మంది కలిపి మొత్తం 30,415 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న వారి ఉద్యోగాలకు కొంత ఇబ్బంది లేదు. వారి ఉద్యోగ భద్రతకు ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. పదోన్నతులు ఇచ్చినా, కొత్త వారిని నియమించినా వారి ఉద్యోగాలకు ప్రమాదం లేదని తెలుస్తున్నది. కానీ వర్సిటీల్లో పనిచేస్తున్న 1,700 మంది కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి సంకటంలో ఉంది. ఇప్పటికే వర్సిటీల్లో 1,551 పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, తొలివిడతలో 1,061 పోస్టులు భర్తీ చేస్తామనీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తే వారు ఉద్యోగాలు కోల్పోవాల్సిందే. ఆ పోస్టులకు అందరిలాగే వారూ దరఖాస్తు చేసుకొని పోటీపడాలి. ఇది వారిని తీవ్రంగా వేధిస్తున్నది. ఉద్యోగ భద్రత కల్పించాలని ఉన్నత విద్యామండలిని ముట్టడిస్తే అది ఆచరణ సాధ్యం కాదని అధికారులు తేల్చిచెప్పారు. క్రమబద్ధీకరణకు అవకాశం లేదని తిరుపతిరావు కమిటీ సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో వారికి జీతాలు పెంచడం ఉపశమనమే అవుతుంది కానీ కొత్త నోటిఫికేషన్లు ఇస్తే వారి ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమ సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నవతెలంగాణతో అన్నారు. ఆలోపు ఆర్థిక భద్రత కల్పించాలని, మినిమం టైంస్కేల్‌తోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, సెలవులు, ప్రసూతి సెలవులు వర్తింపచేయాలని కోరారు. కోర్టు కేసుల్లో తాము ఇంప్లీడ్ అవుతామనీ, అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామనీ అన్నారు.

రాహుల్‌పై రాళ్లదాడి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. దాడిని గుజరాత్ పీసీసీ అధ్యక్షులు భరత్‌సిన్హ్ సోలంకి తీవ్రంగా ఖండించారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా గుజరాత్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తేల్చి చెప్పారు.

అప్రజాస్వామిక చర్య: ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నరేంద్రమోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్ రాష్ట్రంలో ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీపై బీజేపీ,ఆర్ఎస్ఎస్ గుండాలు దాడి చేయడం అప్రజాస్వామిక చర్య అని, వారి పాలనకు ఈ దాడులు పరాకాష్ట అని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయమై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుజరాత్, రాజస్థాన్‌లో తీవ్రమైన వరదలు, భారీ వర్షాలతో ప్రజలు నానా కష్టాలు పడుతుంటే ఆ వరద ప్రాంతాలలో రాహుల్ గాంధీ పర్యటించి బాధితులను పరామర్శించారని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆయన ప్రయాణిస్తున్న బులెట్ ప్రూఫ్ కారుపై ఇటుకలు, రాళ్లతో దాడి చేశారని పేర్కొన్నారు. దీంతో కారు బాగా ధ్వంసమైందని చెప్పారు. ప్రధాన మంత్రి సొంత రాష్ట్రంలో రాహుల్‌గాంధీ పర్యటించడాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు జీర్ణించుకోలేక ఆయనపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. మోడీ స్వంత రాష్ట్రంలో దాడులు జరగడం వారి లోపభూయిష్టమైన పాలన విధానాలను బయట పెట్టిందన్నారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు దేశం గర్వపడేలా ఉందన్నారు. దాడులకు బాధ్యత వహించి ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అమానుషం :జానారెడ్డి

రాహుల్‌పై దాడి చేయడం అమానుషమని ప్రతిపక్ష నేత జానారెడ్డి అన్నారు. గుండాలు...అనుయాయులతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే ఈ దాడికి పాల్పడ్డారన్నారు.ప్రజాస్వామ్యాన్ని మోడీ సర్కారు ఖూనీ చేస్తోందన్నారు. నియంతృత్వంతో పాలన సాగుతుందన్నారు.

విచ్ఛిన్న శక్తుల దాడి : భట్టి

రాహుల్‌గాంధీపై విచ్చిన్న శక్తులు దాడి చేశాయని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, ప్రజల కోసం పని చేసే వారిని మతతత్వ శక్తులు లక్ష్యంగా దాడులు కుట్రదారుల ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. మతతత్వ శక్తుల విజృంభన జరుగుతుందన్నారు.

ఉన్న మాటంటే ఉలుకెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ఓర్వలేక మీరు అడ్డుపుల్లలు వేస్తున్నార న్నారు. మీ కుట్రలను, కుతంత్రాలను బయట పెడతాం' అన్నారు. ఈరోశం అధికారంలో ఉన్నప్పుడు ఉంటే తెలంగాణకు ఎంతో మేలు జరిగేదన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిండు సభలో తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వనని అవమానించినప్పుడు కాంగ్రెస్ నాయకుల రోశం ఏమైందని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతలు చిల్లర రాజకీయాలు మానుకుని హుందాగా వ్యవహరించాలని సూచించారు. పెద్ద మనసుతో ఆలోచించి కేసులు విత్‌డ్రా చేసుకోవాలని కోరారు. లేదంటే 'మీరు చేస్తున్న పాపాలు, కేసులు వేసి అడ్డుకుంటున్న అభివృద్ధిపై పుస్తకాలు ముద్రించి ప్రజల్లోకి తీసుకెళ్లి మీ నిజస్వరూపం బయట పెడతాం. మాపై ఉన్న కోపాన్ని ప్రజలపై చూపకండి' అని అన్నారు. అంతకు ముందు చిన్నకోడూరు మండల పరిధిలోని మందపల్లి గ్రామ శివారులో ఉన్న పిట్టల వారి గుడిసెల్లో 20 మంది లబ్దిదారులకు నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, వైస్ చైర్మన్ అక్తర్ పటేల్, ప్రజాప్రతి నిధులు బర్ల మల్లికార్జున్, గ్యాదరి రవి, చిప్ప ప్రభాకర్, కాముని నగేష్, సాకీ ఆనంద్, వెంకట్‌గౌడ్, మల్లి పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲88 32,325

నిఫ్టీ ▲53 10,066

కోట్లకు పడగలు..



రాణించిన ఆంధ్రా బ్యాంకు

హైదరాబాద్ : ఆంధ్రాబ్యాంకు జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి మొండి బాకీలు పెరిగినా మెరుగైన ఫలితాలను ప్రకటించింది. 30.07 శాతం వృద్ధితో రూ.40.42 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు రూ.31.09 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. జూన్ త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.5,155.21 కోట్లకు చేరింది. 2016 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.4,855.50 కోట్ల ఆదాయం ఆర్జించింది. నిర్వహణ లాభాలు 37 శాతం వృద్ధితో రూ.1,000 కోట్లుగా నమోదు అయ్యాయి. 2017 జూన్ ముగింపు నాటికి ఆంధ్రా బ్యాంకు మొత్తం శాఖలు 2908, ఏటీఎం కేంద్రాలు 3929కి విస్తరించాయి. క్రితం జూన్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల మొండి బాకీలు ఏకంగా 13.22 శాతానికి ఎగిసి రూ.19,428 కోట్లకు చేరాయి.

సేఫెక్స్‌ప్రెస్ రూ.300 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ : లాజిస్టిక్ సేవల సంస్థ సేఫెక్స్‌ప్రెస్ రూ.300 కోట్లతో ఆరు లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రుబల్ జైన్ మాట్లాడుతూ ఇక్కడ 32వ అత్యాధునిక లాజిస్టిక్ పార్కును అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఐదేళ్ల క్రితం దేశ వ్యాప్తంగా తాము 32 పార్కులను తెరవాలని నిర్దేశించుకున్నామని, నేటికి ఈ లక్ష్యం నెరవేరిందన్నారు. క్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1,600 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి అంచనా వేస్తున్నామన్నారు.

త్వరలో 'ప్రాబ్లమ్‌బోలో' యాప్!

నవతెలంగాణ, వాణిజ్యవిభాగం: నగరాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపేందుకు గాను టెక్నోఫిల్ సంస్థ 'ప్రాబ్లమ్‌బోలో' పేరుతో సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తేనుంది. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మొదలుకొని ట్రాఫిక్, ఈవ్ టీజింగ్, చైల్డ్ లేబర్, డ్రైనేజీతో పాటు ఇతర సమస్యలను ఈ యాప్ ద్వారా సంబంధిత అధికారులకు చేరే వేసే విధంగా దీనిని రూపొందిస్తున్నారు. అమెరికాకు చెందిన పలువురుతో పాటు మల్లాది ఈ సంస్థకు ఏంజిల్ ఫండ్‌ను అందించినట్లు తెలిపారు. తొలిదశలో 20,000 డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారని నిర్వాహకులు తెలిపారు.

కేవలం 20 మంది చేతుల్లో దేశ జీడీపీలో 10% సంపద

- ఏడు నెలల్లో రూ.3,32,637 కోట్ల సంపదను వెనకేశారు

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలో ఆర్థిక అసమానతలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. సమాజంలో ఆర్థిక సమానత్వానికి బాటలు వేయాల్సిన ప్రభుత్వాల అసమర్థత.. కార్పొరేట్ సంస్థలకు అడుగులకు మడుగులొత్తడం వంటి చర్యల కారణం కుబేరులు మరింత కుబేరులుగాను.. పేదలు మరింత నిరుపేదలుగాను మారిపోతున్నారు. దేశంలో సంపదంతా కేవలం కొద్ది మంది బడా బాబుల హస్తాల్లోనే కేంద్రీకృతమైపోతోంది. మన దేశంలోని కేవలం ఒక శాతం వరకు ఉన్న సంపన్నులు దేశ మొత్తం సంపదలో దాదాపు 58 శాతం వాటాను కలిగి ఉన్నారని బ్లూమ్‌బర్గ్ సంస్థ తాజాగా విశ్లేషించి చెప్పడమే ఇందుకు తాజా ప్రత్యక్ష నిదర్శనం. ఇది ప్రపంచ వ్యాప్త సగటు అయిన 50 శాతం కంటే అధికం కావడం గమనార్హం.

ఏడు నెలల్లో రికార్డు సంపాదన...

బ్లూమ్‌బర్గ్ సంస్థ తాజా అధ్యయనం ప్రకారం దేశంలోని 20 మంది బడా బాబులు ఈ ఏడాది తొలి ఏడు నెలల కాలంలో ఉమ్మడిగా దాదాపు రూ.3,32,637 కోట్ల మేర సంపదను తమతమ ఖాతాల్లోకి చేర్చుకున్నారు. దీంతో వీరి మొత్తం సంపద విలువ దాదాపు 200 బిలియన్ డాలర్లకు అంటే దాదాపు రూ.13,30,550 కోట్లకు చేరింది. దాదాపు 2 ట్రిలియన్ డాలర్ల విలువైన మన దేశ జీడీపీకి ఇది దాదాపు 10 శాతానికి సమానం. బ్లూమ్‌బర్గ్ సంస్థ దేశంలోని బిలియనీర్ల సూచీ విశ్లేషణ ప్రకారం 2017 మొదటి ఏడు నెలల కాలంలో దేశంలోని 18 మంది ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒక్కొక్కరి సంపద (ప్రస్తుత మారకపు విలువ వద్ద) సగటున రూ.6,400 కోట్లు లేదా అంతకంటే ఎక్కువగానే పెరిగినట్లుగా తెలుస్తోంది. భారత బిలియనీర్లలో సన్ ఫార్మా దిలిప్ సంఘ్వీ తప్ప ముందువరుసలోని మిగతా అందరు కుబేరులు భారీగానే సొమ్మును వెనకేసుకున్నట్లుగా సంస్థ తన విశ్లేషణలో తెలిపింది.

తొమ్మిదేండ్ల గరిష్టానికి రిలయన్స్..

రిలయన్స్ సంస్థల అధినేత ముఖేష్ అంబానీ మొదటి ఏడు నెలల కాలంలో దాదాపు రూ.86,485 కోట్ల మేర సంపదను పెంచుకున్నారు. ముఖేష్‌కు తోడుగా ఇతర బిలియనీర్లయిన అదానీ గ్రూపునకు చెందిన గౌతమ్ అదానీ, విప్రో అజీమ్ ప్రేమ్‌జీ, డి-మార్ట్ సూపర్ మార్కెట్స్ అధినేత ఆర్.కె.దామనీల సంపద దాదాపు రూ.19,958-26,611 కోట్ల (3-4 బిలియన్ డాలర్ల) మేర పెరిగినట్లుగా బ్లూమ్‌బర్గ్ సమాచార విశ్లేషణ తెలిపింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు తొమ్మిదేండ్ల గరిష్ట స్థాయిలో నమోదవుతూ వస్తున్నాయి. దీంతో సంస్థ మార్కెట్ విలువ దాదాపు రూ.5,25,000 కోట్లకు చేరింది. రిలయన్స్ సంస్థ జియో పేరుతో టెలికాం సేవలను విజయవంతంగా ప్రారంభించడంతో పాటు మేటి కంపెనీల సరసన నిలిచిపోవడంతో గ్రూపు నమ్మకం బాగా పెరిగిందని.. దీనికి తోడు రిలయన్స్ రిటైల్ వ్యాపారం కూడా అనూహ్యంగా మెరుగైన ఆర్థిక వృద్ధిని కనబరచడం కంపెనీకి బాగా కలిసి వచ్చిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

అజేయంగా ప్రేమ్‌జీ ప్రస్థానం..

ప్రముఖ బిలియనీర్ అజీమ్ ప్రేమ్‌జీకి సొంత సంస్థతో పాటు ఆయన పెట్టుబడులు పెట్టిన ఇతర సంస్థలు కూడా మార్కెట్లో మెరుగ్గా రాణించడం ఆయనకు బాగా కలిసి వచ్చింది. విప్రో ప్రమోటర్ అజీమ్ ప్రేమ్‌జీ ఐసీఐసీఐ ప్రూ లైఫ్ ఇన్సూరెన్స్ (4% వాటా), ఎన్‌సీసీ (2.47%), జూబిలియంట్ ఫుడ్ వర్క్స్ (2.32%), స్కిండ్లర్ ఎలక్ట్రిక్ (2.01%), క్రాంప్టన్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ (1.53%), జేఎం ఫైనాన్షియల్ (2.40%) సంస్థలందు వాటాను కలిగి ఉన్నారు. ఈ సంస్థలు మెరుగ్గా రాణించడంతో ఈ ఏడాది మొదటి ఏడు నెలల కాలంలో ఆయన సంపద దాదాపు రూ.25,280 కోట్ల మేర పెరిగి రూ.10,64,44 కోట్లకు చేరింది.

అనూహ్యంగా దూసుకొచ్చిన దామనీ...

మరోవైపు ఈ ఏడాది మార్చిలో లిస్టింగ్‌కు వచ్చిన డి-మార్ట్ సూపర్ మార్ట్స్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ స్టాక్స్ మార్కెట్లో 205 శాతం మేర పెరిగాయి. దీంతో ఆ సంస్థ అధినేత రాధాకృష్ణ దామనీ సంపద రూ.23,018 కోట్ల మేర పెరిగి రూ.35,658 కోట్లకు చేరింది.

కనిష్టంగా వృద్ధి రూ.13,000 కోట్లపై మాటే...

కోటక్ మహీంద్రా బ్యాంకు అధినేత ఉదయ్ కోటక్ సంపద రూ.21,421 కోట్ల డాలర్ల మేర పెరిగి రూ.68,523 కోట్లకు పెరిగింది. కోటక్ మహీంద్రా బ్యాంకును యాక్సిస్ బ్యాంకుతో విలీనం చేయనున్నారన్న వదంతులు వినిపించినప్పటికీ ఈ వార్తను రెండు సంస్థలు ఖండించిన సంగతి తెలిసిందే.

ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన కుమార మంగళం బిర్లా సంపద ఈ ఏడాది మొదటి ఏడు నెలల కాలంలో దాదాపు రూ.20,823 కోట్ల మేర పెరిగి రూ.60,280 కోట్లకు చేరింది. ఆదిత్యా బిర్లా గ్రూపు సంస్థ ఐడియా సెల్యులార్ సంస్థను వొడాఫోన్‌లో విలీనం చేసే అంశం కంపెనీకి బాగా కలిసి వచ్చింది. ఈ ప్రక్రియ వచ్చే మార్చి నాటికి పూర్తి కానుంది. జైడస్ క్యాడిలా సంస్థ అధినేత పంకజ్ పటేల్, ఐషర్ మోటార్స్ విక్రమ్ లాల్, యార్సెలార్ మిట్టల్ సంస్థ అధినేత లక్ష్మి మిట్టల్, డీఎల్ఎఫ్ సంస్థ కె.పి.సింగ్, పిరమల్ గ్రూపు అధినేత అజయ్ పిరమల్, షాపూర్‌జీ ఫలోంజీ గ్రూపు వ్యవస్థాపకులు ఫలోంజీ మిస్త్రీలు కనిష్టంగా దాదాపు రూ.13,305 కోట్ల మేర సంపదను పెంచుకున్నారు.

2017 మొదటి ఏడు నెలల కాలంలో పెరిగిన పది మంది కుబేరుల సంపద..

	పేరు	వ్యాపారం	పెరిగిన సంపద
1	ముఖేశ్ అంబానీ	చమురు టెలికాం	రూ. 89,679 కోట్లు
2	గౌతమ్ అదానీ	మౌళికం, పరిశ్రమలు	రూ. 27,941 కోట్లు
3	అజీమ్ ప్రేమ్‌జీ	టెక్నాలజీ	రూ. 25,280 కోట్లు
4	ఆర్.కె.దామని	రిటైల్	రూ. 23,018 కోట్లు
5	ఉదయ్ కోటక్	ఆర్థిక సేవలు	రూ. 21,421 కోట్లు
6	కుమార మంగళం బిర్లా	పరిశ్రమలు	రూ. 20,823 కోట్లు
7	పంకజ్ పటేల్	ఆరోగ్య సంరక్షణ	రూ. 16,964 కోట్లు
8	విక్రమ్ లాల్	పరిశ్రమలు	రూ. 14,636 కోట్లు
9	లక్ష్మి మిట్టల్	పరిశ్రమలు	రూ. 14,503 కోట్లు
10	ఫలోంజి మిస్త్రీ	స్థిరాస్తి, పరిశ్రమలు	రూ. 12,839 కోట్లు

ఇసుకమాఫియాకు సర్కార్ అండ

అడ్డుకుంటే దమనకాండ

- అరెస్టు చేసిన అరుణోదయ కార్యకర్తలను విడుదల చేయాలి: సీపీఐ(ఎం), వివిధ సంస్థల నేతల డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇసుక మాఫియాకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని సీపీఐ(ఎం), వివిధ ప్రజాసంఘాల నేతలు విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం దమనకాండ సాగిస్తున్నదని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధం పెడుతున్నదని అన్నారు. సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో మాదిరి సిద్దిపేట జిల్లా తాళ్లపల్లిలో కూడా ఇసుకమాఫియాను ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఈ దందా గురించి తెలుసుకునేందుకు కూడవెళ్లికి వెళ్లిన అరుణోదయ, రైతుకూలీసంఘం కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిని కనపడనీయకుండా దాచిపెట్టడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై అక్రమ కేసులు పెట్టే అవకాశం ఉందని అన్నారు. నేరెళ్లలో దళితులపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించినట్టుగా వారిపైనా చేస్తారా అని ప్రశ్నించారు. వారిని ఎక్కడికి తీసుకెళ్లింది కూడా ఇంతవరకు పోలీసులు చెప్పడం లేదని, వారిని వెంటనే భేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో అరుణోదయ, రైతుకూలీసంఘానికి చెందిన మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరితో పాటు మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామం నుండి అక్రమంగా కొంతమంది ఇసుకను తరలిస్తున్నారు. దీనిని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోవడం లేదు. విషయం తెలుసుకునేందుకు గ్రామస్తులతో సమావేశమైన ఆ నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని ఎక్కడికి తీసుకెళ్లిందన్న ఏ విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో అరుణోదయ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విలేకరుల సమావేశం జరిగింది. దీనికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేశ్, విప్లవ రచయితల సంఘం వరవరరావు, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, టఫ్ అధ్యక్షులు విమలక్క, నల్లమాస కృష్ణ, భీంభరత్, భైరాగి మోహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పచ్చి ఫాసిస్టు పాలన సాగిస్తున్నారని అన్నారు. నిర్బంధం ఎంత ప్రయోగిస్తే అంతకంటే ఎక్కువగా ప్రజా ఉద్యమాలు ఎగిసిపడతాయనేది ముఖ్యమంత్రి తెలుసుకోవాలన్నారు. శృతి, సాగర్ ఎన్‌కౌంటర్ నుండి ఇప్పటి అక్రమ అరెస్టులను పరిశీలిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవరి ఎజెండాను అమలు చేస్తున్నారన్నది తెలుస్తోందని వరవరరావు అన్నారు. నక్సలైట్ల ఎజెండా ఏమైందని ప్రశ్నించారు. పోలీసుల రాజ్యం నడుస్తున్నదన్నారు. విశ్వేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతుందన్నారు. విమలక్క మాట్లాడుతూ అరెస్టు చేసిన వారిని వెంటనే భేషరత్తుగా విడుదల చేయాలని కోరారు. ప్రజలకు అండగా ఉంటూ పోరాటం చేస్తున్న వారిని అరెస్టు చేయడమే పనిగా ప్రభుత్వం పెట్టుకుందన్నారు. బాల మల్లేశ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు.

రేపు నేరెళ్లకు కవుల యాత్ర

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేరెళ్ల ఘటనపైన కవుల యాత్ర నిర్వహించనున్నట్టు భూపతి వెంకటేశ్వర్లు (తెలంగాణ సాహితి) తెలిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నేరెళ్లకు బస్సు దేలుతుందని తెలిపారు.

'గూండాయిజం'లో గూడుపుఠాణి

పోలీసుల చేత చావు పరిచయం చేయబడిన బహుజనులపైనే 'గూండాయిజం'..అనే తీవ్రాతి తీవ్ర పద ప్రయోగంలోని మర్మమేంటీ? దాని వెనుక గూడుపుఠాణి ఏంటీ? షార్టుగా, షార్టుగా చెప్పుకోవాలంటే..ఇసుక మాఫియాలోని అసలు సిసలైన ఫలానా వారిని 'సంతోష'పెట్టడానికి కమ్ ఇంకెట్లా దంచాలన్నదానిపై పోలీసులు సరికొత్త ఐడియాలు కనిపెట్టుకోడానికేనా..?

వారిని 'సంతోష' పెట్టడానికేనా ఆ వ్యాఖ్య

- కుమారుడికి మించిన కటువైన వైఖరి
- పోలీసులు దయతల్చితే తప్ప.. పొల్లు పొల్లు దంచుడే
- ఇసుక అయిపోయేదాకా ఇక ఇంతే
- జారుడు బండపై పాలకుల గౌరవాభిమానాలు..
- మానేరు వాగులో ప్రభుత్వ ప్రతిష్ట మునక

ఇల్లెందుల దుర్గాప్రసాద్





(ఫైల్)

తనయుడు కేటీఆర్ తొందరపడ్డారు..తండ్రి కేసీఆర్ సరిచేస్తారు..బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు ప్రకటిస్తారు..బాధితులకు సాంత్వన చేకూరుస్తారు..అందరి మెప్పు పొందేలా కరుణారసం పారిస్తారు..జాతీయ స్థాయికి చేరిన ఈ వివాదానికి తద్వారా చక్కటి ముగింపు పలుకుతారు..కాసేపట్లో జరిగే ప్రెస్ కాన్ఫరెన్సులో అదే ధ్వనిస్తుంది..అని తెలంగాణ సమాజం గెస్ చేసింది. కానీ, అనూహ్యంగా మంత్రికంటే కఠినాతి కఠినంగా, ఎవరూ అంచనా వేయనంతటి కటువుగా సీఎం రియాక్టయ్యారు. 'చంపింది మేలు, చావకుండా బతకకుండా చేశారు..చావు నోట్లో కుక్కి మళ్లీ బయటకు లాగినంత పన్జేశారు..' అని యావత్ లోకమంతా బరువెక్కిన గుండెలతో చెప్పలేనంతగా జాలిపడిన ఆ ఎనమండుగురు బహుజనులనే గూండాలుగా కేసీఆర్ సంబోధించడంతో ముక్కున వేలేసుకొన్నది.

అంతానికి 'అంతం'లేదా?

నివ్వెరపర్చిన నేరెళ్ల ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆలస్యంగా నోరు విప్పారు. అది కూడా..'కాంగ్రెసోళ్లు నెత్తురు పారిస్తే.. మేం నీళ్లు పారిస్తున్నాం..' అంటూ ఫీల్డులోని స్థితిగతులకు/బర్నింగ్ టాపిక్‌కు భిన్నంగా స్పందించారు. సమస్యకు దగ్గరి పరిష్కారం చూపని సందర్భ రహితంగా మెదిలారు. బాధితులకు బాసటగా నిలువాల్సింది పోయి మంత్రి మరీ ఇలాగా మాట్లాడేదీ? అని అనేక మంది పెదవి విరిచారు. పోలీసుల చేత చావు పరిచయం చేయబడిన ఎస్సీ, బీసీలు, వారికి అండగా నిలిచిన ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఎవరూ నచ్చని, మెచ్చని విధంగా కేటీ రామారావు వ్యవహరించారు. అయితే ముఖ్యమంత్రి మాత్రం నష్ట నివారణకు పూనుకుంటారని చాలా మంది భావించారు. కేటీఆర్ మాదిరిగా కాకుండా, ఆలోచించి సరైన ప్రకటన చేస్తారని ఆశించారు. తీరా కేటీఆరే కాస్త నయం అనుకునేట్టుగా, కేసీఆర్ ఆ అభాగ్యులపైనే ఉగ్రులయ్యారు. గూండాయిజం చేశారంటూ నయా హోదా కట్టబెట్టారు. తద్వారా సదరు పోలీసు ఆఫీసర్లనే పుణ్యాత్ములుగా సీఎం పరిగణించినట్టయింది. వాళ్లపై చర్యల్ని ప్రశ్నార్థకం చేశారు. అదే టైంలో జీవితాంతం కోలుకోలేని ఆ ఎస్సీ, బీసీలను అన్ని విధాలుగా ఆదుకునే అంశానికి ఆపద తెచ్చారు. అంతేనా, ఇకపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసుల దయతోనే ఎవరైనా బతకాలి అనుకునేంతటి అభద్రతా భావంలోకి నెట్టారు. ఇసుక లారీలు మనుషులను అంతమొందించడాలకు అంతం అనేది గ్యారెంటీ లేదనే సంకేతాలు విసిరారు. ఇసుక లారీలు ఇంకా ఎవరినైనా హతమారిస్తే..'ఇది తమ ఖర్మ, ప్రాప్తం, బాకీ, తలరాత..' అనే వేదాంతంలోకి పోవాలి తప్ప..ప్రశ్నిస్తే మాత్రం పొల్లు పొల్లు దంచడానికి పోలీసులు తయారుగా ఉంటారనే సిగ్నల్స్‌ను ఉనికిలోకి తెచ్చారు.

ఇసుక నిలువలు అయిపోయేదాకా ఇక ఇంతే..అన్నట్టుగా ఒక భయంకరమైన వాతావరణాన్ని 'పెద్ద గద్దె'పై కూసుండి ఒకే ఒక్క మాటతో సృష్టించారు. దరిమిలా మానేరు వాగులో ప్రభుత్వ ప్రతిష్ట మునుగుతున్నది. మొత్తంగా పాలకులు గౌరవాభిమానాలను జారుడు బండపై వదిలేసుకున్నారు. బడుగూ బలహీన వర్గాల వారిలో ఆలోచన రేకెత్తిస్తున్నారు.

రాజీవ్ రహదారిపై ఆ రోజు రాత్రి..

దినాం సగటున 1,500 లారీలు ఇసుకను తరలిస్తున్నాయి. వీటిలో దొంగవీ, దొరవీ ఎన్ని అనేది కాస్త పక్కన బెడితే..వాటి సంఖ్య తరిగేలా లేదు. పైగా మోఖా బట్టి 'రూటు' మార్చుతుంటారు. అంతే తప్ప నియంత్రణ, నిజాయితీలకు నిలువ నీడ లేదు. కొదురుపాక, చింతల్‌ఠాణా రీచ్‌ల నుంచి హైదరాబాద్ దాకా ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. రేయింబవళ్లూ సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డు సహా రాజీవ్‌రహదారిపై రాజ్యమేలుతాయి. వేగంపై అదుపు ఉండదు. బ్రీత్ ఎనలైజర్లకు దిక్కే లేదు. ఓవర్‌లోడుల లెక్కలకు బొక్కే. కాబట్టి..ఇసుక లారీల ఉరుకులాటకు పగ్గాలే లేవు.

"సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఆ మధ్య ఒక రోజు రాత్రి కారు సడెన్‌గా ట్రబుల్ ఇచ్చింది. రోడ్డు దించి చెక్ చేస్తున్నాను. వరుసగా ఇసుక లారీలు మీద మీదకు వస్తున్నంత స్పీడుగా పోతున్నాయి. నేను స్వతహాగా ఎంత ధైర్యస్తుడినో తెలుసు కదా. అయినా ఆ నైటు ఎంతో భయమేసింది. మెకానిక్ వచ్చి చూసినా కారు స్టార్ట్ కాలేదు. చివరికి అతనిచ్చిన బైకుపై రాత్రి 11.30 సమయంలో వస్తుంటే..శాండ్ లారీల మతి లేని వేగం వణికించింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సిటీలోని ఇల్లు చేరాను.." అంటూ స్వయానా కేసీఆర్, కేటీఆర్‌ల బంధువైన టీఆర్ఎస్ నాయకుడు ఒకరు 'నవతెలంగాణ' ప్రత్యేక ప్రతినిధికి ఇసుక లారీల ఆగడాలపై తన చేదు అనుభవాన్ని షేర్ చేయడం ప్రస్తావనార్హం.

ఇసుక లారీలకు మరో ఇద్దరు బలి

- ఆరుగురికి గాయాలు.. ఒకేరోజు మూడు ప్రమాదాలు
- రాజన్నసిరిసిల్ల జిల్లాలోనే రెండు ఘటనలు



నవతెలంగాణ-ఇల్లంతకుంట/సుల్తానాబాద్

ఇసుక లారీలకు మరో ఇద్దరు బలయ్యారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఒకే మండలంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇసుక టిప్పర్లు ఢీకొని బీహార్‌కు చెందిన కార్మికుడు మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మండలంలో కోళ్ల వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నేరెళ్ల ఘటన చల్లారకముందే ఇసుక లారీలు ఢీకొని మృతిచెందడం పట్ల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లి వద్ద కాళేశ్వరం పదో ఫేజ్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అనంతసాగర్ ప్రాజెక్టు కంపెనీలో బీహార్ రాష్ట్రానికి చెందిన సద్దాం అన్సారి (19) పనిచేస్తున్నాడు. కంపెనీ ఆరుబయట శుక్రవారం ఉదయం నిద్రిస్తున్న అతని పైనుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి కంపెనీ యాజమాన్యం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సుమారు 150 మంది కార్మికులు ఆందోళనకు దిగారు. రెండుగంటల పాటు ఆందోళన కొనసాగించడంతో యాజమాన్యం దిగొచ్చి ఆదుకుంటామని హామీనిచ్చింది. ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన కూనవేని బాలవ్వ, కొలిపాక మణెవ్వ, బండిపెల్లి బూదవ్వ, పిల్లి కనుకవ్వ, కొలిపక నీరజ, సుదగోణ నర్సవ్వ, ఒగ్గర రేణు, రెడ్డి రమలు వ్యవసాయ కూలీలు. వేరే గ్రామానికి ఆటోలో వెళ్తుండగా అనంతగిరి కమాన్ వద్ద ఇసుక టిప్పర్ వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న బండిపెల్లి బూదవ్వ, కూనవేని రాజమల్లు, కూనవేని బాలవ్వ, కొలిపాక మణెవ్వలను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులను మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట గ్రామానికి చెందిన రియాజ్(42) ఫౌల్ట్రీ ఫాం వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. లక్షెట్టిపేట నుంచి వ్యాన్‌లో కోళ్లను నింపుకుని ఇద్దరు కూలీలతో సహా వెళ్తున్నాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి గ్రామ శివారులో గల కోళ్లఫాం సమీపంలో వ్యాన్‌ను పార్కింగ్ చేశాడు. అదే సమయంలో ఇసుక లారీ వేగంగా దూసుకొచ్చి వ్యాన్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్ రియాజ్ అక్కడికక్కడే మృతచెందాడు. ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయకపోతే సిరిసిల్లను దిగ్బంధిస్తాం

- బాధితులకు కార్పొరేట్ వైద్యసేవలందించాలి
- కుటుంబానికో ఉద్యోగం.. ఒక్కొక్కరికీ రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : బాధితులను పరామర్శించిన టీటీడీపీ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-వేములవాడ/జన్నారం

నేరెళ్ల ఘటనలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన బాధితులకు ఈనెల 15లోపు ప్రభుత్వం న్యాయం చేయకపోతే సిరిసిల్లను దిగ్బంధిస్తామని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనగందుల రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు హెచ్చరించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేరెళ్ల బాధితులను శుక్రవారం వారు పరామర్శించారు. బాధితులకు పార్టీ తరపున ఒక్కొక్కరికీ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం పట్టణంలోని ఆరేటి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఇసుక మాఫియాను పోషిస్తూ లారీలను జనంపై తోలుతున్నదని ఆరోపించారు. ఇసుక లారీల వల్ల ఇప్పటి వరకు 22 మంది చనిపోయారని, అసలు ఆ వాహనాలు ఎవరి కోసం నడుస్తున్నాయని ప్రశ్నించారు. చనిపోయిన ప్రతి ఒక్క కుటుంబానికీ రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 13 ఏండ్ల నుంచి ప్రజాప్రతినిధిగా ఉంటున్నానని, ఎన్నడూ ఇలాంటి దుస్థితిని చూడలేదన్నారు. 'పేదలను అణచివేసి ఇసుక రవాణా ద్వారా రూ.కోట్లు సంపాదిస్తావా..? ఇదేం పద్ధతి ముఖ్యమంత్రి?' అని ప్రశ్నించారు. నేరెళ్ల బాధితులను చితకబాదుతూ వారి ఒంటిపై వేడినీరు పోస్తూ థర్డ్‌డిగ్రీ ప్రయోగించారని బాధితులు చెప్తుంటే కన్నీళ్లు ఆగలేదన్నారు. జిల్లా ఎస్పీ టీఆర్ఎస్‌కు బానిసగా పనిచేస్తున్నాడని ఆరోపించారు. నేరెళ్ల ఘటనలో ఎస్పీ నుంచి కానిస్టేబుల్ వరకు అందరినీ సస్పెండ్ చేయాలని ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, శోభారాణి, విజయరామారావు, వేములవాడ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జన్నారంలో టీడీపీ నాయకుల అరెస్టు

నేరెళ్ల బాధితులను పరామర్శించేందుకు మంచిర్యాల జిల్లా జన్నారం మండల టీడీపీ నాయకులు బయల్దేరగా.. స్థానిక ఎస్సై రమేష్ వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో టీడీపీ జన్నారం మండలాధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు లక్ష్మణ్, గంగన్న ఉన్నారు.

మీ ఫోన్‌లో డ్యుయల్ సిమ్ ఉందా?




డ్యుయల్ సిమ్ కనెక్టువిటీతో వస్తోన్న స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ప్రతిఒక్కరి చేతిలోనూ కనిపిస్తోంది. ఒక సిమ్‌ను డేటా కోసం మరొక సిమ్‌ను కాల్స్ కోసం ఉపయోగిస్తూ.. నయా ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. అయితే సింగిల్ సిమ్ ఫోన్‌లతో పోలిస్తే డ్యుయల్ సిమ్ ఫోన్‌లు చాలా ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- డ్యుయల్ సిమ్ వల్ల రేడియేషన్ లెవల్స్ ఎక్కువై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- డ్యుయల్ సిమ్ స్మార్ట్‌ఫోన్ సెల్‌ఫోన్ టవర్స్‌తో కమ్యూనికేషన్ అయ్యే సమయంలో రేడియో ఫ్రీక్వెన్సీ రేడియేషన్ భారీస్థాయిలో వెలువడుతుంది. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- ఫోన్ సిగ్నల్స్ ద్వారా వెలువడే రేడియేషన్ వల్ల మనిషిని అనేక రోగాలు చుట్టుముడతాయి. ముఖ్యంగా మగవారిలో వీర్యకణాల సంఖ్య తగ్గిపోయి, సంతాన లేమి సమస్య పెరుగుతుంది.
- స్మార్ట్‌ఫోన్ ఎప్పుడు చేతిలో ఉంచుకునే వారు నిద్రలోనూ బెడ్‌పైనే పెట్టుకోవడం డ్యుయల్‌నిద్రలో పక్కన పెట్టుకోవడం వల్ల కూడా రేడీయేషన్ దెబ్బకి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
- డ్యుయల్ సిమ్ స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేసే ముందకు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవటం ఉత్తమం.

అడోబ్ ఫ్లాష్‌కు గుడ్‌బై!



అడోబ్ ఫ్లాష్ ప్లేయర్... కంప్యూటర్ వినియోగదారులకు బాగా తెలిసిన సాఫ్ట్‌వేర్. వీడియో గేమ్స్ ఆడేవారికి ప్రియమైన సాఫ్ట్‌వేర్. 2020 నాటికల్లా ఫ్లాష్ ప్లేయర్ ప్లగిన్ అప్‌డేట్స్ నిలిపేయడంతో పాటు డిస్ట్రిబ్యూషన్ కూడా ఆపేస్తామని అడోబ్ ప్రకటించింది. ఇటీవల గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ వంటి బ్రౌజర్లు ఫ్లాష్‌ను ఎక్కువగా ఉపయోగించడం లేదు. ఫ్లాష్‌కు ప్రత్యామ్నాయంగా హెచ్‌టీఎమ్ఎల్5ను ఎక్కువగా వినియోగిస్తున్నారు.



ట్రూకాలర్ + గూగుల్ డ్యుయో ..

లీడింగ్ కమ్యూనికేషన్ ఆప్ ట్రూకాలర్.. వీడియో కాలింగ్ కోసం గూగుల్ డ్యుయోను ఉపయోగించుకుంటుంది. ఇకపై నేరుగా ట్రూకాలర్ ద్వారా వీడియో కాలింగ్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫ్లామ్‌లపై ఇది పనిచేస్తుంది. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా 25 కోట్ల మంది ట్రూకాలర్ వినియోగదారులకు వీడియో కాల్స్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

11
హైదరాబాద్
శనివారం 5-8-2017
www.navatelangana.com
టెక్‌ప్లస్
నవతెలంగాణ



డిజిటల్ స్టోరేజ్ - ఫైల్ ఫార్మాట్స్

ప్రస్తుతం ఆధునికయుగంలో అంతా డిజిటల్ మయం. రోజువారీ కార్యకలాపాల్లో కంప్యూటర్ వచ్చి చేరడంతో అన్ని రకాల సమాచారాన్ని కంప్యూటర్‌లోనే స్టోర్ చేస్తున్నాం. పర్సనల్ డేటా మొదలుకొని అంతర్జాతీయస్థాయి వరకు అన్ని రకాల సమాచారం డిజిటల్ స్టోరేజ్‌గా మార్చబడుతుంది. మరి ఈ సమాచారాన్ని ఎన్ని విధాలుగా స్టోర్ చేయవచ్చో.. ఎలాంటి ఫైల్ ఫార్మాట్స్ ఉన్నాయో తెలుసుకుంటే డేటాను స్టోర్ చేయడం సులభం అవుతుంది. doc, mp3, pdf ఇలా రకరకాల ఫైల్ ఫార్మాట్స్ ను ప్రస్తుతం చాలా విరివిగా ఉపయోగిస్తున్నాం. టెక్ట్స్ ఫైల్స్, ఫొటోలు, వీడియోలు స్టోర్ చేయడానికి వేరువేరు ఫైల్ ఫార్మాట్స్‌ను ఉపయోగించాలి. విస్తృతంగా వినియోగంలో ఉన్న రకరకాల ఫైల్ ఫార్మాట్స్, అలానే వాటి ప్రత్యేకతలను తెలుసుకుంటే డేటా స్టోరేజ్ ఇక ఈజీ.

డిజిటల్ స్టోరేజ్ మీడియమ్‌లో సమాచారాన్ని భద్రపరిచే ఫైల్ ఫార్మాట్స్ అనేవి స్టాండర్డ్‌గా ఉంటాయి. అందుబాటులో ఉన్న సమాచారాన్ని బట్టి ఆయా ఫార్మాట్స్ లలో వాటిని స్టోర్ చేసినప్పుడే తిరిగి వాటిని బ్యాకప్ చేసుకోవడం సులభం అవుతుంది. ప్రతి ఫైల్ ఫార్మాట్స్ ఒక్కొక్క రకరమైన ప్రోగ్రామింగ్‌లో తయారుచేస్తారు. చాలా సార్లు కొన్ని ఫైల్స్ ఇతర ఫార్మాట్స్ లలో ఓపెన్ కావు. వాటికి సంబంధించిన ప్రోగ్రామింగ్ ఉన్నప్పుడే ఆ ఫైల్స్ ఓపెన్ అవుతాయి. సింపుల్‌గా చెప్పాలంటే File Format అనేది ఒక ఫైల్‌కు సంబంధించిన లేఅవుట్. ఈ ఫైల్‌లో ముందుగా డిజైన్ చేసిన దాని ప్రకారం డేటా ఒక క్రమపద్ధతిలో ఆర్గనైజ్ చేయబడి ఉంటుంది. ఒక్కో ఫైల్ ఫార్మాట్ ఒక్కొరకమైన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌ను కలిగి ఉంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ ఆధారంగానే డేటాను గుర్తించి యాక్సెస్ చేసుకోగలుగుతాం.

JPG : JPGఅనేది ఫోటో ఫైల్ ఫార్మాట్. ఈ ఫార్మాట్‌లో ఫోటోలను సేవ్ చేసుకోవటంతో పాటు ఇతర ఫైల్ ఫార్మాట్‌లలోని ఫోటోలను JPGలోకి కన్వర్ట్ చేసుకోవచ్చు. ఈ ఫార్మాట్‌లో ఫోటోలను మరింత బెటర్ క్వాలిటీతో కంప్రెస్ చేసుకోవచ్చు. ఫోటోలోని టోన్ అలానే కలర్‌కు స్మూత్ వేరియేషన్స్‌ను JPG ఫార్మాట్ అద్దుతుంది. ఫొటోను సేవ్ అన్నప్పుడు files of type అని అడుగుతుంది. అప్పుడు JPGను సెలక్ట్ చేసుకోవాలి. ఈ ఫార్మాట్‌లో ఫొటోలు ఇతర మెయిల్‌కు పంపించడం, వాట్సాప్‌లో అప్‌లోడ్ చేయడం సులభం అవుతుంది.

Doc : డాక్యుమెంట్ ఫైల్ ఫార్మాట్‌ను మైక్రోసాఫ్ట్ వర్డ్‌లో ఉపయోగిస్తున్నారు. ఈ ఫైల్ ఫార్మాట్‌లో ఫార్మాట్ చేయబడి టెక్ట్స్, ఇమేజెస్, టేబుల్స్, గ్రాఫిక్స్, చార్ట్స్, పేజ్ ఫార్మాటింగ్, ప్రింట్ సెట్టింగ్స్ అందుబాటులో ఉంటాయి.

PDF : పోర్టబుల్ డాక్యుమెంట్ ఫార్మాట్‌నే షార్ట్‌కట్‌గా పీడిఎఫ్ అంటారు. ఈ ఫైల్ ఫార్మాట్‌లో ప్రింటెడ్ డాక్యుమెంట్‌కు అవసరమైన అన్నిరకాల ఎలిమెంట్స్‌ను కలిగి ఉంటుంది. టెక్ట్స్ ఫైల్స్ సేవ్ చేయడానికి ఇది మంచి ఫార్మాట్. ఇందులో సేవ్ చేసిన ఫైల్స్‌ను మెయిల్‌లో సేవ్ చేసుకుంటే ఎక్కడైనా చూడొచ్చు, ప్రింట్ తీసుకోవచ్చు. పుస్తక రచనలో ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది.

GIF : ఈ ఫైల్ ఫార్మాట్‌ను ఎక్కువుగా వెబ్ గ్రాఫిక్స్‌లో ఉపయోగిస్తున్నారు. కలర్స్‌ను బట్టి ఈ ఫైల్ సైజ్ ఆధారపడి ఉంటుంది. GIF ఫార్మాట్‌లో అనేక సీక్వెన్సులతో కూడిన యానిమేషన్ అందుబాటులో ఉంటుంది, పిక్సల్ బేసిడ్ ఫార్మాట్‌ను సేవ్ చేయాల్సి వచ్చినప్పుడు GIF ఫైల్ ఫార్మాట్‌ను వినియోగించుకోవాలి.

PNG : *JPG/GIF*ఫైల్ ఫార్మాట్స్‌కు ప్రత్యామ్నాయంగా కొన్ని రకాల ప్రోగ్రామింగ్‌లలోPNG ఫైల్ ఫార్మాట్‌ను వినియోగించడం జరుగుతోంది. ఫోటోలను క్రియేట్ చేసేందుకు ఈ ఫార్మాట్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. deflation అనే ప్రత్యేకమైన డేటా కంప్రెషన్ పద్ధతిని ఈ ఫైల్ ఫార్మాట్ ఉపయోగించుకుంటోంది. JPG ఫార్మాట్‌లో స్టోర్ చేసే ఫోటోలు కంటేPNG ఫార్మాట్‌లో స్టోర్ చేసే ఫోటోలు మరింత క్లారిటీగా ఉంటాయి.

MP3 : సంగీతాన్ని ఇష్టపడేవారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రోగ్రామింగ్ ఇది. స్మార్ట్ ఫోన్, టాబ్లెట్, లాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా సరే అందులో ఇష్టమైన పాటలను స్టోర్ చేసుకుంటారు. పాటలకు ఎక్కువ జిబీ వాడకుండా మ్యూజిక్ ఫైల్స్‌ను కంప్రెస్ చేసేందుకు అందరూ వినియోగిస్తున్న ఫైల్ ఫార్మాట్ ఇది. ***MP3 (MPEG-1 Audio Layer-***3) ఫైల్ ఫార్మాట్ ఒకటి. ఎంపీ3 ఫార్మాట్‌లో భాగంగా పెద్దపెద్ద ఆడియో ఫైల్స్‌ను సైతం తక్కువ జిబీ ఫైల్స్‌గా కంప్రెస్ చేసుకోవచ్చు. సౌండ్ క్వాలిటీ ఏ మాత్రం తగ్గకుండా వీటిని స్టోర్ చేసుకోవచ్చు. అదే సమయంలో సౌండ్ క్వాలిటీ తగ్గకుండా చూసుకోవచ్చు. మూవింగ్ పిక్షర్ ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ ***MP***3ని డెవలప్ చేసి.. వెలుగులోకి తీసుకువచ్చింది.



MP4 : *MP3* లో ఆడియో మాత్రమే స్టోర్ చేసుకోవచ్చు. మరి వీడియో కూడా స్టోర్ చేసుకోవాలంటే MP4 ఫైల్ ఫార్మాట్‌లోనే సాధ్యమవుతుంది. ఇందులో ఆడియో, వీడియో డేటాను స్టోర్ చేసుకునే వీలుంటుంది. తక్కువ డేటాలోనే ఎక్కువ వీడియోలు స్టోర్ చేసుకోవచ్చు. ఈ ఫైల్ ఫార్మాట్‌ను ఉపయోగించే స్మార్ట్‌ఫోన్‌లలో సినిమాలు సైతం స్టోర్ చేస్తున్నారు.

Flac : ఫ్లాక్ (ఫ్రీ లాస్‌లెస్ ఆడియో కోడెక్ ఫైల్), ఈ ఓపెన్ సోర్స్ ఆడియో కంప్రెషన్ ఫార్మాట్ ద్వారా ఆడియో ఫైల్‌ను ఒరిజనల్ సైజ్ నుంచి మరింత తక్కువ సైజ్‌కు కంప్రెస్ చేసుకునే వీలుంటుంది.

ఇలా ఎన్నో రకాల ఫైల్ ఫార్మాట్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి డేటాకు ఏ ఫైల్ ఫార్మాట్ ఉపయోగించాలో తెలుసుకుంటే డేటా స్టోరేజీ అనేది సులభం అవుతుంది.

నయామాల్

స్మార్ట్‌లెన్స్



స్మార్ట్‌ఫోన్‌తో ప్రొఫెషనల్ ఫొటోలు తీయాలనుకునేవారికి శుభవార్త. మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన ఈ స్మార్ట్‌లెన్స్‌ను మీ స్మార్ట్‌ఫోన్‌కు అమర్చితే చాలు. . ప్రొఫెషనల్ ఫొటోలు తీయవచ్చు. ఈ స్మార్ట్‌లెన్స్‌లో మూడు రకాలుంటాయి. ఒకటి మాక్రోలెన్స్. చిన్న చిన్న వస్తువులను ఫొటో తీయడానికి ఈ లెన్స్ ఉపయోగపడుతాయి. ఇక రెండ్ రకం లెన్స్ వైడ్ యాంగిల్‌లో ఫొటోలు తీయడానికి అనువుగా ఉంటాయి. ఈ లెన్స్ కను చూపు మేర పరచుకుని ఉన్న ప్రక తి అందా లను మీ స్మార్ట్‌ఫోన్‌లో బంధించడానికి ఉపయోగ పడతాయి. మూడో రకం లెన్స్‌ను ఫిష్ ఐ లెన్స్‌గా పిలుస్తారు. 180 డిగ్రీల యాంగిల్‌లో దృశ్యాలను బంధించడానికి ఈ లెన్స్ ఉపక రిస్తాయి. ఈ లెన్స్ దాదాపు అన్ని స్మార్ట్‌ఫోన్లకూ సరిపోతాయి.

బ్లాక్‌బెర్రీ కొత్త స్మార్ట్‌ఫోన్

కెనడియన్ స్మార్ట్‌ఫోన్ మేకర్ బ్లాక్ బెర్రీ కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. లేటెస్ట్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టంతో వస్తున్న ఈ బ్లాక్‌బెర్రీ కీవన్ ఫీచర్లు. ఇలా ఉన్నాయి.

4.5 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే
1620 1080 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్
2 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్
ఆండ్రాయిడ్ 7.1.1 నూగట్,
3 జీబీ ర్యామ్, 32 జీబీ స్టోరేజ్, 256జీబీ వరకు ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్
12 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 8 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా
ఫింగర్‌ప్రింట్ సెన్సార్
3505 ఎంఏహెచ్ బ్యాటరీ, క్విక్ చార్జ్ 3.0



డియర్ రీడర్స్..

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి.

మా చిరునామా :

**'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్,
ప్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి,
హైదరాబాద్ - 500020.**

భూమ్మీద పెరిగిన మొట్టమొదటి మొక్క?

ప్రశ్న: ఈ భూమ్మీద పెరిగిన మొట్టమొదటి మొక్క పేరు ఏమిటి?

- కె విజయ,
కాటూరి పబ్లిక్ స్కూల్, గుంటూరు

జవాబు : ఈ భూమ్మీద మొట్టమొదటి మానవుడు, మొట్టమొదటి పావురము, మొట్టమొదటి గులాబి చెట్టు, మొట్టమొదటి పర్వతము అంటూ ఏమీ వుండవు. మీరు ఇదే ప్రశ్నను నన్ను 'మిమ్మల్ని రూపొందించిన మొట్టమొదటి పరమాణువు ఏది?' అంటే దానికి అర్థం లేదు. ఎందుకంటే ఈ భూమ్మీద అప్పటికే వివిధ పదార్థాల రూపంలో ఉన్న పరమాణువులే మా అమ్మా నాన్న శరీరంలో అండము, శుక్రకణం ఏర్పడ్డానికి దారితీశాయి. అవే ఫలదీకరణం చెందగా నేను ఓ జైగోట్ (సంయుక్త బీజకణం) రూపంలో ఏర్పడ్డాను. అదే సంయుక్త బీజకణం (zygote) ద్విదా విచ్ఛిత్తి, బహుదా విచ్ఛిత్తి చెంది ఆ కణంలో ఉన్న జన్యు సంకేతం (స్రవఅవ్ష షశీసవ) ప్రకారం మానవుడిగా పుంలింగా కృతిలో నా తల్లి గర్భం నుంచి శిశువుగా బయట పడ్డాను. కేవలం ఒక్క వ్యక్తి ఆవిర్భావంలోనే ఇంత పెద్ద తతంగం వుంటే సుమారు 450 కోట్ల పైచిలుకు చరిత్ర ఉన్న జీవకణం వృక్షంలాగా మారడానికి పట్టిన కోటానుకోట్ల సంవత్సరాలు నిడివిలో మరెంత సంక్లిష్టత ఉండాలి? భూమి పుట్టిన సుమారు 100 కోట్ల సంవత్సరాలకు భూమ్మీద సుముద్రాలు, అందులో వివిధ రకాల రసాయనాలు కరిగి జీవకణాభివృద్ధికి దోహదం చేసేలా సముద్రపు ద్రావణం రసాయనిక లక్షణాల్ని సంతరించుకుంది. ఈ మార్పులన్నీ గతితార్కిక పద్ధతిలో మాత్రమే జరిగాయి. పరిణామాభివృద్ధి జరుగుతూ క్రమేణా లవణీయత, ph, అణులాక్షణికత మారుతూ అదను వచ్చిన తడవుగా గుణాత్మక మార్పునకు లోనయ్యేలా ఆ అణువులుDNA లేదా RNAగా రూపొందాయి. వాటిపైన పేరుకొన్న కొవ్వు అణువులు కణత్వచం (cell membrane) గా మారాయి. అంటే ఆ విధంగా తొలిదశ జీవకణం ఏర్పడింది. అంటే అదేదో ఆస్ట్రేలియా దగ్గరో, భారత ఉపఖండంలోని బంగాళా ఖాతంలోనో మాత్రమే ఒకేచోట సంభవించినట్టుగా భావించ కూడదు.

నమ్మకాలు నిజాలు

భౌతిక పరిస్థితులు అనుకూలించగానే ప్రపంచ యావత్తూ అనువైన చోటనల్లా కొన్ని నిమిషాలు, లేదా గంటలు అటుయిటుగా జీవకణాలు ఏర్పడ్డాయి. అందులో కొన్నింటిలో మెగ్నీషియాన్ని బంధించుకొన్న క్లోరోఫిల్ బృహద ణువు (macro molecule) రూపొందింది. ఇందుకోసం కొన్ని లక్షల సంవత్సరాల మేరకు గతితార్కిక విధానంలో మార్పులు చేర్పులు జరిగాయి. క్రమేపీ ఆ కణాలు క్లామిడో మోనాస్, యూగ్లీవా వంటి ఏక కణ జీవులుగా మారాయి. అందులో క్లోరోఫిల్ ఉండడం వల్ల అవి తమ ఆహారాన్ని తామే కిరణజన్య సంయోగ క్రియ ద్వారా జరుపుకోగలిగాయి. ఇవే వృక్షజాతిగా పరిణమించాయి. మరికొన్ని క్లోరోఫిల్ ఏమీలేని అమీబాలాంటి కణాలుగా మారాయి. ఇవే జంతుజాతి జీవుల పరిణామానికి దారితీశాయి. కిరణ జన్య సంయోగ క్రియ జరుపుకోగల సత్తా ఉన్న జీవజాతినే వృక్షాలు అంటారు. కాబట్టి భూమ్మీద ఏర్పడిన తొలి మొక్క రూపాలు క్లోరోఫిల్, జాంతోఫిల్ వంటి వర్ణ ద్రవ్యాలను పొందుపరుచుకున్న జీవకణాలే ! వాటికి పేరులేదు.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక



నవతెలంగాణ ఆటలు

12 హైదరాబాద్

శనివారం 5 ఆగస్టు 2017



రవిచంద్రన్ అశ్విన్
54
(92 బంతుల్లో 5X4, 1X6)

10-2-38-2

సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో స్పిన్ తిరుగుతోంది. రెండో రోజే ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ అదరగొట్టేస్తున్నాడు. కొత్త బంతితోనే పదునైన టర్న్ సాధించేసిన అశ్విన్.. లంక ఓపెనర్లను పెవిలియన్‌కు చేర్చాడు. జడేజా, అశ్విన్‌ల మాయాజాలానికి నేడు శ్రీలంక ఏ మేరకు నిలబడుతుందనేది ప్రశ్నార్థకం!. ఇప్పటికే మాయ మొదలైన వేళ.. భారత్‌కు భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఊరిస్తోంది. కొలంబోపై కోహ్లిసేన పట్టు బిగిస్తోంది. రెండో రోజు లోయర్ ఆర్డర్ మెరుపులు లంకను ముంచెత్తగా.. టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో మరోసారి 600 ప్లస్ పరుగులు చేసింది. అశ్విన్, జడేజా, సాహాలు వరుసగా అర్థ సెంచరీలతో చెలరేగారు. పచ్చిక లేని పిచ్‌పై 622/9 వద్ద కోహ్లి డిక్లరేషన్ ప్రకటించాడు.

మాయ మొదలైంది!

అశ్విన్ దెబ్బకు శ్రీలంక బేజారు

ప్రస్తుతం శ్రీలంక 50/2

- అశ్విన్, జడేజా, సాహా అర్థ సెంచరీలు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 622/9 డిక్లేర్డ్
- శ్రీలంకతో రెండో టెస్టు రెండో రోజు



రవీంద్ర జడేజా
70 నాటౌట్
(85 బంతుల్లో 4X4, 3X6)

నవతెలంగాణ-కొలంబో

టీమ్ ఇండియా స్పిన్ మాయ మొదలైంది. శ్రీలంక పతనమూ అప్పుడే ఆరంభమైంది. టీమ్ ఇండియా ట్రంప్‌కార్డ్, ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ (2/38) రాణించటంతో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్లను కోల్పోయింది. 20 ఓవర్లలో 50 పరుగులే చేసిన శ్రీలంక... ఇంకా భారత్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 572 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. కెప్టెన్ దినేశ్ చండిమాల్ (8), కుశాల్ మెండిస్ (16)లు అజేయంగా క్రీజులో కొనసాగుతున్నారు. ఓవర్‌నైట్ సెంచరీ హీరోలు చటేశ్వర్ పుజారా (133, 232 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), అజింక్య రహానె (132, 222 బంతుల్లో 14 ఫోర్లు) రెండో రోజు త్వరగానే నిష్క్రమించినా.. లోయర్ ఆర్డర్ శ్రీలంకను అంత సులువగా వదల్లేదు. అశ్విన్ (54, 92 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (70 నాటౌట్, 85 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), వృద్ధిమాన్ సాహా (67, 134 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో చెలరేగారు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 622/9 పరుగుల భారీ స్కోరు సాధించింది. మూడో సెషన్‌లో వీలైనన్ని ఎక్కువ పరుగులు పిండు కున్న అనంతరం.. కోహ్లి డిక్లరేషన్ ప్రకటించాడు. పిచ్‌లో మార్పు లేకపోయినా.. అశ్విన్, జడేజాలు వైవిధ్యమైన బంతులతో విరుచు కుపడుతుండటంతో నేడు శ్రీలంక స్పిన్‌ను ఎదుర్కోవటం ఆసక్తి కరం. స్పిన్ ద్వయం మెరిస్తే.. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే పరిమితమయ్యే అవకాశం ఉన్నది.

అశ్విన్ అదిరెన్ : మూడో సెషన్‌లో శ్రీలంకను బ్యాటింగ్‌ను ఆహ్వానించిన కోహ్లిసేన.. ఇన్నింగ్స్ మెదలవగానే స్పిన్ మాయ మొదలెట్టేసింది. కొత్త బంతితో మరో ఎండ్ నుంచి స్పిన్ దాడి మొదలెట్టిన అశ్విన్.. అత్యంత చెత్త బంతితో తొలి వికెట్‌ను కూల్చటం విశేషం. ఇన్నింగ్స్ రెండో ఓవర్ ఆఖరి బంతికి ఉపుల్ తరంగ (0) షార్ట్ లెగ్‌లో పొంచి ఉన్న లోకేశ్ రాహుల్ చేతికి చిక్కాడు. అప్రయత్నంగానే క్యాచ్‌ను ఒడిసిపట్టేసిన రాహుల్.. కెప్టెన్ కోహ్లితో కలిసి వినూత్న శైలిలో వికెట్ సంబురాన్ని చేసుకున్నాడు. దీంతో పరుగుల ఖాతా తెరవకుండానే శ్రీలంక వికెట్ల పతనం మొదలైంది. ఇక ఇన్నింగ్స్ 13.4 ఓవర్‌లో అశ్విన్ మరోసారి మాయ చేశాడు. మరో ఓపెనర్ కరుణరత్నె (25)ను స్లిప్స్‌లో రహానె ద్వారా వెనక్కి పంపాడు. అవుట్‌సైడ్ ఎడ్జ్‌తో కరుణరత్నె స్లిప్స్‌లో రహానె చేతికి చిక్కాడు. దీంతో 33 పరుగుల వద్ద శ్రీలంక రెండో వికెట్ కోల్పోయింది. మూడో స్థానంలో వచ్చిన కుశాల్ మెండిస్ (16 నాటౌట్, 48 బంతుల్లో 3 ఫోర్లు), కెప్టెన్ దినేశ్ చండిమాల్ (8, 21 బంతుల్లో 1 సిక్స్) మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించారు. భారత్ బ్యాటింగ్ చేసిన సమయానికి, శ్రీలంక ఇన్నింగ్స్‌కూ పిచ్‌లో తేడా లేదు. కానీ లెంగ్త్‌లో వైవిధ్యం చూపించిన అశ్విన్.. శ్రీలంకను కష్టాల్లోకి నెట్టాడు. వీలైనన్ని డాట్ బాల్స్‌తో జడేజా లంకేయులపై ఒత్తిడి పెంచగలిగాడు.

అర్థ శతక త్రయం : ఓవర్‌నైట్ స్కోరు 344/3తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ మరోసారి భారీ స్కోరు సాధించింది. ఈ ఏడాదిలో ఏకంగా ఆరోసారి 600 ప్లస్ పరుగులు నమోదు చేసి ఔరా అనిపించింది. సెంచరీ హీరోలు పుజారా (133), రహానె (132) లంచ్‌లోపే వికెట్లు కోల్పోయారు. దీంతో భారీ స్కోరు ఆశలు కాస్త సన్నగిల్లాయి. కానీ లోయర్ ఆర్డర్‌లో అశ్విన్, సాహా, జడేజాలు చెలరేగటంతో శ్రీలంక కష్టాలు రెట్టింపయ్యాయి. అశ్విన్ ఐదు ఫోర్లు, ఓ సిక్స్‌తో 91 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించగా, వృద్ధిమాన్ సాహా 113 బంతుల్లో 50 మార్క్ చేరుకున్నాడు. అశ్విన్, సాహాలు 38 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పగా.. పాండ్య (20)తో కలిసి సాహా మరో 45 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. హార్దిక్ పాండ్య 20 బంతుల్లో 20 పరుగులు చేసి వేగంగా ఆడినా.. టెస్టు ఇన్నింగ్స్‌ను నిర్మించలేకపోయాడు. ఇక టీ విరామానికి ముందు బ్యాట్ పట్టిన జడేజా (70).. ధనాధన్ మెరుపులతో ఆకట్టుకున్నాడు. మూడు సిక్సర్లు, నాల్గు ఫోర్లతో చెలరేగిన జడేజా.. 70 బంతుల్లోనే అర్థ సెంచరీ నమోదు చేశాడు. సాహాతో కలిసి వేగంగా 72 పరుగులు జోడించిన జడేజా.. తర్వాత మహ్మద్ షమి (19, 8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో 30 రన్స్, ఉమేశ్ యాదవ్ (8)తో అజేయంగా 24 పరుగులు జోడించాడు. షమి రెండు సిక్సర్లతో అలరించాడు. మూడో సెషన్‌లో 8 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్.. ఏకంగా 68 పరుగులు రాబట్టుకున్నది. జడేజా, ఉమేశ్‌లు క్రీజులో అజేయంగా నిలిచారు.

సెషన్ల వారీగా..

తొలి సెషన్
భారత్ బ్యాటింగ్
పరుగులు : 98
వికెట్లు : 02
ఓవర్లు : 30

రెండో సెషన్
పరుగులు : 111
వికెట్లు : 02
ఓవర్లు : 30

మూడో సెషన్
పరుగులు : 69
వికెట్లు : 01
ఓవర్లు : 08

శ్రీలంక బ్యాటింగ్
పరుగులు : 50
వికెట్లు : 02
ఓవర్లు : 20



ఉపుల్ తరంగ క్యాచ్ అందుకున్న ఆనందంలో లోకేశ్ రాహుల్

భారత్ తొలి ఇన్నింగ్స్ : శిఖర్ ధావన్ (ఎల్బీ) పెరీరా 35, లోకేశ్ రాహుల్ రనౌట్ (చండిమాల్/డిక్‌వాలా) 57, చటేశ్వర్ పుజారా (ఎల్బీ) కరుణరత్నె 133, విరాట్ కోహ్లి (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13, అజింక్య రహానె (స్టంప్డ్) డిక్‌వాలా (బి) పుష్పకుమార 132, అశ్విన్ (బి) హెరాత్ 54, వృద్ధిమాన్ సాహా (సి) డిక్‌వాలా (బి) హెరాత్ 67, హార్దిక్ పాండ్య (సి) మాథ్యూస్ (బి) పుష్పకుమార 20, రవీంద్ర జడేజా నాటౌట్ 70, మహ్మద్ షమి (సి) తరంగ (బి) హెరాత్ 19, ఉమేశ్ యాదవ్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 14, **మొత్తం : (158 ఓవర్లలో 9 వికెట్లకు) 622 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం : 1-56, 2-109, 3-133, 4-350, 5-413, 6-451, 7-496, 8-568, 9-598.

బౌలింగ్ : నువాన్ ప్రదీప్ ఫెర్నాండో 17.4-2- 63-0, రంగన హెరాత్ 42-7-154-4, కరుణరత్నె 8-0-31-1, దిల్‌రువన్ పెరీరా 40-3-147-1, పుష్పకుమార 38.2-2-156-2, డిసిల్వ 12-0-59-0.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : కరుణరత్నె (సి) రహానె (బి) అశ్విన్ 25, ఉపుల్ తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0, మెండిస్ బ్యాటింగ్ 16,చండిమాల్ బ్యాటింగ్ 8, ఎక్స్‌ట్రాలు : 1, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 50.**

వికెట్ల పతనం : 1-0, 2-33.

బౌలింగ్ : షమి 3-1-7-0, అశ్విన్ 10-2-38-2, రవీంద్ర జడేజా 7-4-4-0.



డబుల్ టైటిల్ పోరు

నేడు విజేందర్ X జుల్ఫికర్ బిగ్‌ఫైట్

ముంబయి : ప్రో బాక్సింగ్‌లో ఇద్దరు మిడిల్ వెయిట్ ఛాంపియన్ల మధ్య ముంబయిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం వేదికగా భారీ సమరానికి తెరలేవనుంది. వరుసగా ఎనిమిది బౌట్లలో జయభేరి మోగించిన భారత స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్, చైనా నెం:1 బాక్సర్ జుల్ఫికర్ మైమతియాలి డబుల్ టైటిల్ పోరుకు అమీతుమీ సిద్ధం అయ్యారు. వీరిద్దరూ మిడిల్ వెయిట్ కేటగిరుల్లో ఛాంపియన్‌లు నిలిచారు. జుల్ఫికర్ కంటే విజేందర్ పదేండ్లు చిన్నవాడు. విజేందర్ 76 కేజీలు , జుల్ఫికర్ 75.9 కేజీలు ఉన్నారు. రింగ్‌లో దిగిన కొన్ని నిమిషాల్లోనే ప్రత్యర్థులను చిత్తు చేస్తూ మంచి దూకుడు మీద ఉన్న విజేందర్ సింగ్ ఇక్కడ త్వరగా 45 సెకన్లల్లోనే పోరు ముగించాలని పట్టుదలతో ఉన్నాడు.

రోహిత్ కూత కేక

తలైవాస్‌పై బుల్స్ ఉత్కంఠ విజయం

32-31తో తమిళనాడుపై బెంగళూర్ పైచేయి

ప్రో కబడ్డీ లీగ్-5

నవతెలంగాణ-నాగ్‌పూర్ : కెప్టెన్, స్టార్ రైడర్ రోహిత్ కుమార్ కూతకెళ్లి కేకపెట్టిన వేళ తమిళ తలైవాస్‌పై బెంగళూర్ బుల్స్ మెరుపు విజయం సాధించింది. నాగ్‌పూర్ వేదికగా సొంతగడ్డ సీజన్ ఆడుతున్న బెంగళూర్ బుల్స్.. ఆఖరి నిమిషాల్లో అత్యంత ఉత్కంఠకు దారితీసిన పోరులో తలైవాస్‌పై పైచేయి నిలుపుకున్నది. 32-31తో ఒక్క పాయింట్ తేడాతో విజయం సాధించి.. సొంత గడ్డ సీజన్‌ను ఘనంగా ఆరంభించింది. రోహిత్ కుమార్ 9 సక్సెస్‌ఫుల్ రైడ్లలో 11 పాయింట్లు తీసుకొచ్చాడు. స్టార్ రైడర్ సక్సెస్‌ఫుల్ కూతతో బుల్స్ గట్టెక్కింది. **మరో మ్యాచ్‌లో 26-21 తేడాతో ఢిల్లీపై పుణె జట్టు విజయం సాధించింది.**



తమిళ తలైవాస్ మరోసారి నిరాశజనక ఫలితంతోనే సరిపెట్టుకోక తప్పలేదు. బెంగళూర్ బుల్స్‌తో ఒక్క పాయింట్ తేడాతోనే ఓడినా.. నిజానికి తలైవాస్ మ్యాచ్‌లో మెజార్టీ భాగం వెనుకంజలోనే నిలిచారు. ప్రథమార్థంలో దుమ్మురేపిన బుల్స్ 23-8తో తిరుగులేని ఆధిక్యం సాధించింది. ఈ సమయంలో తలైవాస్ పూర్తిగా విఫలమైంది. రెండు సార్లు ఆలౌట్ చేసిన బుల్స్.. తలైవాస్‌ను చిత్తు చేసింది. కానీ ద్వితియార్థంలో ఆఖరి ఐదు నిమిషాల్లో అమోఘంగా పుంజుకున్న తలైవాస్ 22-31 నుంచి 31-32తో రేసులోకి దూసుకొచ్చింది. ఈ సమయంలో రోహిత్ కుమార్ సక్సెస్‌ఫుల్ రైడ్ మరో పాయింట్ సాధించిన బుల్స్ 32-30తో ఆధిక్యంలో నిలిచారు. ఆఖరి రైడ్‌లో తమిళ జట్టు మరో పాయింటు సాధించిన ఓటమి నుంచి తప్పించుకోవడానికి అది సరిపోలేదు. బెంగళూర్‌లో రోహిత్ కుమార్ సహా అనీశ్ కుమార్ ఆరు పాయింట్లు కొట్టగా.. మహిందర్ సింగ్ 5 పాయింట్లు సాధించాడు. డిఫెండర్ రవీందర్ పహల్ 3 టాకిల్స్‌తో మెరిశాడు. మరోవైపు తమిళ జట్టులో ప్రపంజన్, అజయ్ ఠాకూర్‌లు చెరో ఆరు పాయింట్లు సాధించగా.. డిఫెండర్లు అమిత్ హుడా మూడు టాకిల్స్ చేశాడు. డాంగ్ లీ మూడు రైడ్ పాయింట్లతో ద్వితియార్థంలో మెరిశాడు. రైడింగ్‌లో బెంగళూర్ (15), తమిళ తలైవాస్ (16) సమవుజ్జీలుగా నిలిచారు. కానీ డిఫెన్స్‌లో బెంగళూర్ (13) ప్రత్యర్థి తమిళ తలైవాస్ (8)పై స్పష్టమైన ఆధిపత్యం చెలాయించింది. ఇరు జట్లూ చెరో రెండు సార్లు ప్రత్యర్థిని ఆలౌట్ చేశాయి.

సిటీ ఓపెన్ క్వార్టర్స్‌కు యూకీ బాంబ్రీ

వాషింగ్టన్: అమెరికాలో జరుగుతున్న సిటీ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత యవ ఆటగాడు యూకీ బాంబ్రీ తన జైత్రయాత్రను కొనసాగిస్తున్నాడు. ప్రపంచ నెం:22 ర్యాంకర్ మోనాఫిల్స్(ఫ్రాన్స్)పై రెండో రౌండ్‌లో సంచలన విజయం నమోదు చేశాడు. ప్రి క్వార్టర్స్‌లో అర్జంటీనాకు చెందిన గుడియో పెల్లాపై 6-7, 6-3, 6-1తో జయభేరి మోగించి క్వార్టర్స్‌కు ప్రవేశించాడు. సెమీస్ బెర్త్ కోసం బాంబ్రీ ప్రపంచ నెం:45 కెవిన్ అండర్సన్‌తో పోరు సలపనున్నాడు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.